ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 17.03.2026 | సంపుటి :12 సంచిక : 237 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## అట్టహాసంగా 'ఆస్కార్' అవార్డుల ప్రదానోత్సవం

ఉత్తమ చిత్రంతోపాటు ఆరు విభాగాల్లో అవార్డులు పొందిన 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' సినిమా

2లో..



## 31వరకు అసెంబ్లీ సమావేశాలు

- 20న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- 23, 24, 25, 26 తేదీల్లో పద్దుపై చర్చ
- ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం
- కేవలం వారం రోజుల్లోనే ముగిస్తే కుదరదు
- సమావేశాల నిర్వహణపై హరీశ్ అసంతృప్తి

2లో..

## అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

- ఆవిష్కరించిన గవర్నర్
- పుష్పాంజలి ఘటించిన సీఎం రేవంత్, మంత్రులు

2లో..

# రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టిగా ఉంది

"ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్ ఉంటుంది. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. మూసీ నదిని ప్రక్షాళన చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నరేగా ద్వారా 6.52 కోట్ల పనిదినాల ఉపాధి కల్పించాం. ఎస్‌హెచ్ జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఆరోగ్య మౌలిక సదుపాయాల కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం" - గవర్నర్ శివప్రతాప్ శుక్లా


### విజన్ 2047తో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్

- రాష్ట్రంలో ప్రతి పౌరుడికి అభివృద్ధిలో భాగస్వామ్యం
- ఈ మేరకు తెలంగాణ బడ్జెట్ రూపకల్పన
- దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం అందిస్తోంది
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్ర అభివృద్ధి
- గ్లోబల్‌సమ్మిట్‌తో రూ.5 లక్షలకోట్లకు పైగా పెట్టుబడులు
- హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు
- రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- మూసీనది ప్రక్షాళనకు పథకాల రచన చేపట్టాం
- ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరిక
- అసెంబ్లీ సమావేశాల తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా



హైదరాబాద్(జనంసాక్షి):ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో తొలిసారి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగించారు. తొలుత గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంవిశేషం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని గవర్నర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం

మిగతా 2లో..



## సభకు సభ్యులందరూ రావాల్సిందే

- అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే
- సిఎల్పీ సమావేశానికి కొందరు డుమ్మాపై సీఎం సీరియస్
- ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలతో సిద్ధంగా ఉండాలి
- గవర్నర్ ప్రసంగం మనకు రోడ్ మ్యాప్ లాంటిది
- కేసీఆర్ హయాంలో విపక్షానికి మాట్లాడే సమయం ఇవ్వలేదు
- సీఎల్‌పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

2లో..

## గవర్నర్ ప్రసంగంలో గ్యారెంటీల ప్రస్తావనేదీ?

- కొత్త గవర్నర్‌తో అబద్దాలు చెప్పించిన కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ నేతల విమర్శలు

12లో..

## హామీల అమలుపై స్పష్టత కరువు

గవర్నర్ ప్రసంగంపై బీజెపి పెదవి విరుపు

2లో..



## నందిని సిద్ధారెడ్డికి అత్యుత్తమ పురస్కారం

కరోనా కష్టాలపై రాసిన 'అనిమేష'కు గాను అవార్డు ప్రకటన

అవార్డుపై సాహితీవేత్తలు, పలువురు ప్రముఖుల హర్షం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 లభించింది. ఆయన కవితా సంపుటి 'అనిమేష' లో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా, మంజీరా రచయితల సంఘం ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఊపునిచ్చి, తెలంగాణ ఉద్యమానికి తన కవిత్వం ద్వారా గొప్ప సహకారానిచ్చిన ఆయన తెలంగాణ సాహిత్యానికి గర్వకారణం. నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా పనిచేశారు. తన కలం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆత్మ, జీవన విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణ

మిగతా 2లో..

## ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం: కేటీఆర్

2లో..

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- నివాసంలో లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు నోటీసులు
- ఏప్రిల్ 30వరకు గడువు.. అనర్హుల స్థానంలో అర్హులకు కేటాయిస్తాం
- క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ
- మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, పొంగులేటి సమీక్ష

హైదరాబాద్ (జనంసాక్షి): హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ ( కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ

మిగతా 2లో..



## హమ్మయ్య.. గ్యాస్ నౌక వచ్చేసింది

- భారత్‌కు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ 'శివాలిక్'..
- రేపు 'జగ్ లాడ్కీ' చమురు నౌక రాక!
- ఇంకా జలసంధి వద్ద 22 భారత నౌకలు
- సురక్షితంగా 616 మంది నావికులు
- ముందస్తు లేకుండా సరిహద్దులు వద్దకు వెళ్లకండి
- ఇరాన్‌లోని భారతీయులకు భారత ఎంబసీ అలర్ట్
- ఇరాన్‌పై దాడులకు మోదీ పర్యటనకు ఏ సంబంధం లేదు: ఇజ్రాయెల్ రాయబారి




అహ్మదాబాద్(జనంసాక్షి):పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళన నెలకొన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎల్పీజీని మోసుకొచ్చిన శివాలిక్ ట్యాంకర్ సోమవారం భారత్‌కు చేరుకుంది. ఈ రోజు సాయంత్రం గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌కు వచ్చింది. ఈ శివాలిక్ నౌకలో 45,000 మెట్రిక్ టన్నుల గ్యాస్ భారత్‌కు

మిగతా 2లో..

# ఇరాన్ డ్రోన్ దాడులు ఉధృతం

- దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి
- ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు
- తాత్కాలికంగా ఏయిర్‌పోర్టు మూసివేత





- అమెరికా యుద్ధనౌకకు సాయం చేస్తే.. టార్గెట్ చేస్తాం
- లాజిస్టికల్, సర్వీస్ సెంటర్‌లకు ఐఆర్‌జీసీ తీవ్ర హెచ్చరికలు
- యుద్ధరంగంలోకి తొలిసారి ఇరాన్ 'డ్యాన్సింగ్ మిసైల్'..!
- హర్మూజ్‌ను తప్పించి రెడ్‌సీ మీదుగా సౌదీ చమురు ఎగుమతి

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. తన పొరుగు దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం

మిగతా 2లో..

## హర్మూజ్‌కు రక్షణ కల్పిద్దాం రండి

- మిత్ర దేశాలకు చైనా పిలుపు
- వస్తాం కానీ.. ముందు ఇరాన్‌పై సైనిక చర్యలు ఆపండి
- అమెరికాకు చైనా షరతు
- మేం రాలేం.. ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా
- సంయమనం పాటించాలన్న జపాన్
- ఇరాన్ చమురుపై ట్రంప్ కన్ను.. ఖర్గ్ స్వాధీనానికి సన్నాహాలు



2లో..

## సీఎం అసమర్థత వల్లే నీటి హక్కుల్లో తెలంగాణకు అన్యాయం

ఆయన చేసిన ద్రోహాన్ని ప్రతిసారి ఎత్తిచూపుతున్నాం:హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని ప్రతిసారి ఎత్తిచూపుతున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి, కృష్ణా జలాల హక్కుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెదేపా చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ మీటింగ్‌కు వెళ్లటం లేదంటూనే.. ఏపీ డిమాండ్లకు సంతకం చేసి వస్తున్నారని విమర్శించారు."ఇటీవల జరిగిన సీడబ్ల్యూసీ మీటింగ్ అజెండా

మిగతా 2లో..



### బెంగాల్ ఎన్నికల షెడ్యూల్

## కీలక అధికారులపై వేటు

- డీజీపీ, చీఫ్ సెక్రటరీల బదిలీకి ఈసీ ఆదేశాలు
- మండిపడ్డ సీఎం మమతా బెనర్జీ
- దీదీపై పోటీకి బరిలోకి సువేందు అధికారి
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెంగాల్, కేరళలో తొలి జాబితా విడుదల చేసిన బీజేపీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన గంటల వ్యవధిలోనే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలు తీవ్ర చర్చనీయాంశ మయ్యాయి. రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీ సహా నలుగురు కీలక వ్యక్తులపై ఈసీ వేటు వేసింది. ఆయా పదవుల్లో కొత్తవారిని నియమించాలని ఆదేశిస్తూ బెంగాల్ ప్రభుత్వానికి లేఖ పంపింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఆ స్థానంలో దుష్యంత్ నరియాలను నియమించింది. మరోవైపు హోం శాఖ కార్యదర్శి జగదీశ్ ప్రసాద్ మీనాపైనా ఈసీ వేటు వేసింది. ఈ పదవిలో ఐఏఎస్ అధికారి సంఘమిత్ర ఘోష్‌ని నియమించింది. ఇక, రాష్ట్ర డీజీపీ పీయూష్ పాండేను తొలగించి సీనియర్ ఐపీఎస్ అధికారి సిధ్ నాథ్ గుప్తాకు ఆ బాధ్యతలు అప్పగించింది. కోల్‌కతా పోలీసు కమిషనర్‌గా ఉన్న సుప్రతిమ్ సర్కార్‌ను తప్పించి.. అజయ్ కుమార్ నంద్‌ను నియమించింది. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధత కోసం చేపట్టిన సమీక్ష అనంతరం వీరిని ఆ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు ఈసీ తమ లేఖలో వెల్లడించింది. తొలగించిన అధికారులను ఎన్నికలు పూర్తయ్యేంతవరకు పోలింగ్ సంబంధిత విధుల్లోకి తీసుకోవద్దని ఈసీ

మిగతా 2లో..

## కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి

సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణామం

## ఆరేళ్ల బాలికపై కామాంధుడి అత్యాచారం,హత్య

హైదరాబాద్ నార్సింగ్‌లో దారుణం

## ప్రాణాలు తీసిన చేపల వేట

మూసీలో మునిగి ముగ్గురు యువకులు మృతి

వివరాలు లోపలి పేజీల్లో..

## టారీఫ్‌లపై స్పష్టత వచ్చాకే వాణిజ్య ఒప్పందంపై ముందుకెళతాం

ఆ తర్వాతే ట్రేడ్ డీల్‌పై సంతకాలు: కేంద్రం



న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికాతో టారిఫ్‌ల విషయంలో స్పష్టత వచ్చాకే వాణిజ్య ఒప్పందంపై ముందుకెళతామని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. వాస్తవానికి ఫిబ్రవరి మొదటివారంలోనే ఇరుదేశాల మధ్య తొలిదశ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఫ్రేమ్‌వర్క్‌నకు ఆమోదం తెలిపాయి. దాని ప్రకారం భారత్‌పై 18 శాతం సుంకాలు విధించేందుకు అమెరికా అంగీకరించింది. ఇందులోభాగంగానే మార్చి నెలలో ఒప్పందంపై సంతకాలు జరగాల్సిఉంది. కానీ, ఇంతలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టి వేసింది.దీంతో ట్రంప్ అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ 122ను ప్రయోగించి అన్ని దేశాల పైనా 10 శాతం టారిఫ్‌లను విధించారు. ఇవి ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయి. దీంతో టారిఫ్‌ల అంశంపై అస్పష్టత నెలకొంది. ప్రస్తుతం గ్లోబల్ టారిఫ్ ఆర్కిటెక్చర్‌పై అమెరికా పని చేస్తోందని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. అది ఖరారయ్యాక వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరుగుతాయన్నారు. ట్రేడ్ డీల్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఇరుదేశాల మధ్య ఎలాంటి విభేదాలూ లేవని స్పష్టంచేశారు.

# రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టిగా ఉంది

అందిస్తోందని తెలిపారు. ప్రపంచానికే దిక్సూచిగా తెలంగాణ నిలుస్తోందని అన్నారు. ఏడాది కాలంలో సంక్షేమ ఫలితాలు అందరికీ అందేలా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కోర్, ప్యూర్, రేర్‌గా విభజించామని, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని గవర్నర్ తెలిపారు. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు చేపట్టామని గవర్నర్ తెలిపారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించేందుకు నాలుగు కమిషనరేట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూసీనది ప్రక్షాళనకు ప్రణాళికలు రచిస్తున్నామని, తొలి దశలో హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి చేపడతామని ఆయన చెప్పారు. మూసీలో మురుగు నీరు చేరకుండా 39 ఆర్‌ఓబిలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఓఆర్ఆర్ మాదిరిగా రీజినల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయబోతున్నా మని గవర్నర్ తెలిపారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని నిర్ణయించామని గవర్నర్ తెలిపారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 72 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌కు అనుబంధంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం చేపడతామని వివరించారు. బుల్లెట్ రైళ్లకు శంషాబాద్ కేంద్రంగా మారబోతోందన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్టులు రాబోతున్నా యని గవర్నర్ వెల్లడించారు. ఇల్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని గవర్నర్ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 4లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.9వేల కోట్లు అందించామని చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కొడంగల్ ప్రాంతం పారిశ్రామికవాడగా మారబోతోందని గవర్నర్ వెల్లడించారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరాయన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి రేర్ నమూనా రూపొందించామని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలుకు 99 రోజుల కార్యాచరణ రూపొందించి నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 64,697 పిటిషన్లలో 47,670 పరిష్కరించామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందనిశుక్లా అన్నారు. ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. శ్రమించేతత్వం గల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. ప్రజా కేంద్రీకృత పాలన ప్రభుత్వ విధానం. విజన్-2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్డు మ్యాప్ రూపొందించాం. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18లక్షలకు చేరింది. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్ అనుసరిస్తున్నాం. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందని అంచనా. జీహెచ్ఎంసీని ఇటీవలే 3 కార్పొరేషన్లుగా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించాం. హైడ్రా ద్వారా రూ.60వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం. 23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ.1700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. జీసీసీలలో 20 శాతం ఆతిథ్యం ఇస్తూ హైదరాబాద్ గ్లోబల్ టెక్ హబ్‌గా మారింది. ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ కొనసాగుతోంది. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ రంగం 9.39లక్షల ఉద్యోగాలు కల్పిస్తోందని అన్నారు. గతేడాది వానాకాలంలో రైతుభరోసా కింద రూ.8,744 కోట్లు ఇచ్చాం. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేశాం. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా 15.12లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయి. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఈగల్ ప్రత్యేక బృందం ద్వారా డ్రగ్స్‌సమస్యను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. టీజీపీఎస్సీ, ఇతర నియామక బోర్డులను సంస్కరించాం. రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాలను భర్తీ చేశాం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం' అని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తొలుత గవర్నర్ అసెంబ్లీకి చేరుకోగానే సిఎం రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌లు స్వాగతం పలికారు. అయితే శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు.

## 31 వరకు అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహ ణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహిం చాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమియ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

**కేవలం వారం రోజుల్లోనే ముగిస్తే కుదరదు: హరీష్**

తెలంగాణ శాసనసభ బ్జడెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు.

## అట్టహాసంగా 'ఆస్కార్' అవార్డుల ప్రదానోత్సవం

వాషింగ్టన్(జనంసాక్షి):98వ అకాడమి అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. క్రేజీ సినిమాలు ఆస్కార్ అవార్డులను సొంతం చేసుకున్నాయి. భారతీయ చిత్రాలకు ఈ సారి నిరాశే ఎదురయ్యింది. అలాగే 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్', 'సిన్నర్స్' చిత్రాలకు అవార్డుల దక్కాయి. వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ మూవీకి ఆరు, సిన్నర్స్ కి ఐదు అవార్డులు దక్కాయి. ఉత్తమ నటుడిగా మైఖేల్ బి జోర్డన్ నిలిచారు. సిన్నర్స్ చిత్రానికి గానూ ఆయనకు ఈ పురస్కారం దక్కింది. అలాగే ఉత్తమ నటిగా జెస్సీ బక్లే కి ఆస్కార్ వరించింది. ఆమెకి హామ్నెట్ మూవీకి ఈ అవార్డు దక్కడం విశేషం. ఇక వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ మూవీకిగానూ పాల్ థామస్ ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్‌ని సొంతం చేసుకున్నారు. అంతేకాదు ఇదే మూవీ ఉత్తమ చిత్రంగానూ నిలిచింది.

## సభకు సభ్యులందరూ రావాల్సిందే

హైదరాబాద్(జనంసాక్షి): శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేల అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభ సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశం చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు.

### ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం: కేటీఆర్

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని తెలిపారు.

## హామీలపై అమలుపై స్పష్టత కరువు

హైదరాబాద్(జనంసాక్షి):గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదని తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారని... ఎస్సీల్లో అయినా వారికి బెనిఫిట్స్ అందలేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలను పూర్తిగా మోసం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సబ్ ప్లాన్ ముచ్చటే లేదన్నారు. ప్రభుత్వ అప్పులపై స్పష్టత లేదని తెలిపారు. గవర్నర్‌తో ప్రభుత్వం ఏదైనా మాట్లాడించేటప్పుడు ఆలోచించాలని.. అన్నీ అవాస్తవాలు, గందరగోళమైన మాటలు మాట్లాడించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం విస్మరించినంత మాత్రాన తాము విడిచిపెట్టమని... తెలంగాణ ప్రజల గొంతుకగా బీజేపీ నిలబడి పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. సెంట్రల్‌లో తెలంగాణ గేయం తర్వాత వందేమాతరం గేయాన్ని ఆలపించకుండా ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని అవమానించారని మండిపడ్డారు. ఎంఐఎం ఎమ్మెల్యేల తీరు సిగ్గుచేటన్నారు. వందేమాతరం వివాదానికి ఆస్కారం లేదా? లేక దేశభక్తి లేకపోవడమా అని ప్రశ్నించారు. వందేమాతరం గేయాన్ని అవమానపరిచిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి):శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునరుద్ధరించిన మండలి భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నంగా నూతనంగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వైభవంగా ఆవిష్కరించారు. ఈ చారిత్రక ఘట్టం రాష్ట్ర ప్రముఖులు, మండలి సమక్షంలో అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాల వద్ద గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి వారు చేసిన అసమాన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల పోరాట పటిమకు, సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని ఆయన అభివర్ణించారు.

**సౌత్‌ర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
**ఆపరేషన్ మేడ్చల్ సర్కిల్**

టెండర్ నోటీసు సం. 11/2025-26

old-Ext-III-Tsp.No.59,71,87/25-26,Ext-II-Tsp.No.98&133/25-26,Ext-I-Tsp.No.152,153,155, to 161, 166,178,189&193/25-26 & Nes Tsp No.202 to 214/25-26

[illegible] www.tgsouthernpower.org [illegible]

సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు
ఆపరేషన్ సర్కిల్,మేడ్చల్

DIPR No.17066-PP/CL/ADVT/1/2025-26

## నందిని సిద్ధారెడ్డికి అత్యుత్తమ పురస్కారం

సాహిత్యానికి అగ్రగామిగా నిలిచారు. ఆయన రచనలు కేవలం కవిత్వం మాత్రమే కాక, తెలంగాణ జీవితం, ప్రజల సమస్యలు, ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. మెదక్ జిల్లా కేంద్రంగా 'మంజీరా రచయితల సంఘం' స్థాపించి, ఎందరో వర్ధమాన కవులను, రచయితలను ప్రోత్సహించారు. సాహిత్యానికి ప్రాంతీయతను అద్దడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఈ సంఘం ద్వారా తెలుగు సాహిత్యంలో నూతనవాణి, విభిన్న అభివ్యక్తులు, సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ సంఘం తెలుగు సాహిత్యానికి కొత్త వన్నె తెచ్చి, యువ రచయితలకు ప్రేరణనిస్తూ, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన సృజనాత్మక రచనల ద్వారా చాటుతూ తెలంగాణ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది. ఈ అవార్డు తెచ్చిపెట్టిన 'అనిమేష' కవితా సంపుటి కేవలం అక్షరాల కూర్పు కాదు అది ఒక కాలానికి దర్పణం.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలోగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎంతమంది స్పందించారు అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్దిదారులకు కేటాయించాలన్నారు. అదేవిధంగా వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దె ప్రాతిపదకన గాకుండా వేలం పద్ధతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. అంతేగాక ప్రజా ప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని తెలిపారు.

## హమ్మయ్య.. గ్యాస్ నౌక వచ్చేసింది

వచ్చిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. హర్మూజ్ జలసంధిని దాటుకొని ఈరోజు సాయంత్రం చేరుకుంటుందని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఇప్పటికే వెల్లడించారు. 80వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌తో వస్తోన్న 'జగ్ లాడ్కీ' నౌక మంగళవారం భారత్‌కు చేరుకుంటుందని చెప్పారు. అలాగే పర్షియన్ గల్ఫ్‌కు పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిల్లో 616 మంది నావికులు సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు రెండురోజుల క్రితం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. అందులో ఒకటి శివాలిక్ కాగా.. మరొకటి నందాదేవి. శివాలిక్ తాజాగా భారత్ చేరుకోగా.. 'నందాదేవి' త్వరలోనే 45 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్‌ను తీసుకొని రానుంది.

## కీలక అధికారులపై వేటు

ఆదేశించింది. తమ నిర్ణయాలు తక్షణమే అమలు చేయాలని, దీనిపై ఈ మధ్యాహ్నం లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూచించింది. అయితే, ఈసీ చర్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ సోమవారం సాయంత్రం వీధుల్లో ఆందోళన చేపడుతామని వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా రాజకీయ దుమారం రేపుతోంది. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న లెక్కింపు ఉండనుంది. ఇదిలాఉండగా ఓటర్ల జాబితా, సవరణల వంటి విషయాల్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్‌ల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే.

బెంగాల్, కేరళలో బిజెపి తొలి జాబితా విడుదల

పశ్చిమ బెంగాల్, కేరళ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగిన మరుసటి రోజే భాజపా తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్థానమైన భవానీపుర్ నుంచి రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారిని బరిలోకి దింపింది. నందిగ్రామ్ నుంచి కూడా ఆయనే పోటీ చేయనున్నారు.

## సీఎం అసమర్థత వల్లే నీటి హక్కుల్లో తెలంగాణకు అన్యాయం

మొదటి అంశం... పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు. అజెండాలో నల్లమల సాగర్ లేకపోతేనే మీటింగ్‌కు వస్తామని చెప్పి, తర్వాత వెళ్లిపోయి తెలంగాణను మోసం చేశారు. రాష్ట్రాల మధ్య గోదావరి జలాల పంపిణీయే జరగలేదని సీడబ్ల్యూసీ సమావేశంలో జీఆర్ఎంబీ చెప్పింది. జలాల పంపిణీ జరగలేదని జీఆర్ఎంబీ ఎలా చెబుతుంది? గోదావరిలో నీటి కేటాయింపులు జరగకపోతే.. ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇస్తున్నారు? గోదావరి బేసిన్‌లో వివిధ రాష్ట్రాలు చేపట్టిన 76 ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇచ్చారు? సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతోంది" అని హరీశ్‌రావు విమర్శించారు.

# ఇరాన్ డ్రోన్ దాడులు ఉధృతం

సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్ జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా కొనసాగిస్తోన్న ఆపరేషన్‌లో అమెరికా విమాన వాహక నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఎర్రసముద్రంలో తనవంతు సహకారాన్ని అందిస్తోంది. ఈ క్రమంలో ఆ నౌకకు మద్దతిస్తున్న లాజిస్టికల్, సర్వీస్ సెంటర్‌లకు ఇరాన్ తీవ్ర హెచ్చరికలు చేసింది. ఈ క్యారియర్ గ్రూప్‌నకు సపోర్ట్ సెంటర్లుగా వ్యవహరిస్తున్న సంస్థలను టార్గెట్ చేసుకుంటామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వానికి చెందిన ప్రెస్‌టీవీలో ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌పై యుద్ధం మొదలుపెట్టడానికి ముందు జెరాల్డ్ నౌక కరేబియన్ సముద్రం నుంచి పశ్చిమాసియా దిశగా ప్రయాణించింది. దాడులు ప్రారంభించిన అనంతరం సూయజ్ కాలువ మీదుగా ఎర్ర సముద్రంలోకి ప్రవేశించింది. ప్రస్తుతం ఈ నౌక ఎర్ర సముద్రం నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా ఓడరేవు వైపు ప్రయాణిస్తున్నట్లు చైనా వాణిజ్య జియోస్పేషియల్ సంస్థ విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. దీని వల్ల ఇరాన్‌కు ప్రత్యక్ష ముప్పు పొంచి ఉండడంతో ఈ ప్రకటనను విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా విమాన వాహక నౌక కదలికలను ఇరాన్ దళాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయని ఐఆర్‌జీసీ అధికారులు వెల్లడించారు. నౌక ఇరాన్ సరిహద్దులోకి ప్రవేశించిన వెంటనే దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అమెరికాకు చెందిన మరో విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై ఇటీవల తాము దాడి చేయడంతో..అది గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఆస్తులే లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి దేశాల పైకి భారీగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది. తాజాగా ఇజ్రాయెల్, యూఎస్ స్థావరాలే లక్ష్యంగా చేసిన దాడుల్లో టెహ్రాన్ అధునాతన క్షిపణులను ప్రయోగించింది. యుద్ధంలో మొదటిసారిగా ఇరాన్ 'సెజ్జిల్ క్షిపణి'ని వినియోగించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణిని డ్యాన్సింగ్ మిసైల్, అషౌరా వంటి పేర్లతో పిలుస్తారు. సుదూరప్రాంతాల్లోని శత్రు లక్ష్యాలను ఇది సమర్థవంతంగా ధ్వంసం చేయగలదు.

ఏమిటీ డ్యాన్సింగ్ మిసైల్ ?

ఇరాన్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన డ్యాన్సింగ్ మిసైల్ రేంజి 2,000 కిలోమీటర్ల పైమాటే. ఇది 700 కిలోల వార్ హెడ్‌లను మోసుకెళ్లగలదు. అత్యధిక ఎత్తులో కూడా సమర్థవంతంగా తిరుగుతూ లక్ష్యాన్ని ఢీకొట్టే సామర్థ్యం ఉండడంతో దీనిని డ్యాన్సింగ్ మిసైల్ అని పిలుస్తారు. ఐరన్ డోమ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలను తప్పించుకునేలా దీనిని రూపొందించారు. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ ప్రకారం.. ఈ క్షిపణి దాదాపు 18 మీటర్ల పొడవు, 1.25 మీటర్ల వ్యాసం ఉంటుంది. దీని బరువు 23,600 కిలోగ్రాములు. ఈ క్షిపణుల రూపకల్పనను ఇరాన్ 1990లో ప్రారంభించింది. మొదటిసారిగా దీనిని 2008లో పరీక్షించారు. ఆ సమయంలో ఈ క్షిపణి దాదాపు 800 కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలుస్తోంది. మెరుగైన నావిగేషన్ వ్యవస్థలను రూపొందించి 2009లో రెండోసారి పరీక్షించారు. అనంతరం పలుమార్లు పరీక్షించారు. ఆరోసారి ప్రయోగం చేసే సమయంలో ఈ క్షిపణి హిందూ మహాసముద్రంలోకి దాదాపు 1,900 కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలుస్తోంది. ఇరాన్ యుద్ధంతో దశాబ్దాలుగా అంతర్జాతీయంగా కొనసాగుతున్న ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. హర్మూజ్ ఎఫెక్ట్‌తో గల్ఫ్ దేశాలు కొత్త మార్గాలపై దృష్టిపెడుతున్నాయి. ఈ క్రమంలో సౌదీ అరేబియా ఎర్ర సముద్రం మీదుగా చమురు ఎగుమతులను పెంచింది. ప్రస్తుత అంతరాయాల వేళ.. సౌదీ అరేబియా 'పెట్రోలైన్' (ఈస్ట్-వెస్ట్ క్రూడ్ ఆయిల్ పైప్‌లైన్ నెట్‌వర్క్) ఇంధన రవాణాలో కీలకంగా మారిపోయింది.

## హర్మూజ్‌కు రక్షణ కల్పిద్దాం రండి

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న హర్మూజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్దీకరించేందుకు ముందుకురావాలని ట్రంప్ పలు దేశాలను కోరారు. ఈ విషయంపై చైనా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ రక్షణకు తాము ముందుకురావాలంటే.. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, ప్రాంతీయ శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయన్నారు. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని లిన్ జియాన్ అమెరికాకు సూచించారు. ప్రస్తుత ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈనెల చివర్లో ట్రంప్ బీజింగ్ పర్యటన గురించి అమెరికాతో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో ఈ పర్యటన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. హర్మూజ్ ప్రాంతంలో చైనా ప్రయోజనాలే ఎక్కువని వ్యాఖ్యానించారు. ఆ జలసంధిని రక్షించేందుకు ముందుకురావాలని బీజింగ్‌కు పిలుపునిచ్చారు. ఆ దేశం ఇచ్చే సమాధానాన్ని బట్టి బీజింగ్ పర్యటనకు వెళ్లాలా, వాయిదా వేయాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానన్నారు.

ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా

హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది. బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

ఇరాన్ చమురుపై ట్రంప్ కన్ను.. ఖర్గ్ స్వాధీనానికి సన్నాహాలు

యుద్ధం ప్రారంభమై, సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని అంతమొందించి రెండు వారాలు దాటినా.. ఇరాన్‌లో పాలనాయంత్రాంగం మాత్రం కొనసాగుతోంది. దీంతో వెనెజువెలా మాదిరిగానే ఇక్కడి వనరులపై పెత్తనం చేయాలన్న ట్రంప్ ఆశ తీరలేదు. అందుకే.. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టు అయిన ఖర్గ్ ఐలాండ్‌పై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు.. ఇప్పుడు ఏకంగా దాన్ని ఆక్రమించాలని ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే తమ దళాలు జరిపిన దాడుల్లో అక్కడ చాలా భాగం ధ్వంసమైందని, మరిన్ని దాడులు జరగొచ్చని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## నాలుగు రోజుల తరవాత లాభాలు

### నష్టాల నుంచి తేరుకున్న సూచీలు

**న్యూఢిల్లీ, మార్చి 16 (జనంసాక్షి):** ఇరాన్ యుద్ధం కారణంగా వరుసగా నష్టపోతూ వస్తున్న దేశీయ సూచీలు సోమవారం యూటర్న్ తీసుకున్నాయి. ఉదయం నష్టాలతోనే ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చాయి. ఇంట్రాడే కనిష్ఠంతో పోల్చుకుంటే సెన్సెక్స్ దాదాపు రెండు వేల పాయింట్లు పైకి వచ్చింది. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం కలిసివచ్చింది. ఇటీవల బాగా నష్టపోయిన మెటల్, ఆటో, బ్యాంకింగ్, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపించారు. అలాగే హోర్ముజ్ జలసంధి నుంచి భారత ట్యాంకర్లు సురక్షితంగా గమ్యానికి చేరుకోవడం కూడా మదుపర్లలో సానుకూల ప్రభావాన్ని నింపింది. ఒక దశలో దాదాపు 600 పాయింట్లు కోల్పోయి 73,949 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం పరిస్థితి మారింది. ఇంట్రాడే కనిష్ఠంతో పోల్చుకుంటే ఒక దశలో సెన్సెక్స్ దాదాపు 2000 పాయింట్లు ఎగబాకింది. చివరకు 938 పాయింట్ల లాభంతో 75,502 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలా డింది. చివరకు 257 పాయింట్ల లాభంతో 23,408 వద్ద స్థిరప డింది. సెన్సెక్స్, నిఫ్టీలో అల్ట్రాక్రెక్ సిమెంట్, పేటీఎమ్, ఎమ్ అండ్ ఎమ్, గ్రాసిమ్, ట్రెంట్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. బంధన్ బ్యాంక్, ఐఓసీ, హిందుస్థాన్ పెట్రో, కేపీఐటీ టెక్నాలజీస్ మొదలైన షేర్లు నష్టాలను మూట గట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 655 పాయింట్లు ఆర్జించింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 146 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.42గా ఉంది.

## ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం పెంపొందాలి

- నందిపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- సీనియర్ అసిస్టెంట్ కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం



**ఆర్మూర్, (జనంసాక్షి):** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నందిపేట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, జనరల్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ గణేష్ హాజరు పట్టికలో సంతకాలు చేయకపోవడం గమనించిన కలెక్టర్ ఆయన గురించి వాకబు చేశారు. గత మూడు రోజులుగా పీహెచ్సీకి రాలేదని తెలియడంతో, సీనియర్ అసిస్టెంట్ గణేష్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల వివరాలను పరిశీలించి కీలక సూచనలు చేశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు.

# సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణామం

- నాంపల్లి కోర్టులో సిద్ధార్థరెడ్డి లొంగుబాటు

**హైదరాబాద్, (జనంసాక్షి):** తెలుగు రాష్ట్రాల్లో ఒకప్పుడు సంచల నం సృష్టించిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణా మం చోటుచేసుకుంది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడిగా ఉన్న సిద్దార్థ్ రెడ్డి 24 ఏళ్ల తర్వాత మీడియా ముందుకు వచ్చాడు. సుప్రీంకోర్టు తుది తీర్పు మేరకు ఆయన హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో లొంగిపో యాడు. ఈ కేసు రెండు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో కొనసాగుతోంది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తుది తీర్పుతో కేసులో మరో కీలక మలుపు తిరిగింది. నటి మరణ ఘటన తర్వాత సిద్దార్థ్ రెడ్డి అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. చాలాకాలంగా విదేశాల్లో ఉన్న ఆయన, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారత్‌కు వచ్చి కోర్టులో లొంగిపోయారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం నాలుగు వారాల్లోగా లొంగిపో వాలని చెప్పడంతో, ఆ గడువు లోపే నాంపల్లి కోర్టుకు వచ్చి సమ ర్పణ చేశాడు. ఈ ఘటన 2002 ఫిబ్రవరి 23వ తేదీన జరిగిం ది. అప్పట్లో నటి ప్రత్యూష, సిద్దార్థ్ రెడ్డి ఇద్దరూ కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగినట్లు పోలీసులు వెల్లడిం చారు. ఈ ఘటన తర్వాత ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రత్యూష ప్రాణాలు కోల్పోయింది. అయితే సిద్దార్థ్ రెడ్డి చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ సంఘటన ఆ సమయంలో తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద సంచలనంగా మారింది. ప్రత్యూష మృతి తర్వాత ఆమె కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆమె తల్లి ఈ ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని, హత్య జరిగి ఉండొచ్చని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె తల్లి న్యాయపోరాటం ప్రారంభించారు. కేసును కోర్టులో కొనసాగిస్తూ నిజం బయటకు రావాలని పట్టుదలగా పోరా డారు. పోలీసుల దర్యాప్తు అనంతరం సిద్దార్థ్‌రెడ్డి పై ఆత్మహత్యకు ప్రేరేపించినట్లుగా అభియోగాలు నమోదయ్యాయి. కేసు ట్రయల్ కోర్టులో విచారణకు వచ్చింది. ట్రయల్ కోర్టు విచారణలో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్దార్థ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును పరిశీలించిన తెలంగాణ హైకోర్టు శిక్షను కొంత తగ్గించింది. ఐదేళ్ల జైలు శిక్షను రెండు సంవత్సరాలకు తగ్గిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్దార్థ్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు చాలాకాలం పాటు సుప్రీంకోర్టులో విచారణలో కొనసా గింది.




చివరకు సుప్రీంకోర్టు హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిం చింది. సిద్దార్థ్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. తుది తీర్పులో భాగంగా సుప్రీంకోర్టు సిద్దార్థ్‌రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. నాలుగు వారాల్లోగా కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ఆయన హైదరాబాద్‌కు వచ్చి నాంపల్లి కోర్టులో లొంగిపోయారు. దాదాపు 24 ఏళ్ల తర్వాత ఈ కేసు మళ్లీ వార్తల్లోకి వచ్చింది. నటి ప్రత్యూష మరణం అప్పట్లో తెలుగు సినీ పరిశ్రమను కుదిపేసిన ఘటనగా గుర్తింపు పొందింది. ఇప్పుడు సుప్రీంకోర్టు తుది తీర్పుతో ఈ కేసులో న్యాయపరమైన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది.

# ఉద్యమకారుల సంక్షేమ వాగ్దానం అమలు చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ సమాఖ్య వివిధ ఉద్య మ సంఘాల వినతి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమం కోసం పొందుపరిచిన వాగ్దానాలను, ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో చర్చించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ సమాఖ్య – వివిధ ఉద్య మ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ సంఘాలన్ని ఏకతాటిపైకి వచ్చి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశాయి. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఉద్యమకారుడు, ఫిల్మ్ డైరెక్టర్ సయ్యద్ రఫీ అధ్యక్షత వహించగా.. పలు డిమాండ్లు నెరవేర్చాలని సమావేశం ఏకాభిప్రాయంతో తీర్మానించింది.

**తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు :** ఉద్యమ నాయకులు, ప్రభుత్వ ప్రతినిధులతో కూడిన ఉమ్మడి కమిటీని నియమించి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి. కేవలం ఎఫ్ఐఆర్‌ల ఆధారంగానే కాకుండా మీడియా ఆధారాలు, ఉద్యమ సంఘాల ధృవీకరణ ఆధారంగా ఉద్యమ కారులను గుర్తించాలి. ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభు త్వం గుర్తింపు కార్డులు జారీ చేసి, కార్పొరేట్ ఆస్పత్రు ల్లో ఉచిత వైద్యం, ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

**ఉద్యమకారుల కాలనీలు ఏర్పాటు :** ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యమ కారుల కోసం ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలి. ప్రతి ఉద్యమకా రునికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలి. ఇంటినిర్మాణానికి ప్రభుత్వమే ఆర్థిక సహకారం అందించాలి.

**నెలవారి గౌరవ భృతి :** గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారు లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల గౌరవ భృతి అందించాలి. నిరుద్యోగ ఉద్యమకారులకు వడ్డీలేని రుణాలు అందించాలి.

**అమరవీరుల కుటుంబాలకు సహాయం:** తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. అమరవీరుని తల్లి/తండ్రి/ భార్యకు నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్ అందించాలి.

**ఉద్యమకారులపై కేసుల ఉపసంహరణ :** తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలి. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు :తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు పన్నెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు



ఉద్యమకారులకు తగిన న్యాయం జరగలేదు. ఉద్యమకారుల త్యాగాలు, నిరంతర పోరాటల ఫలితంగా తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

**ఉద్యమకారుల జీవిత గాథలు ప్రచురణ :** తెలంగాణ విముక్తి కోసం సాగిన పోరాటాల్లో తృణప్రాయంగా తమ ప్రాణాలను సమర్పించిన యోధుల జీవిత గాథలను జిల్లాల వారీగా ప్రచురించాలని, పేర్కొన్న డిమాండ్లను ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి తక్షణమే అమలు చేయాలని, ఉద్యమకారుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించాలని కోరారు.

## పాతబస్తీలో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్ ఫలక్‌ను మా పరిధిలోని ఫరూక్‌నగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక బస్‌డిపో పక్కన ఉన్న దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరే గాయి. క్రమంగా అవి పక్కనున్న ఫర్నిచర్ షాపు, ఇతర దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిపమాక సిబ్బంది సం ఘటన స్థలికి చేరుకొని మంటలు ఆర్పుతు న్నారు. పక్కనే ఇండేన్ గ్యాస్ గోదాం ఉండటం తో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమ త్తమ య్యారు. వివరాలు తెలియాల్సి ఉంది.

## నందిని సిధారెడ్డికి సాహిత్య అకాడమీ అవార్డు

### తెలంగాణకు దక్కిన గౌరవమన్న బాలాచారి

**హైదరాబాద్, (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మొదటిసారిగా మంజీర రచయితల సంఘం తరపున తీర్మానం చేసిన నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించడం తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవంగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అభిప్రాయపడ్డారు. 'నాగేటి చాలల్ల నా తెలంగాణ' పాట ద్వారా తెలంగాణ గడప గడపను చైతన్య పరిచిన నందిని సిధారెడ్డి రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులుగా తెలంగాణ సాహిత్య వికాసానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని బాలాచారి గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం కరోనా కోరల్లో విలవిలలాడుతూ చావుబతుకుల మధ్య తండ్లాడుతుంటే ఒక కవిగా వేదనతో రాసిన 'అనిమేష' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించడం తెలంగాణ సాహిత్యానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్టుగా నామోజు బాలాచారి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో నందిని సిధారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఇండ్ల సాధన కమిటీ నిరసన

**హుజూర్ నగర్, (జనంసాక్షి):** పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో జరిగిన అన్యాయాలపై ఫణిగిరి గుట్ట ఆదర్శ కాలనీ ఇండ్ల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హుజూర్ నగర్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ బండారు కవిత కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు యల్క సోమయ్య గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో దశాబ్దాల కాలంగా సొంత ఇంటి కల కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్న పట్టణ పేద ప్రజలకు ఆందోళన కలిగించేలా రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 ఇండ్లలో కేవలం 805 ఇండ్లకు సంబంధించిన జాబితాను మాత్రమే ప్రకటించారని తెలిపారు. ప్రకటించిన జాబితాలో పట్టణంలో నివాసం ఉండని, ఆస్తుల కలిగిన, గతంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన అనర్హుల పేర్లు చేర్చబడ్డాయని, అర్హులైన ఇల్లు లేని నిరుపేదల పేర్లు లేకపోవడంతో మనస్థాపానికి గురవుతున్నారని, పేదలపై కర్కశంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులను జాబితాలో చేర్చిన అధికారులపై చర్యలు చేపట్టాలని, ప్రకటించిన జాబితాను వెంటనే సవరించి అందులో ఉన్న అనర్హుల




పేర్లను తొలగించి అర్హులైన ఇల్లు లేని పేదల పేర్లను చేర్చాలని, అలాగే మొత్తం 2160 ఇండ్లకు సంబంధించిన పూర్తి లబ్ధిదారుల జాబితాను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షులు యల్క సోమయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి మందడి విశాల నందిపాటి సైదులు, షేక్ ముస్తఫా, ఉమా, రామారావు తో పాటు పట్టణ పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు రాష్ట్రవ్యాప్తంగా 'ఫార్మర్ కిట్స్'

- పంపిణీని ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- 61,125 మంది రైతులకు లబ్ది
- జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా కార్యక్రమం

**హైదరాబాద్, (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులకు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం నుండి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## అరుదైన మొక్కల నిలయం బొటానికల్ గార్డెన్



**జడ్చర్ల, మార్చి 16 (జనంసాక్షి):** స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ బొటానికల్ గార్డెన్ 6వ ఆవిర్భావ దినోత్సవంను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా చెన్నై నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మాజీ చైర్మన్ సి. అచలేందర్ రెడ్డి, కళాశాల విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. ఎస్. ఆర్ రాజేందర్ సింగ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన చరక నెట్ హౌస్, వాండా ఆర్కిడేరియం, కాక్టస్ హౌస్‌లను అతిథులు ప్రారంభించి, మొక్కలు నాటారు. సమావేశంలో సి. అచలేందర్ రెడ్డి మాట్లాడుతూ గార్డెన్ ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అరుదైన మొక్కల విక్రయం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్ గార్డెన్ అభివృద్ధిని అభినందిస్తూ, రాష్ట్రంలోని ఇతర కళాశాలలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ బి. సదాశివయ్య మాట్లాడుతూ గత ఆరేళ్లలో 852 జాతులకు చెందిన 8 వేల మొక్కలను ఇక్కడ సంరక్షిస్తున్నామని, ఇది పరిశోధనలకు కేంద్ర బిందువుగా మారిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుకన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. డి.నర్మద, కె.లత వృక్షశాస్త్ర అధ్యాపకురాలు, కళా శా ల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో సూపరిండెంట్ ఈగల



**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** కరీంనగర్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్, అకౌంట్స్ కార్యాలయ సూపరింటెండెంట్ ఈగల మధు సూదన్ అవినీతికి పాల్పడి ఏసిబికి చిక్కారు. ఈ మేరకు సోమవారం రోజు కరీంనగర్‌లోని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ (డబ్ల్యుఏ) కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈగల మధుసూదన్(50)ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పెండింగ్ లో ఉన్న ఫైళ్లలోని తప్పులు, లోపాలను సరిదిద్దుతూ అధికారిక లబ్ది చేకూర్చేందుకు ఉద్యోగులు, కాంట్రాక్టర్ల నుంచి లంచాలు తీసుకుంటూ పరిశీలన చేసి ఆమోదిస్తున్నారు. ఈ క్రమంలో యూపిఐ లావాదేవీల ద్వారా లంచాలు డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఆయన పై ఆరోపణలు న్నాయి. ఈగల మధుసూ ధన్ కు భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో ఒక బినామీ పేరుతో ఉన్న ఖాతాను ఉపయో గించారు. 2022 సెప్టెంబర్ నుంచి 2023 సెప్టెంబర్ మధ్య కాలంలో ఈ ఖాతా ద్వారా రూ.14,77,033 లను నిందితుడు తన విధులు దుర్వినియోగం చేసి అక్రమంగా లంచాలు తీసుకున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ముందు హాజరుచారు. ఈ కేసు దర్యాప్తులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాం డ్ చేస్తే ప్రజలు వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- భోజనం కోసం ఆగిన కారుపై దూసుకెళ్లిన కంటెయినర్
- ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం

**మేడ్చెల్, (జనంసాక్షి) :** రోడ్డు పక్కన భోజనం కోసం కారు ఆపడమే వారి పాలిట శాపమైంది. కంటైనర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఓఆర్ఆర్ పక్కన కారు నిలిపి భోజనం చేస్తున్న సమయంలో వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టడంతో.. కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతులను మౌలాలికి చెందిన మహ్మద్ యూసుఫ్ ఖాన్ (51), కాప్రా సాకేత్‌కు చెందిన హుస్సేన్ (53)గా గుర్తించారు. మద్యం మత్తులో కంటైనర్ నడిపిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట సమీపంలో ఔటర్ రింగ్ రోడ్ పై జరిగింది. కారు ఆపి భోజనం చేస్తున్న వారిపై ఓ కంటైనర్ వేగంగా దూసుకెళ్లడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం ప్రకారం, నగరంలోని మౌలాలి ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆడి కారులో ప్రయాణిస్తున్నారు. శామీర్‌పేట సమీపంలోని ఓర్ఆర్‌పై వారు కారును ఆపి పక్కనే నిలబడి భోజనం చేస్తున్నారు. ఈ సమయంలో వేగంగా వచ్చిన కంటైనర్ వారిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదానికి అతి వేగమే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న వరి పొలాలు

- ఉల్లంపల్లిలో పొలాల్లో పశువులను మేపుతున్న రైతులు
- కాలువలు లేక..సాగునీరందక ప్రతిసారి రైతుల విలవిల



**చిగురుమామిడి (జనంసాక్షి) :** అడుగంటిన భూగర్భ జలాల వల్ల యాసంగి వరి పంటలు భారీగా ఎండిపోతున్నాయి. చేతికి అందాల్సిన పంట కళ్లముందే ఎండిపోవడంతో, నిస్సహాయులైన రైతులు ఎండిన పొలాల్లో పశువులను వదిలేస్తున్నారు. మెట్ట ప్రాంతమైన చిగురుమామిడి మండలంలోని రైతులు ఎక్కువ సంఖ్యలో బోర్లు, బావులపై ఆధారపడి పంటలు వరి పంట, మొక్కజొన్న పంటలను వేస్తుంటారు. చెరువులు, బోర్లు ఎండిపోవడం వల్ల పంటలకు చివరి దశలో నీరు అందడం కష్టంగా మారింది. వేరే దారి లేక రైతులు ఎండిన వరి చేనులో పశువులను మేతకు వదులుతున్నారు. భారీ పెట్టుబడులు పెట్టిన రైతులు, పంట నష్టంతో కంటతడి పెడుతున్నారు. పంట కోతకు వచ్చే సమయంలో నీరు అందకపోవడం వల్ల పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు తీవ్ర ఆందోళనల చెందుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలకు ఎలాగైనా సాగునీరు అందించాలనే లక్ష్యంతో కొంతమంది రైతులు బావుల్లో పుడుకతీతలు తీస్తుండగా, మరి కొంతమంది రైతులు అప్పులు చేసి బావులను తవ్వుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ చెరువులు, కుంటల్లో, బావుల్లో నీళ్లను చూసి సంతోషపడి ఆశగా పంటలను సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో నీళ్లు అందక ఎండిపోతున్నాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన అగ్రాజ్ మల్లయ్య, సమ్మయ్య ఇద్దరు అన్నదమ్ములు 5ఎకరాల్లో బోరు బావులపై ఆధారపడి వరి పంటను సాగు చేశారు. తీరా పొట్ట దశకు వచ్చే సమయంలో ఇప్పటికే మూడు ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోవడంతో పాటు మరో రెండు ఎకరాలు ఎండిపోయేందుకు సిద్ధంగా ఉందని తల్లడిల్లారు. పత్తెం పవన్ కుమార్ కు చెందిన ఎకరం వరి పంట, బల్లు సుధాకర్ కు చెందిన వరి పంట, పత్తెం సుమన్ కు చెందిన ఎకరంన్నర వరి పంట, పత్తెం సమ్మయ్య తండ్రి రామయ్యకు చెందిన వరి పంట సాగునీరు లేకపోవడంతో ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం సాగునీరు అందక పంట పొలాలు ఎండుతూనే ఉన్నాయని, ఎన్ని ప్రభుత్వాలు మారినా తమకు కాలువాలు లేక సాగునీరు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి ఏటా లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి నష్టపోతు న్నామె తప్ప ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయని రైతులు దీనంగా చెబుతున్నారు. రైతులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేస్తున్నారే తప్ప ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపిస్తున్నారు.

# కొడిమ్యాలలో పులి బాబోయ్!





**జగిత్యాల జిల్లా క్రైమ్ (జనంసాక్షి):** జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలంలోని దమ్మయ పేట గ్రామ శివారులో గంగారం తండా సూరంపేట్ పరిధిలో పులి ఆవులపై దాడి చేసి చంపడంతో తండా వాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వామ్మో పులి మళ్లీ వచ్చిందా అంటూ కొడిమెల రేంజ్ పరిధిలో గ్రామాలు సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తంగా ఉన్నారు. ఇటీవలే జిల్లా సరిహద్దు భాగంలో రాళ్లవాగు సమీపంలో ఉన్న పెద్దపులి మరల వెనుకకు తిరిగి రావడంతో మారుమూల గ్రామాలైన మొత్కరావుపేట, సూరంపేట, దమ్మయపేట గ్రామాల్లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. ఇటీవలే మొత్కరావు పేట గ్రామంలో మూడు ఆవులపై దాడి చేయడంతో ఇటీవల ఏనుగుల గంగరాజంకు చెందిన ఒక ఆవు మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఏది ఏమైనప్పటికి పులి దాడిలో మరణించిన ఆవులకు నష్టపరిహారం అందించే విధంగా ఫారెస్ట్ అధికారులు కృషి చేయాలని బాధితులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. జిల్లా ఫారెస్ట్ ఉన్నత అధికారి రవి ప్రసాద్ క్షేత్రస్థాయిలో తమ సిబ్బందితో రేంజ్ అధికారి మొయినుద్దీన్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామస్తులు ఎలాంటి భయాందోళనలకు గురి కాకూడదని రైతులు పొలా ల్లోకి వెళ్ళేటప్పుడు గుంపులుగా వెళ్లాలని, అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలను అమర్చరాదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

## 951 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం



**నల్లబెల్లి, (జనంసాక్షి):** ఇద్దరి యువకుల నుండి 951 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. అతను వెల్లడించిన వివరాల ప్రకారం మండలంలోని శనిగరం క్రాస్ జాతీయ రహదారి పై సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఇద్దరు యువకులు తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 950 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు పేర్కొ న్నారు. దుగ్గొండి మండలం రేపల్లె గ్రామానికి చెందిన పేరబో యిన అనుర్వేశ్ యాదవ్ అనే మైనర్ బాలుడు కాగా అదే మం డలం వెంకటాపురం గ్రామానికి చెందిన కక్కెర్ల అభిరామ్‌గా గుర్తిం చినట్లు తెలిపారు. వీరు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని కొను గోలు చేసి స్థానికంగా విక్రయించేందుకు తీసుకువచ్చారని తెలిపారు. గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఎన్డిపిఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 మార్చి 2026

# రణరంగంగా మధ్యప్రాచ్యం

## క్షిపణుల మోత.. నెత్తురోడుతున్న ఇరాన్!




అది ఫిబ్రవరి 28, 2026. ప్రపంచం మరో సాధారణ రోజు కోసం సిద్ధమవుతుండగా, మధ్యప్రాచ్యం ఒక్కసారిగా నిప్పుల కొలిమిలా మారింది. అమెరికా- ఇజ్రాయెల్ కూటమి మరియు ఇరాన్ మధ్య మొదలైన ఈ యుద్ధం నేటికి 16వ రోజుకు చేరుకుంది. ఆధునిక చరిత్రలో అత్యంత విధ్వంసకరమైన ఘట్టంగా అభివర్ణించబడుతున్న ఈ సంఘర్షణ, కేవలం రెండు దేశాల మధ్య పోరాటంలా కాకుండా, మూడవ ప్రపంచ యుద్ధపు ఛాయలను తలపిస్తోంది. గడిచిన రెండు వారాల్లో జరిగిన పరిణామాలు, ప్రాణనష్టం మరియు ఆర్థిక సంక్షోభం అంచనాలకు అందనంతగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ప్రారంభమైన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" ప్రపంచ సైనిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఫిబ్రవరి 28 తెల్లవారుజామున, పర్షియన్ గల్ఫ్ మరియు హిందూ మహాసముద్రంలోని అమెరికా యుద్ధనౌకల నుండి వందలాది టోమాహాక్ క్షిపణులు ఇరాన్ దిశగా దూసుకెళ్లాయి. అదే సమయంలో, రాడార్లకు చిక్కని బీ-2 స్టెల్త్ బాంబర్లు, బీ-1 లాన్సర్లు మరియు భారీ బీ-52 స్ట్రాటోఫోర్ట్రెస్ విమానాలు ఇరాన్ ఆకాశాన్ని కమ్మేశాయి. ఇరాన్ గడ్డపై ఉన్న అత్యంత శక్తివంతమైన క్షిపణి కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. అయితే, ఈ యుద్ధంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన అంశం ఇజ్రాయెల్ వైమానిక దళం చేపట్టిన "డెకాపిటేషన్ స్ట్రైక్స్". ఇరాన్ అత్యున్నత ఆధ్యాత్మిక నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ తన నివాస సముదాయంలో ఉన్నత స్థాయి అధికారులతో సమావేశమైన తరుణంలో జరిగిన ఈ దాడిలో ఆయన మరణించారు. ఒక దేశపు అత్యున్నత నాయకత్వాన్ని ఇలా తుడిచిపెట్టడం మధ్యప్రాచ్య రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేసింది. యుద్ధం అంటే కేవలం క్షిపణుల మోత మాత్రమే కాదు, అది సామాన్యుల కన్నీటి గాథ. ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, ఇప్పటివరకు కనీసం 1,444 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎనిమిది నెలల పసికందుల నుండి 88 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారు. సుమారు 18,551 మంది గాయపడి ఆసుపత్రుల్లో నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ ఈ గణాంకాలను భిన్నంగా చూస్తున్నారు. తమ దళాలు 15,000 కంటే ఎక్కువ శత్రు లక్ష్యాలను ధ్వంసం చేశాయని, అంటే రోజుకు సగటున 1,000 కంటే ఎక్కువ దాడులు జరిగాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి శరణార్థుల ఏజెన్సీ (ఖచీఎజ=) నివేదికలు మరింత భయంకరంగా ఉన్నాయి. కేవలం రెండు వారాల్లోనే 3.2 మిలియన్ల మంది ఇరాన్ ప్రజలు తమ ఇళ్లను వదిలి ప్రాణరక్షణ కోసం వలస వెళ్లారు. ఇది 21వ శతాబ్దపు అతిపెద్ద మానవతా సంక్షోభానికి దారితీస్తోంది. ఆహారం, మందులు మరియు సురక్షితమైన ఆశ్రయం లేక లక్షలాది మంది అలమటిస్తున్నారు. ఈ యుద్ధం కేవలం ఇరాన్ సరిహద్దులకే పరిమితం కాలేదు. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్, ఇజ్రాయెల్తో పాటు బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, టర్కీ మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్లోని అమెరికా సైనిక స్థావరాలపై వందలాది డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీనివల్ల పొరుగు దేశాలు కూడా యుద్ధంలోకి లాగబడ్డాయి. లెబనాన్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. హిజ్బుల్లా మరియు ఇజ్రాయెల్ మధ్య పోరాటం 2026 లెబనాన్ యుద్ధం గా రూపాంతరం చెందింది. అక్కడ ఇప్పటివరకు 850 మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. మధ్యప్రాచ్యం మొత్తం ఒక అగ్నిగుండంలా మారింది. యుద్ధం మనుషుల్నే కాదు, చరిత్రను కూడా సమాధి చేస్తోంది. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తింపు పొందిన ఇరాన్లోని అనేక పురాతన కట్టడాలు ధూళిలో కలిసిపోతున్నాయి.మార్చి 2న టెహ్రాన్ లోని అర్గ్ స్క్వేర్పై జరిగిన దాడిలో చారిత్రక గొలెస్తాన్ ప్యాలెస్ పాక్షికంగా దెబ్బతింది. మార్చి 9 న ఇస్ఫహాన్లోని నక్ష్-ఎ-జహాన్ స్క్వేర్, షా మసీదు మరియు జమే మసీదు వంటి అద్భుత కట్టడాలు దాడులకు గురయ్యాయి. వేల ఏళ్ల నాటి పర్షియన్ సంస్కృతికి చిహ్నాలుగా ఉన్న ఈ ప్రదేశాల విధ్వంసంపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం ఇరాన్ నష్టం కాదు, మానవాళి సంస్కృతికే తీరని లోటు. ఈ యుద్ధం వల్ల ప్రపంచ వాణిజ్యం స్తంభించిపోయింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి మరియు ఎర్ర సముద్రం గుండా వెళ్లే షిప్పింగ్ మార్గాలు మూతపడటంతో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విమానయాన రంగం కుప్పకూలింది. చమురు సంక్షోభం ముదిరింది చమురు ధరలు బారెల్కు వి150కి చేరువలో ఉన్నాయి. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలపై పెనుభారం మోపుతోంది. ఖతార్ శక్తి మంత్రి సాద్ అల్-కబి హెచ్చరించినట్లుగా, యుద్ధం కొనసాగితే గల్ఫ్ దేశాలు ఎగుమతులను పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది, ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూల్చివేస్తుంది. స్టాక్ మార్కెట్లు పతనం కొనసాగుతోంది మార్చి 2న డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 400 పాయింట్లకు పైగా పతనం కావడం, రాబోయే ఆర్థిక మాంద్యానికి సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి శాంతి చర్చల జాడ ఎక్కడా కనిపించడం లేదు. అమెరికా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఈ యుద్ధం మరికొన్ని నెలల పాటు కొనసాగవచ్చని అభిప్రాయపడగా, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తమ దేశం కాల్పుల విరమణ కోరలేదని గట్టిగా చెప్పారు. యుద్ధం సుదీర్ఘం కావడానికి ప్రధాన కారణాలు, ట్రంప్ ఇరాన్ లో పాలన మార్పును కోరుతుండగా, కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అమెరికా సైన్యం మధ్యప్రాచ్యం వదిలి వెళ్లాలని పట్టుబడుతున్నారు. ఇరుపక్షాలు తమ సర్వశక్తులను ఒడ్డుతున్నాయి. ఇజ్రాయెల్ తన క్షిపణి రక్షణ వ్యవస్థలను నిరంతరం వాడుతుండటం వల్ల వాటి నిల్వలు తగ్గిపోతున్నాయి. క్షిపణులతో పాటు, డిజిటల్ మౌలిక సదుపాయాలను దెబ్బతీసేందుకు ఇరు దేశాలు సైబర్ దాడులకు దిగుతున్నాయి, ఇది ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలను ప్రభావితం చేస్తోంది. భారతదేశానికి ఈ యుద్ధం అగ్నిపరీక్ష వంటిది. గల్ఫ్ దేశాల్లో ఉన్న లక్షలాది మంది భారతీయుల భద్రత ఒక ఎత్తైతే, చమురు ధరల పెరుగుదల వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. ఇటు అమెరికాతో మైత్రిని కాపాడుకుంటూనే, అటు ఇరాన్ తో ఉన్న చారిత్రక సంబంధాలను బ్యాలెన్స్ చేయడం భారత దౌత్యవేత్తలకు సవాలుగా మారింది. బ్రిటన్ ప్రధాని సర్ కెయిర్ స్టార్మర్ అన్నట్లుగా, ఆకాశం నుండి బాంబులు కురిపించి పాలన మార్చడం అంత సులభం కాదు. యుద్ధం వల్ల విజేతలు ఎవరూ ఉండరు, కేవలం బాధితులు మాత్రమే మిగులుతారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఈ సంఘర్షణ కనీసం మరో 3 నుండి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉంది. ఇది గనుక మరింత కాలం సాగితే, సిరియా లేదా యెమెన్ వంటి దీర్ఘకాలిక యుద్ధాల జాబితాలో చేరుతుంది. లోకకల్యాణం కోసం, ఆర్థిక స్థిరత్వం కోసం అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పజెష్కియన్ పెట్టిన షరతులు లేదా అమెరికా ప్రతిపాదనలు, ఏవైనా సరే, చర్చల బల్లపై తేలాలి తప్ప రణరంగంలో కాదు. మధ్యప్రాచ్య భవిష్యత్తు మాత్రమే కాదు, రాబోయే దశాబ్దాల ప్రపంచ క్రమం ఈ యుద్ధ ఫలితంపైనే ఆధారపడి ఉంది..

డా .సూర్యదేవర రామకృష్ణ, 9490754169

## సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ వ్యవస్థ

# అత్యున్నత దశ!



ప్రపంచ చరిత్రలో 20వ శతాబ్దం ప్రారంభ దశ ఒక అత్యంత కీలక మలుపుగా నిలిచింది. ఆ కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ తన అంతర్గత మార్పులు, విస్తరణ తత్వం కారణంగా కొత్త దశలోకి ప్రవేశించింది. ఈ దశను సైద్ధాంతికంగా సమగ్రంగా విశ్లేషించిన ప్రముఖ విప్లవ తాత్వికుడు వ్లాదిమిర్ ఇల్యిచ్ లెనిన్. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చివరి దశగా సామ్రాజ్యవాదాన్ని ఆయన నిర్వచించాడు. లెనిన్ రచించిన "సామ్రాజ్యవాదం -- పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ" అనే గ్రంథం ప్రపంచ రాజకీయ, ఆర్థిక చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన రచనలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ గ్రంథం కేవలం ఒక సిద్ధాంత గ్రంథం మాత్రమే కాదు; అది సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత విరోధాలను, దోపిడీ స్వభావాన్ని, విప్లవ అవకాశాలను స్పష్టంగా వివరించిన ఒక శాస్త్రీయ విశ్లేషణ. 19వ శతాబ్దం చివరి దశలో యూరప్ దేశాలలో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరిగింది. పరిశ్రమలు పెరిగాయి, ఉత్పత్తి విస్తరించింది. పరిశ్రమల విస్తరణతో పాటు పెట్టుబడులు కూడా పెరిగాయి. అయితే అంతర్గత మార్కెట్లు మాత్రమే సరిపోకపోవడంతో కొత్త మార్కెట్ల కోసం పెట్టుబడిదా రులు ప్రపంచవ్యాప్తంగా వెతకడం ప్రారంభించారు. ఈ అవసరం కారణంగానే యూరప్ దేశాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రాంతాలపై తమ ప్రభావాన్ని విస్తరించాయి. ఇది సాధారణ వ్యాపార విస్తరణ కాదు. ఇది రాజకీయ ఆధిపత్యం, ఆర్థిక దోపిడీ, సైనిక నియంత్రణ కలిసిన ఒక విస్తృత వ్యవస్థగా రూపుదిద్దుకుంది. లెనిన్ ఈ పరిణామాన్ని "సామ్రాజ్యవాదం" అని నిర్వచించి, దానిని పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశగా వర్ణించాడు.

లెనిన్ విశ్లేషణ ప్రకారం సామ్రాజ్యవాదం ఏర్పడటానికి ఐదు ముఖ్య లక్షణాలు ఉన్నాయి. మొదటిది ఉత్పత్తి కేంద్రీకరణ. చిన్న పరిశ్రమలు పెద్ద పరిశ్రమల్లో విలీనమై మోనోపోలీలు ఏర్పడ్డాయి. రెండవది బ్యాంకు మూలధనం, పారిశ్రామిక మూలధనం కలయిక. ఇది "ఆర్థిక మూలధనం" అనే కొత్త శక్తిని సృష్టించింది. మూడవది మూలధన ఎగుమతి. అభివృద్ధి చెందిన దేశాల్లో పెట్టుబడులు అధికంగా పేరుకుపోవడంతో వాటిని వెనుకబడిన దేశాల్లో పెట్టడం ప్రారంభమైంది. దీని ద్వారా అభివృద్ధి చెందని దేశాల సహజ వనరులు, చౌకైన కార్మిక శక్తి వినియోగం జరిగింది. నాల్గవది అంతర్జాతీయ మోనోపోలీల ఏర్పాటు. పెద్ద కంపెనీలు ప్రపంచ మార్కెట్లను పరస్పరం పంచుకున్నాయి. ఐదవది ప్రపంచ భూభాగాల విభజన. ప్రధాన సామ్రాజ్యవాద దేశాలు ఆఫ్రికా, ఆసియాను తమ మధ్య విభజించుకున్నాయి. ఈ పరిణామాల వల్ల ప్రపంచ రాజకీయాలలో తీవ్రమైన పోటీ ప్రారంభమైంది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా వంటి దేశాలు కాలనీలు, వనరులు, మార్కెట్ల కోసం పోటీ పడ్డాయి. ఈ పోటీ చివరకు 1914లో మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసింది. లెనిన్ ఈ యుద్ధాన్ని సామ్రాజ్యవాద దేశాల మధ్య దోపిడీ పోటీగా విశ్లేషించాడు. యుద్ధం కార్మిక వర్గానికి భారీ నష్టాన్ని కలిగించింది. కానీ యుద్ధం నుంచి లాభపడినవి కొద్దిమంది పెట్టుబడిదారులే.

ఈ నేపథ్యంలో మార్క్సిజం సిద్ధాంతంపై సందేహాలు తలెత్తాయి. మార్క్స్ ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత విరోధాలు పెరిగి చివరకు వ్యవస్థ పతనమవుతుంది. కానీ 19వ శతాబ్దం చివరలో ఎడ్వర్డ్ బెర్న్స్టీన్ వంటి మార్క్సిస్టు నాయకులు ఈ సిద్ధాంతాన్ని సవాలు చేశారు. బెర్న్స్టీన్ ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ తక్షణం కూలిపోదు. పరిశ్రమల విస్తరణ, కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్యం వల్ల వ్యవస్థ కొంత స్థిరపడిందని ఆయన వాదించాడు. విప్లవం కాకుండా సంస్కరణల ద్వారా కార్మిక వర్గం మెరుగైన ప్రయోజనాలు సాధించాలని ఆయన సూచించాడు. "చలనం అన్నదే ముఖ్యం, తుది లక్ష్యం పెద్దగా అవసరం లేదు" అని ఆయన ప్రసిద్ధ వాక్యం. ఈ ధోరణిని "రివిజనిజం" అని పిలిచారు.

లెనిన్ ఈ రివిజనిజాన్ని తీవ్రంగా విమర్శించాడు. ఇది కార్మిక ఉద్యమాన్ని విప్లవ మార్గం నుంచి దూరం చేసి, పెట్టుబడిదారీ వ్యవస్థకు మద్దతుగా మారుతుందని ఆయన హెచ్చరించాడు. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో అనేక సోషలిస్టు పార్టీలు తమ దేశ ప్రభుత్వాలకు మద్దతు ఇవ్వడం ఈ రివిజనిజం ఫలితమే అని లెనిన్ విశ్లేషించాడు. జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఈ ఉదాహరణ. ఆ పార్టీ యుద్ధానికి మద్దతు ఇవ్వడం కార్మిక వర్గ అంతర్జాతీయ ఐక్యతను దెబ్బతీసింది.

1917 రష్యా విప్లవం లెనిన్ సిద్ధాంతానికి జీవంత ఉదాహరణ. సామ్రాజ్యవాద యుద్ధం కారణంగా రష్యాలో సంక్షోభం తీవ్రమైంది. ప్రజల అసంతృప్తి విప్లవానికి దారితీసి, ప్రపంచంలో మొదటి సోషలిస్టు రాష్ట్రం ఏర్పడింది. ఇది లెనిన్ విశ్లేషణ సరైనదని నిరూపించింది.

నేటి ప్రపంచీకరణ యుగంలో కూడా సామ్రాజ్యవాద లక్షణాలు పూర్తిగా అంతరించిపోలేదు. బహుళజాతి కంపెనీలు ప్రపంచ మార్కెట్లను నియంత్రిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక విధానాల ద్వారా వెనుకబడిన దేశాలపై ఆధిపత్యం చలాయిస్తున్నాయి. సహజ వనరుల కోసం దేశాల మధ్య పోటీ కొనసాగుతోంది. ఈ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి లెనిన్ సిద్ధాంతం ఇప్పటికీ అత్యంత ఉపయోగకరమైనది.

బెర్న్స్టీన్ రివిజనిజం కూడా నేటి ప్రజాస్వామ్య సంస్కరణల్లో ప్రతిబింబిస్తోంది. కానీ లెనిన్ హెచ్చరికలు సరైనవని చరిత్ర నిరూపించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత విరోధాలు ఎప్పుడైనా విప్లవాలకు దారి తీస్తాయి. సామాజిక అసమానతలు, ఆర్థిక దోపిడీ, యుద్ధాలు - ఇవన్నీ లెనిన్ విశ్లేషణను ధృవీకరిస్తున్నాయి. ఈ సిద్ధాంతపరమైన చర్చలు మనకు ఒక ముఖ్య పాఠాన్ని నేర్పుతాయి. సమాజ మార్పు ఒకే మార్గంలో జరగదు. ఆర్థిక పరిస్థితులు, రాజకీయ శక్తుల పోటీ, ప్రజల చైతన్యం - ఇవన్నీ కలిసి కొత్త వ్యవస్థలను సృష్టిస్తాయి. లెనిన్ రచన, బెర్న్స్టీన్ రివిజనిజం, వాటి చుట్టూ జరిగిన సిద్ధాంత పోరాటం ప్రపంచ రాజకీయ ఆలోచనలో ఒక మహత్తర అధ్యాయం. ఇవి భవిష్యత్ సామాజిక మార్పుల దిశను నిర్ణయించడానికి ఇప్పటికీ మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.




డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# తెలంగాణ మట్టి సువాసన

## డా. నందిని సిద్ధారెడ్డికి అనిమేష

### కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



తెలంగాణ మట్టి సువాసనను, తెలంగాణ భాష సహజత్వాన్ని తన కవిత్వం ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్. నందినీ సిద్ధారెడ్డి రచించిన "అనిమేష" కవితా సంకలనానికి ' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం' లభించడం తెలుగు సాహిత్య ప్రపంచానికి గర్వకారణం. ఇది కేవలం ఒక కవికి వచ్చిన వ్యక్తిగత గౌరవమే కాదు; తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్యానికి దక్కిన విశిష్ట గుర్తింపు. తెలంగాణ ఆత్మను, దాని మట్టిలోని మానవీయ భావజాలాన్ని తన కవిత్వంలో ప్రతిబింబించిన కవి నందిని సిధారెడ్డి ఈ గౌరవానికి అర్హుడు.ప్రముఖ కవులు ,సాహితీ వేత్తలు మధురాంంతకం నరేంద్ర, డాక్టర్.ఎన్. గోపీ, డాక్టర్.కే కోటేశ్వరరావులతో కూడిన న్యాయ నిర్ణేతల కమిటీ ఈ అవార్డుకు ఆయన పేరును ఎంపిక చేశారు. ఆయన తెలుగులో మొత్తం తొమ్మిది కథా సంకలనాలు, కథలు, కథానికలు, నవలలు, సాహిత్య విమర్శ, సాహితీ వ్యాసాలు మొదలైన ప్రక్రియలో పుస్తకాలు వెలువరించారు. ఆయన రచనలను అకాడమీ న్యాయ నిర్ణేతలు పరిశీలించింది చివరకు ఆయన రచించిన "అనిమేష" కవితా సంకల్పానికి ఈ అవార్డును ప్రకటించారు.


కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు నందిని సిద్ధారెడ్డికి ఎంపిక కావటం పట్ల సిద్దిపేట ప్రాంతానికి చెందిన తోటి కవులు, సహచర మిత్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అలాగే

తెలంగాణ సాహితీ లోకం ఈ సంతోషకరమైన వార్తను తెలుసుకుని ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.

నందిని సిధారెడ్డి 1955 జూన్ 12న తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట జిల్లా కొండపాక మండలంలో "బందారం" గ్రామంలో జన్మించారు. 2017-మే 2 నుంచి 2020 మే వరకు తొలి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గా పనిచేశారు. ఆయన తండ్రి నర్ర బాల సిద్ధారెడ్డి నిజాం పాలనలో రజాకారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారుడు. ఆ కుటుంబంలోనే ఉన్న అంతర్గత సామాజిక చైతన్యం, ప్రజల పట్ల ఉన్న బాధ్యతా భావం సిధారెడ్డి ఆలోచనలపై గాఢమైన ప్రభావం చూపింది. చిన్ననాటి నుంచే సాహిత్యం, సామాజిక ప్రశ్నల పట్ల ఆసక్తి కలిగిన ఆయన విద్యార్థి దశలోనే కవిత్వం రాయడం ప్రారంభించారు. ఆయన హైదరాబాద్లోని ఉస్మానియా యూనివర్సిటీ లో తెలుగు సాహిత్యంలో ఎం.ఏ. పూర్తి చేశారు. తరువాత ఆధునిక తెలుగు కవిత్వంపై ఎం.ఫిల్, అనంతరం పీహెచ్.డి చేశారు. "ఆధునిక తెలుగు కవిత్వంలోని వాస్తవికత, అధివాస్తవికత" అంశంపై ఆయన చేసిన పరిశోధన సాహిత్య విమర్శకులలో ప్రాధాన్యత పొందింది.

విద్యార్హతలు పూర్తి చేసిన తరువాత ఆయన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. మెదక్ ప్రాంతంలో బోధన ప్రారంభించి తరువాత సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడిగా పనిచేశారు. విద్యార్థుల్లో సాహిత్యాభిరుచి పెంపొందించడంలో ఆయన విశేష కృషి చేశారు. 2012లో ప్రభుత్వ సేవ నుంచి పదవీ విరమణ చేసినప్పటికీ సాహిత్య రంగంలో ఆయన సేవలు మరింత విస్తరించాయి.

సాహిత్యకారుడిగా నందిని సిధారెడ్డి విభిన్న రంగాల్లో రచనలు చేశారు. కవిత్వం, వ్యాసాలు, కథలు, పాటలు వంటి అనేక రూపాల్లో ఆయన తన ఆలోచనలను వ్యక్తం చేశారు. "దివిటి", "భూమి స్వప్నం", "సంభాషణ", "ప్రాణహిత", "ఒక బాధ కాదు", "నది పుట్టువడి", "ఇక్కడి చెట్ల గాలి" వంటి కవితా సంపుటాలు ఆయన రచనలలో ముఖ్యమైనవి. ఈ రచనలలో తెలంగాణ జీవన విధానం, సామాజిక అసమానతలు, మానవ సంబంధాలు, ప్రకృతి, ప్రజల బాధలు వంటి అంశాలు లోతుగా ప్రతిబింబిస్తాయి. ఆయన వ్యాసాలలో "ఇగురం", "కుల వృత్తులు - తెలంగాణ సాహిత్యం", "ఆవర్తనం" వంటి రచనలు తెలంగాణ భాషా సంస్కృతిపై విశ్లేషణాత్మక దృష్టిని అందించాయి.




ఆయన కవిత్వానికి ప్రత్యేకత ఏమిటంటే అది పుస్తకాల భాషలో కాకుండా ప్రజల మాటలతో ముడిపడి ఉండటం. తెలంగాణ భాషలోని సహజత్వం, మట్టివాసన ఆయన కవితల్లో ప్రతిధ్వనిస్తుంది. అందుకే ఆయన కవిత్వం ప్రజల మధ్య విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన "నాగేటి సాలల్లో నా తెలంగాణ" అనే పాట ప్రజల్లో అపార స్పందనను రేకెత్తించింది. తెలంగాణ జీవన విధానం, సంస్కృతి, భాషను ప్రతిబింబించిన ఈ కవిత ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచింది. తరువాత ఈ కవిత సినిమా పాటగా వినిపించింది . రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాదరణ పొందింది. దీనికి ఆయనకు " నంది అవార్డు" కూడా లభించింది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సిధారెడ్డి పాత్ర విశేషమైనది. ఆయన కవిత్వం కేవలం సాహిత్య సృష్టి మాత్రమే కాదు. అది ఒక సామాజిక ప్రకటన. తెలంగాణ ప్రజల స్వాభిమానం, వారి చరిత్ర, వారి బాధలను కవిత్వ రూపంలో ఆయన ప్రపంచానికి వినిపించారు. అందుకే తెలంగాణ ఉద్యమంలో కవులు, గాయకులు, కళాకారులలో ఆయన ఒక ప్రముఖ స్వరంగా నిలిచారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఆయన సేవలను గుర్తించింది. ముఖ్యమంత్రి కేసీఆర్. నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన "తెలంగాణ సాహిత్య అకాడమీకి ఆయనను తొలి అధ్యక్షుడిగా నియమించింది. ఈ అకాడమీ ద్వారా తెలంగాణ సాహిత్య సంపదను వెలికితీయడం, పాత రచనలను ప్రచురించడం, కొత్త రచయితలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను ఆయన ముందుండి నిర్వహించారు. కొద్ది సంవత్సరాల్లోనే అకాడమీ ద్వారా వందకు పైగా పుస్తకాలను ప్రచురించడం ఆయన నాయకత్వానికి నిదర్శనం.

తెలంగాణ భాషను పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెట్టడం, తెలంగాణ చరిత్రను విద్యా వ్యవస్థలో స్థానం కల్పించడం వంటి విషయాలలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర పాఠ్యపుస్తక సమీక్ష కమిటీలో సభ్యుడిగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సిలబస్ కమిటీలో సభ్యుడిగా పనిచేసి తెలంగాణకు అనుగుణమైన విద్యా విధానాల రూపకల్పనలో సహకరించారు.

ఇలా ఒక కవి, ఉపాధ్యాయుడు, ఉద్యమకారుడు, సాహిత్య నిర్వాహకుడు అనే విభిన్న పాత్రలను సమర్థంగా నిర్వహించిన వ్యక్తి నందిని సిధారెడ్డి. ఆయన రచనలు తెలంగాణ సమాజానికి అద్దం పట్టే దర్పణంగా నిలిచాయి. భాషకు, సంస్కృతికి, ప్రజల ఆత్మగౌరవానికి ఆయన కవిత్వం శక్తివంతమైన ఆయుధంగా మారింది.

ఇలాంటి మహత్తర సాహిత్య ప్రస్థానానికి గుర్తింపుగా ఆయన రచించిన "అనిమేష" కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం తెలంగాణ సాహిత్య ప్రపంచానికి గర్వకారణం. ఇది ఒక కవికి మాత్రమే కాదు; తెలంగాణ భాషకు, తెలంగాణ సంస్కృతికి, తెలంగాణ సాహిత్య సంప్రదాయానికి లభించిన గౌరవం.తెలంగాణ మట్టిలో పుట్టి, తెలంగాణ భాషలో మాట్లాడి, తెలంగాణ ఆత్మను కవిత్వంగా మలిచిన నందిని సిధారెడ్డి వంటి కవులు ఉన్నంతకాలం ఈ భూమి సాహిత్య పరంపర మరింత గొప్పగా విస్తరిస్తూనే ఉంటుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# హోర్ముజ్ నుంచి వంటగది వరకు

## మన ఇంధన భద్రతకు అద్దం పట్టిన సంక్షోభం

దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఎల్.పీ.జీ. సంక్షోభం కేవలం ఇంధన కొరత మాత్రమే కాదు, అది గత కొన్ని సంవత్సరాలుగా మన దేశ విదేశాంగ విధానంలో జరుగుతూ వస్తున్న ప్రాథమిక మార్పుల యొక్క ప్రత్యక్ష పరిణామం. ఫిబ్రవరి2026 చివరిలో ఇరాన్-ఇజ్రాయెల్ సంఘర్షణ ముదిరిన తర్వాత హోర్ముజ్ జలసంధి మూతపడటంతో మన దేశానికి వచ్చే 60 శాతం ఎల్.పీ.జీ. దిగుమతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వేలాది హోటళ్ళు, రెస్టారెంట్లు, పరిశ్రమలు మూతపడుతుండగా, సుమారు 10 మిలియన్ల మంది నిరుద్యోగం అంచున నిలిచారు. కానీ ఈ సంక్షోభం వెనుక ఉన్న అసలు కథ, అంతకు ముందు జరిగిన ఒక చారిత్రక పర్యటనలో దాగి ఉంది.ఫిబ్రవరి 25న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ ను మొదటి సారి పర్యటించి,ఆ దేశ పార్లమెంట్లో ప్రసంగించారు. అది కేవలం ఒక దౌత్య పర్యటన మాత్రమే కాదు. అది భారత్ తన 75 ఏళ్ల అలీన విధానానికి స్వస్తి పలికి, పశ్చిమాసియాలో ఒక వైపు స్పష్టంగా నిలబడటానికి సంకేతాన్ని ఇచ్చిన పర్యటన. యుద్ధం ప్రారంభానికి కేవలం రెండు రోజుల ముందు జరిగిన ఈ పర్యటనలో, ప్రధాని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును కౌగిలించుకుని, అక్టోబర్ 7న ఇరాన్ ఆత్మ రక్షణ కోసం గల్ఫ్ దేశాలలో అమెరికా సైనిక స్థావరాలపై దాడులను చేసింది. అయితే ఈ దాడులను మోదీ ఫోన్ చేసి తీవ్రంగా ఖండించారు . సహజంగానే, ఈ ప్రత్యక్ష మద్దతు ఇరాన్ను అసంతృప్తి పరిచింది. ఇరాన్ ప్రకారం, స్నేహపూర్వక దేశాల నౌకలకు మాత్రమే హోర్ముజ్ జలసంధి గుండా వెళ్ళే అనుమతి ఉంటుంది. భారత్ ఆ జాబితాలో ఉందేదా? అనేది ఓ పెద్ద ప్రశ్న.

అయితే, ఈ సంక్షోభంలో భారత దౌత్యం పూర్తిగా విఫలం కాలేదు. మార్చి 13న, రెండు భారతీయ ఎల్.పీ.జీ. ట్యాంకర్లకు హోర్ముజ్ జలసంధి గుండా వెళ్ళేందుకు ఇరాన్ ఉదార స్వభావంతో అనుమతించింది . ఇరాన్ రాయబారి స్వయంగా "భారత్ మా మిత్రదేశం, మాకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి" అని ప్రకటించారు.ఈ ప్రకటన ఒక వైపు మనకు ఊరట కలిగించినా, మరోవైపు మన దౌత్య విధానంలోని లోతైన సమస్యలను కూడా బయటపెట్టింది. మోదీ ఇజ్రాయిల్ కు ఏకపక్షంగా మద్దతు ప్రకటించటం, అయినా భారత్ను పూర్తిగా వదిలిపెట్టలేమని ఇరాన్ భారత్ కు స్నేహం హస్తం చాచింది. ఎందుకంటే ఇది తరతరాలుగా భారత్ తో ఉన్న సాంప్రదాయక మిత్రుత్వ బంధం కనుక.ఈ సున్నితమైన విషయాన్ని మోదీ మరిచిపోయి,మన అలీన విధాన సిద్ధాంతాన్ని విస్మరించి, అమెరికా ఒత్తిడితో భారత్ తరపున ఇజ్రాయెల్ కు మోదీ తన మద్దతు ప్రకటించాడు. అందుకే ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు మోదీ మెడలో ఒక 'మెడల్ ' వేశాడు. ఎందుకంటే భారత్ ఇప్పటికీ ఇరాన్ కు వ్యూహాత్మక భాగస్వామి. కానీ ఇలాంటి మినహాయింపులు ప్రతిసారీ భారత దేశానికి ఇరాన్ నుండి లభిస్తాయి అన్న గ్యారెంటీ లేదు.

మన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దేశీయ గ్యాస్ ఉత్పత్తిని 10 శాతం పెంచి, గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ బుకింగ్ వ్యవధిని 25 నుంచి 45 రోజులకు పెంచింది. కృత్రిమ కొరతను నివారించడానికి నిత్యావసర చట్టం కింద నిబంధనలు తీసుకొచ్చింది. అంటే, ప్రభుత్వం సంక్షోభం తీవ్రతను అంగీకరిస్తూనే, దానిని నిర్వహించడానికి ప్రయత్నిస్తోంది. కానీ అసలు విషయం ఏమిటంటే భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలు రాకుండా నిరోధించడానికి మన దౌత్య విధానం ఏం చేస్తోంది? మరో మాటలో చెప్పాలంటే, ఒకేసారి రెండు విరుద్ధ శత్రు దేశాలతో స్నేహం చేయడం కష్టమని తెలిసి కూడా, మన దేశం ఎందుకు ఒక వైపు నిలబడ్డాం? ఎందుకు మనం దేశం మొదటి నుంచీ అనుసరిస్తున్న "అలీన విధానాన్ని" వదులుకుంది? మనకు అమెరికా ఏమైనా విశ్వసించ తగిన మిత్ర దేశమా? అని ప్రశ్నించు కుంటే మన దేశం ఎదుర్కొంటున్న ప్రతి క్లిష్టమైన సమయాల్లో అమెరికా భారత్ కు వెన్నుపోటు పొడిచింది.మోదీ అమెరికా గత చరిత్రను మరిచారా!?

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారత్ అనుసరించిన విధానం సరళమైనది. ప్రపంచంలో ఏ వివాదంలోనూ ఏకపక్షంగా నిలబడకూడదు. కోల్డ్ వార్ కాలంలో కూడా మనం అలీన ఉద్యమానికి నాయకత్వం వహించాం. కానీ ఇటీవలి సంవత్సరాల్లో ఈ విధానం నుంచి పెద్ద మార్పు కనిపిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్తో బహిరంగ స్నేహం, "క్వాడ్" వంటి కూటముల్లో చేరిక, ఇప్పుడు పశ్చిమాసియా వివాదంలో ఒక వైపు నిలబడటం- ఇవన్నీ మన సంప్రదాయ విదేశాంగ విధానానికి పూర్తి విరుద్ధం. ప్రస్తుత సంక్షోభం మనకు ఒక గుణపాఠాన్ని నేర్పిస్తుంది. ఇంధన భద్రత కేవలం దేశీయ ఉత్పత్తితో మాత్రమే సాధించేది కాదు. అంత సామర్థ్యం మనకు లేదు. అది మన విదేశాంగ విధానం నేర్పరితనం తటస్థ వైఖరి దిగుమతులతో ముడిపడి ఉంది. మనం ఎవరితో ఎలాంటి సంబంధాలు పెట్టుకుంటాము అనేది సరైన అవగాహన, అంచనాలు లేకపోతే అది నేరుగా మన ఇళ్ళలో వంటగ్యాస్ లభ్యతను ప్రభావితం చేస్తుంది. ఇరాన్ మనకు ఇచ్చిన తాత్కాలిక అనుమతి ఊరట కలిగించినా, భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలు రాకుండా చూసుకోవడానికి మన విదేశాంగ విధానంలో సమతుల్యత అవసరమని ఈ సంఘటన రుజువు చేస్తుంది. 140 కోట్ల మంది ప్రజల ఆకలి, ఉపాధి ఇకపై అంతర్జాతీయ రాజకీయాలతో ముడిపడి ఉందన్న సత్యాన్ని మనం గుర్తించాలి.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

# జన గణనపై అవగాహన అవసరం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




**గద్వాల నడిగడ్డ, (జనంసాక్షి);** జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా మొదట ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిఒచాలని, ఇందుకుగాను గణనపై సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులకు ఇండ్ల గణనపై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, చార్జింగ్ అధికారులు నిర్వహిస్తారని, చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఉండే జనాభా ఆధారంగా బ్లాక్ లుగా విభజించుకొని గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇండ్ల గణన పూర్తయితే 2027 ఫిబ్రవరిలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 33 ప్రశ్నలను అడిగి వివరాలను నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం చేపట్టే గణన ఆధారంగానే భవిష్యత్తులో వివిధ వర్గాలకు ఆయా సందర్భాల్లో రిజర్వేషన్లు నిర్ణయించడం జరుగుతుంది కాబట్టి గణనను పక్కాగా చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో సుమారు 1100 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు అవసరమవుతారని, ఉపాధ్యాయులకు ఈ విధులు అప్పగించాలన్నారు. ఈ జనాభా గణనను పూర్తిగా డిజిటల్ విధానంలో చేయాల్సి ఉన్నందున 2026-2027 సెన్సెస్ ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే ట్రైనర్స్ ను అడిగి వెంటనే పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాసరావు, సెన్సెస్ ఆపరేషన్ జాయింట్ డైరెక్టర్ లాజర్, ట్రైనర్ సుల్తాన్, సంబంధిత ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# రైతు భరోసా ఏకకాలంలో ఇవ్వాలి

**అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్**



**నారాయణపేట (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం రైతం గానికి యాసంగి సీజన్ కు సంబంధించిన రైతు భరోసా రూపాయలను ఏకకాలంలో రైతులకు చెల్లించాలని, రైతులు పండించిన పంటలకు మక్కా జొన్న,ఎర్రజొన్న ,చెరుకు పంటలకు కనీసం మద్దతు ధరలను అమలు చేయాలనె డిమాండ్ తో అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవో శ్రీధర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది,ఈ సందర్భంగా అఖిలభారత రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ రైతాంగం బ్రతుకులు దినదిన గండంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు సకాలంలో స్పందించడంలో విఫలమవుతున్నాయి.దీనివల్ల రైతాంగం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం సీజన్ ముగిసి యాసంగి (రబీ)సీజన్ అర్ధకాలం పూర్తయిపోయింది రైతులు అనేక ఇబ్బందులకు గురవుతూ విత్తనాలు, ఎరువులు ,ట్రాక్టర్ బాడుగలు, నాట్లు తదితర వ్యవసాయ ఖర్చుల నిమిత్తం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టుటకై ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అధిక వడ్డీలకు తీసుకువచ్చి పెట్టుకుంటారు. ప్రభుత్వం రైతు భరోసా సకాలంలో ఇవ్వకపోవడంతో రాష్ట్ర రైతాంగం అప్పుల పాలై తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేస్ )జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, కృష్ణయ్య, సహాయ కార్యదర్శి కొండ నర్సింలు, బి నారాయణ, బాలకృష్ణ, ఏ రాములు, సిరి దస్తప్ప, పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 11 ఫిర్యాదులు



**నాగర్ కర్నూల్, (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 11 మంది ఫిర్యాదు దారులు వచ్చారు. ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. భార్య భర్తల పంచాయతీ-01, తగు న్యాయం గురించి.



## అనారోగ్యంతో విద్యార్థి మృతి

**మల్దకల్ (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రానికి చెందిన ఆంజనేయచారి,స్వాతి దంపతులకు చెందిన కుమారుడు నందకిషోర్ (12) అనే విద్యార్థి అనారోగ్యంతో సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం విద్యార్థి హైదరాబాదులోని ఘట్కేసర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు.గత పది రోజుల క్రితం విద్యార్థి అనారోగ్యంతో ఉండడంతో తండ్రి ఆంజనేయ చారి స్వగ్రామమైన మల్దకల్‌కు తీసుకొచ్చారు. కాలుకు గాయం కావడంతో సోమవారం ఉద యం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసు కెళ్లగా అక్కడ చికిత్స పొందుతూమృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై కొండ శ్రీహరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వదంతులు నమ్మవద్దు గ్యాస్ కొరత లేదు

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, (జనంసాక్షి):** జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని, వంట గ్యాస్ సిలిండర్లను ఎవరైనా బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని, అక్రమాలకు పాల్పడిన డీలర్ల డీలర్ షిప్పులను రద్దు చేయిస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన గ్యాస్ కొరతపై సివిల్ సప్లయిస్ అధికారులతో ఫోన్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదని, యుద్ధ వాతావరణం నేపథ్యంలో వస్తున్న వదంతులను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. ప్రజల భయాన్ని ఆసరాగా చేసుకుని డీలర్లు అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌పై ప్రజల వద్ద ఆధా రాలు ఉంటే నేరుగా తనకు పంపాలని, అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు నిరంతరం పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు.

## చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందిస్తాం

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**



**మెదక్, (జనంసాక్షి):** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో భాగంగా, జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీస్ సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావుకి నేరుగా విన్నవించుకున్నారు. ఈ సం దర్భంగా ఎస్పీ ప్రతి ఫిర్యాదు దారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకునేలా సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని అంశాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని ప్రజలను కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగిందని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# సమర్థవంతమైన సేవకున్ని ప్రతిపాదించండి

- ఐక్యతతో చేసే ప్రతి పని కాంగ్రెస్ పార్టీకి నిజమైన విజయం
- వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి



**వనపర్తి బ్యూరో, (జనంసాక్షి) :** గ్రామాల్లో, మండలాల్లో మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియలో సమర్థవంతమైన సేవకులను ప్రతిపాదించాలని వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షనాల్లో మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నికకు సంబంధించి ఏర్పాటుచేసిన విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా శివసేనారెడ్డి హాజరయ్యారు. శివసేన రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయడంతోనే అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని అన్నారు. అలాంటి వారికోసం ఏఐసీసీ, టిపిసిసి అధిష్టానం మేరకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకత ఉందన్న ఆలోచనతో సంస్థాగత బలోపేతానికి పెద్దపీఠం వేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, మున్సిపల్ చైర్మన్ నాగమణి, వైస్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, పాండు సాగర్ ,మండల అధ్యక్షులు పరమేష్, మాజీ యూత్ ప్రెసిడెంట్ తులసిరాజ్,గంగాధర్, వెంకట్, కృష్ణమూర్తి, తిరుపతి, శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**గ్రామ అధ్యక్షుడే గ్రామానికి పెద్దదిక్కు**

భవిష్యత్తులో ఏ ఒక్కరికైనా పార్టీ పదవులు కట్టబెట్టే ప్రయత్నాలల్లో గ్రామస్థాయిలో గ్రామ కమిటీ అధ్యక్షుని అభిప్రాయాన్ని నిర్ణయం మేరకే పదవులు దక్కుతాయని వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి అన్నారు. అమరచింత మండల కేంద్రంలో మండల అధ్యక్ష పట్టణ అధ్యక్షుల కార్యవర్గానికి సంబంధించిన ఎన్నిక ప్రక్రియకు సంబంధించి సోమవారం అమరచింత పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సమీపంలో ఏర్పాటుచేసిన సమా వేశానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న మంత్రివర్యులు వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సువర్ణ రవి, నాగరాజుగౌడ్, రమేష్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, చంద్రమౌళి, పాండు సాగర్, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి) :** జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద రూ.55 కోట్ల నిధులతో కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు.అంతకు ముందు జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడి నుంచి నేరుగా కొత్త కలెక్టరేట్ భవన సముదాయం వద్దకు వెళ్లి ఇప్పటి దాకా జరిగిన నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల గురించి ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. భవన సముదాయ నిర్మాణ పనులతో పాటు బయట రోడ్లు,ఇతర పనులు వెంటనే ప్రారంభించాలన్నారు.ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు మొరం మట్టి లెవెల్ చేయాల్సి ఉందని ఆర్అండ్‌బీ ఈ ఈ వెంకట రమణ కలెక్టర్ కు తెలిపారు.ఎస్టిమేట్ కంటే అదనంగా నిధులు అవసరం అవుతాయని అధికారులు కలెక్టర్ కు తెలపగా ముందే ఎస్టిమేట్‌లో అదనపు నిధుల అవశ్యకతను పొందు పర్చాల్సి ఉండేదని ఆయన సూచించారు. భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరుగుతున్న పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్ అండ్ బి ఈ.ఈ. వెంకటరమణ,డీ.ఈ.రాములు, ఏ ఈ, పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేస్తాం : ఎమ్మెల్యేయెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో (జనంసాక్షి) :**మహిళలను ఆర్థికంగా బలపరచి కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి , షాదిముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా సొంత ఇంటి కల సాకారం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. త్వరలో మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయం కూడా అందజేస్తామని ఆయన చెప్పారు. ప్రజల ముఖాల్లో ఆనందం, సంతోషం చూడడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ తమపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హన్వాడ మండల అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు యాదిరెడ్డి, నవనీత, రామకృష్ణ, చుక్క యాదయ్య, బొట్టు శ్రీను, లింగం నాయక్, దాసరి వెంకటయ్య , కృష్ణయ్య, చందర్ నాయక్, కృష్ణ, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపిడిఓ యశోద పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడికి తోటి ఉపాధ్యాయులు చేయూత..!



**పి.ఏ.పల్లి, (జనంసాక్షి):** గుడిపల్లి మండల ఉపాధ్యాయులు ఆర్.శ్రీను ఎస్జిటి,మండల ప్రాథమిక పాఠశాల పోల్కంపల్లి పాఠశాలలో పని చేస్తున్నారు.ఉపాధ్యాయ వృత్తి నిమిత్తం ఇటీవల పాఠశాలకు వస్తున్న క్రమంలో దురదృష్టవశాత్తు ప్రమాదంలో మోకాలి చిప్ప తీవ్రంగా డామేజ్ కావడంతో ఇప్పటి వరకు 4 లక్షల వరకు ఖర్చు అయింది.అతనిది చాలా నిరుపేద కుటుంబం కావడంతో ఉద్యో గంలో చేరి అతి తక్కువ కాలం కారణంగా జీతం రావడానికి ఎలాంటి లీవ్ అకౌంట్ కూడా లేదు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ గుడిపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, జైపాల్, పిఆర్టియు టిఎస్ గుడిపల్లి మండల అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మినర్సయ్య, నాగయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉమా శంకర్డ్, రాంబాబు, సైదయ్య , ఉపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## వనపర్తి డిసిసి డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా పి.జె బాబు



**వనపర్తి బ్యూరో (జనంసాక్షి):** వనపర్తి జిల్లా మెడికల్, హెల్త్ వింగ్ విభాగానికి డాక్టర్స్ సెల్ చైర్మన్ గా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ పి.జె బాబును నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి జిల్లా మెడికల్త్ ,హెల్త్ వింగ్ విభాగానికి డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన చిన్న పిల్లల డాక్టర్ పి.జె బాబు ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం అసెంబ్లీ ఆవరణ లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా డాక్టర్ పి.జెబాబు నియామక పత్రాన్ని అందుకున్నారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..**

తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన టీపీసీసీ అధ్యక్షులకు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షు డు జిల్లెల్ల చిన్నారెడ్డికి దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూదన్ రెడ్డికి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజెష్ రెడ్డికి, వనపర్తి డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి. డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## 20 డొమెస్టిక్ సిలిండర్లు పట్టివేత యజమానులపై కేసులు నమోదు

**బిజినేపల్లి (జనంసాక్షి):** మండల కేంద్రంతో పాటు వట్టెం ,మంగనూరు, పాలెం గ్రామాల లోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలు ఇతర చిరు వ్యాపారాలపై ఉపతాసిల్దార్ రవి కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ధాబాలు, హోటళ్లలో ,బేకరీలు వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి పక్క సమాచారం మేరకు తనిఖీల సమయంలో మొత్తం 20 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు పట్టుబడగా, వాటన్నింటికీ బాండ్ విధించినట్లు ఉపతాసిల్దార్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్లు కేవలం గృహ అవసరాలకే ఉపయోగించాల్సి ఉండగా దాబాలు ,బేకరీలు, హోటళ్లు లేదా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని వారు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలు మళ్లీ చోటుచేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని యాజమాన్యులకు హెచ్చరించారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే కేసులు నమోదు చేసి కట్టిన చర్యలు తీసుకుం టామన్నారు. వారితో పాటు ఆర్ఐ అనురాధ, జిపిఓలు జగన్నాథం, ప్రసన్న ,ఏఎస్ఐ కృష్ణయ్య, శివ,ప్రవీణ్, నరసింహ,పాషా,రవి తో పాటు ఉన్నారు.

# సివిల్ సప్లయ్ అధికారుల పర్యవేక్షణ లోపం

## భారత్ గ్యాస్ సిలిండర్ల మాయాజాలం వెలుగులోకి





**అచ్చంపేట (జనంసాక్షి):** నియోజకవర్గ కేంద్రంలో గ్యాస్ సరఫరాలో జరుగుతున్న అక్రమాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. సివిల్ సప్లయ్ అధికారుల పర్యవేక్షణలోపంతో వినియోగదారులకు అందాల్సిన గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీపై చాల కాలంగా వినియోగదారులు అను మానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా డీలర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ వినియోగానికి మళ్లిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆదివారం రెవెన్యూ పోలీస్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఈ అక్రమాలు బయట పడ్డాయి. పట్టణంలోని వివిధ హోటల్‌పై నిర్వహించిన దాడిలో అధికారులు 42 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన ఈ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అచ్చంపేట తహశీల్దార్ సైదులు ఆధ్వర్యంలో గ్యాస్ ఏజెన్సీపై నిర్వహించిన తనిఖీల్లో రికార్డుల్లో ఒక లెక్క ఉండగా గోదాంలో మరో లెక్క ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల ప్రకారం గోదాంలో ఉండాల్సిన సిలిండర్లు కనిపించకపోవడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. సుమారు 300 గ్యాస్ సిలిండర్లు గోదాంలో లేకపోవడం గమనించిన అధికారులు, అవి బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఉండవచ్చని అనుమా నిస్తున్నారు. ప్రజలకు అందాల్సిన గ్యాస్‌ను అక్రమంగా మళ్లించడం ద్వారా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ అక్రమాలపై తీవ్రంగా స్పందించిన తహశీల్దార్ సైదులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిం చేవిధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయా న్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసు కెళ్లిబా ధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామ ని స్పష్టం చేశారు.అచ్చంపేట పట్టణం లోచర్చనీయాంశంగా మారింది. బాధ్యులపై అధికారులు తీసుకునే చర్యల పై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతాం
- చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ కమిటీల ప్రకటన
- డివిజన్ జేఏసీ చైర్మన్ డా. ఆర్. పరమేశ్వర్




**చేర్యాల (జనంసాక్షి) :** చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమాన్ని ఊరూరా ఉధృతం చేయడానికి కమిటీలు ప్రకటిస్తున్నామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలో జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీలను ప్రకటించారు. రాజకీయ వ్యవహారాల సంప్రదింపుల కమిటీ సమన్వయకర్తలుగా అందె బీరయ్య ఫార్వర్డ్ బ్లాక్, అందె అశోక్ సీపీఐ, బస్వగళ్ల సిద్దయ్య బీఎస్పీ కుల సంఘాలు ప్రజా సంఘాల సమన్వయకర్తలుగా బుట్టి సత్య నారాయణ మాల మహానాడు, గడిపే బాలనర్సయ్య ఎమ్మార్పీ ఎస్, అంబాల రాము గౌడ సంఘం, రిటైర్డ్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల సమన్వయ కర్తలుగా పిల్లి చంద్రం, పోలోజు వెంక టాద్రి, కరెడ్ల రాజిరెడ్డి, ఎక్కలదేవి సుధాకర్, రైతు సంఘాల సమన్వయకర్తలుగా ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, పిల్లి రవి, విద్యార్థి, యువజన సంఘాల సమన్వయ కర్తలుగా రామగళ్ల నరేష్, చందా శ్రీకాంత్ ప్రవేట్ విద్యాసంస్థల సమన్వాయకర్తలుగా తౌట రామాంజనేయులు, ఎండి అక్బర్, దేవేందర్ రెడ్డి మహిళా సంఘాల సమన్వయకర్తలుగా పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, లైట్ మోటార్ యూనియన్ పచ్చిమడ్ల మహేందర్, పాక బాలయ్య, ఆర్ఎంపీల సమన్వ యకర్తలుగా నరసింహారెడ్డి చేర్యాల, రమేష్ మద్దూరు, కనకయ్య వీరన్నపేట, కనకయ్య కడవేరుగు క్రైస్తవ అసోసియేషన్ సమన్వయకర్తలుగా తెట్టె బావి దేవిడ్, మోజెస్, ఎర్రగుంట్ల ప్రభాకర్ లను ఎన్నిక చేశారు. త్వరలో మండల కమిటీలు ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ జేఏసీ నేతలు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్య నారాయణ, గడిపే బాలనర్సయ్య, పోలోజు వెంకటాద్రి, ఆత్మకూరి హరిక్రిష్ణ, తదితరులు ఉన్నారు.

## నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):**జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ సోమవారం ఇక్కడి కలెక్టరేట్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఏవో శ్రీధర్, జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలు, నోట్ పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- గూగుల్ మీట్ ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి తహసిల్దార్ లకి ఆదేశం
- ప్రతి కార్యాలయంలో పెండింగ్ ఫైల్లు వెంటనే క్లియర్ చేయాలి, కార్యాలయ పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, మార్చి 16(జనం సాక్షి):** సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కచ్చితంగా సమాధానం ఇస్తూ తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెండింగ్ ఫైళ్ళ పరిష్కారం, కార్యాలయాల పరిశుభ్రత తదితర అంశాలను కచ్చితంగా అమలుపరచాలని, పరిష్కరించిన ఫైళ్ళ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల అధికారులు, క్షేత్రస్థాయి మండల అధికారులకు సూచించారు. సీనియర్ సిటిజన్స్, భూ సంబంధిత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, దివ్యాంగుల పెన్షన్, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. మండల ప్రధాన కార్యాస్థానం నుండి గూగుల్ మీట్ ద్వారా సంబంధిత ఇనుగుర్తి, గార్ల, డోర్నకల్, కేసముద్రం, చిన్న గూడూరు, తహసిల్దార్లతో భూ సమస్య పరిష్కారం చేయుటకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి లో వివిధ శాఖలకు సంబంధించి 156 వచ్చిన దరఖాస్తులకు సంబందిత అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని జిల్లాల కార్యాలయ అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య




**పాలకుర్తి, మార్చి 16(జనంసాక్షి) :** కుటుంబ కలహాలతో వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ముత్తారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముత్తారం గ్రామానికి చెందిన వేముల అంజనే యులు భార్య వేముల కరుణ (32) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎనమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం రాత్రి కుటుంబం విషయంలో భార్య భర్తలు గొడవ పడ్డారు. అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి వంద మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం కుటుంబ సభ్యులు వెతకగా, బావి వద్ద కరుణ చెప్పులు కనిపించాయి. గ్రామస్తులు, భర్త ఆంజనేయులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బావిలో ఉన్న కరుణ మృతదేహాన్ని వెలుపలికి తీశారు. పోస్టుమారం నిమిత్తం మృతదేమాన్ని జనగాం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జఫర్ గడ్ మండలం తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన తల్లి రాపర్తి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపారు.

# రోడ్లపై చెత్త వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోండి



**వరంగల్ ఎంజీఎం, మార్చి 16(జనంసాక్షి):** ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకొని నగరంలో సమగ్ర శానిటేషన్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు."ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం బల్దియా పరిధిలోని 1వ మరియు 66వ డివిజన్లలోని హసన్‌పర్తి ప్రాంతంలో ఆకస్మికంగా శానిటేషన్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో భాగంగా నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించేలా వాలంటీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, జవాన్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లు కూడా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.సమగ్ర శానిటేషన్ నిర్వహణ కోసం జవాన్లకు లాగ్‌బుక్‌లు అందజేసినట్లు తెలిపారు. జవాన్లు ప్రతిరోజూ తమ పరిధిలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాలను లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే తమ పరిధిలో ఉన్న దుకాణాల నుంచి ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను కూడా చేపట్టాలని సూచించారు.ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో ప్రతి గడపకు వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి అందించే విధానంపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ సూచించిన కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.అనంతరం స్థానికంగా ఉన్న డీఆర్‌సీసీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. హసన్‌పర్తి మార్కెట్ ప్రాంతంలో కొందరు రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్నట్లు గమనించిన కలెక్టర్, వారిని మార్కెట్‌లోనే అమ్మకాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, సానిటరీ సూపర్వైజర్ నరేందర్, సానిటరీ ఇన్స్పెక్టర్ భాషా నాయక్, ఆస్కి ప్రతినిధి రాజ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సమాచార, సాంకేతిక శాఖ ప్రత్యేక కార్యదర్శిని కలిసిన మాజీ ఎమ్మెల్యే




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 16(జనంసాక్షి ):** బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర సమాచార, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బవేశ్ మిశ్ర ని మర్యాద పూర్వకంగా కలిసి తీర్యాణి మండలము లోని పంగడి మాదార, మంగి, గోపెర గ్రామాలలో సెల్ టవర్స్ నిర్మించి చాలా రోజులు అయినా ఇంకా కనెక్షన్ ఇవ్వలేదని, అదేవిధంగా ఆసిఫాబాద్ నియోజకవర్గము లోని గాదిగూడ, నార్నూర్, జైనూర్, సిర్పూర్ యూ, లింగాపూర్, కేరమేరి, వాంకిడి, ఆసిఫాబాద్ మండలంలలో అనేక గ్రామాలకు సెల్ సిగ్నల్స్ లేని కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులకు గురిఅగు చున్నారని ముఖ్యంగా పింఛన్ దారులు చాలా ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కావున తిర్యాణి మండలములోని పంగడి మాదార, గోపెరా, మంగి గ్రామాల సెల్ టవర్లకు త్వరితగతిన కనెక్షన్ ఇప్పించగలరని, సెల్ సిగ్నల్స్ లేని గ్రామాలకు సిగ్నల్స్ అందే విధంగా తగు చర్యలు చేపట్టాలని వినతి పత్రము సమర్పించిన ఆదివాసీ ముద్దు బిడ్డ ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు. సహానుకూలంగా స్పందించిన కార్యదర్శి సంబంధిత ఆదికారులకు నెల రోజులలో కనెక్షన్స్ ఇవ్వాలని ఆదేశించడమైనదని తెలిపారు.

# ఎస్సారెస్పీ జలాలు వృథా!

- ఆందోళనలో ఆయకట్టు రైతన్నలు
- కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్
- చివరి ఆయకట్టు గ్రామాల వరకు సాగునీరు అందేలా చూడాలని కోరుతున్న రైతులు





**చెన్నారావుపేట, మార్చి 16 (జనంసాక్షి) :** ఎస్సారెస్పీ జలాలు వృధాగా పోతున్న సంఘటన మండలంలోని కోనాపురం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. యాసంగి పంటల సాగు కోసం ఎస్సారెస్పీ అధికారులు డిబిఎం-40 ప్రధాన కాలువ ద్వారా గత మూడు రోజుల క్రితం ఎస్సారెస్పీ జలాలను వదిలారు. ప్రధాన కాలువ నుండి ఎస్సారెస్పీ ఉపకాల్వల ద్వారా గ్రామాలలోని చెరువులు, కుంటలలోకి సాగు నీరు వెళ్లాల్సి ఉంది. కాని మండలంలోని కోనాపురం గ్రామ శివారులో ఎస్సారెస్పీ ఉపకాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో కాలువలు నీటితో నిండిపోయి సాగు నీరంతా బయటికి వృధాగా పోతుంది. దీంతో గ్రామాలలోని ఆయకట్టు రైతన్నలు పూర్తిస్థాయిలో సాగునీరు అందక ఆందోళన చెందుతున్నారు. అంతేకాక కోనాపురం గ్రామ శివారులో సాగునీళ్లు వృధాగా బయటకి పోవడం మూలంగా మిగతా చుట్టుపక్కల గ్రామాలలోని చెరువులు, కుంటల లోకి సాగునీళ్లు వెళ్లకుండా అవుతుం దని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఎస్సారెస్పీ అధికారులు స్పందించి ఎస్సారెస్పీ ఉపకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి ఎస్సారెస్పీ జలాలు వృధాగా పోకుండా చూసి చివరి ఆయకట్టు గ్రామాల లోని చెరువులు, కుంటలు సాగునీ టితో నిండే విధంగా చూసి యాసంగి పంటల కు సాగు నీరు సమృద్ధిగా అందే విధంగా చూడాలని చెన్నారావుపేట మండలంలోని ఆయా గ్రామాల చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



# జిల్లా కలెక్టరేట్ వద్ద ఐకెపి వీవోఏల ధర్నా

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 16(జనంసాక్షి) :** తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఐకెపి వివోఏ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ కె హరిత కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ ఐకెపి వివోఏ లా సమస్యలు పరిష్కరించాలన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ కేటాయించి కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఉద్యోగ భద్రత ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఐకెపి ఉద్యోగులతో ఆన్లైన్,ఆఫ్లైన్ పనులు చేపించడం సరైంది కాదని దీంతో పనిభారం ఎక్కువ అవుతుందని మండిపడ్డారు. గతంలో ఐకెపి వివోఏ లు సమ్మె చేస్తున్నప్పుడు సమ్మెటెంటు వద్దకు వచ్చి తమ డిమాండ్లు న్యాయమైనవని ఇప్పుడున్న మంత్రులు అన్నారు. కానీ సంవత్సరాలు పైగా కావస్తున్న నేటి వరకు వీరికి ఉద్యోగ భద్రత కనీస వేతనం అమలు చేయలేదని వెంటనే ఐకెపి వివోఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి,జిల్లా అధ్యక్షుడు సెల్వట్కార్ బుద్ధు,కోశాధికారి జాడే ధనరాజ్, జిల్లా నాయకులు ముత్తినేని అంకన్న,తిరుపతి, రాంచందర్, మురళి, శ్రీధర్, భరత్, దేవి, సుజాత, డి రమాదేవి, అర్చన, ఇ కళ్యాణీ, భామినీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేసిన ఏంఎ జబ్బార్



**వరంగల్ ఈస్ట్, మార్చి 16 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఖిలా వరంగల్ ఈద్గా వద్ద తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ ఎంఎ జబ్బర్ రంజాన్ పర్వదినం సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏ జబ్బర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం పేద మహిళలకు సుమారు 1500 మందికి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉరుసు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా, మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్సై శ్రావణ్ లతోపాటు చాంద్ పాషా, యాకూబ్ బాబా, హసన్ అలీ బేగ్, రజాక్, అత్తర్, తదితరులు పాల్గొన్నారు.

# మిల్స్ కాలనీ పిఎస్‌లో గీత కార్మికుల ఫిర్యాదు



**వరంగల్ ఈస్ట్, మార్చి 16 (జనంసాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఉరుసు కరీమాబాద్ గీత కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. తమ గీత కార్మికుల భూములు, సంఘం డబ్బులకు సంబంధించిన లెక్కలు చూపించడంలో కొందరు గీత కార్మిక పెద్దలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధుల వద్దకు కూడా వెళ్లినట్లు వారు తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చేయాలని ఈ సందర్భంగా వారు పోలీసులను కోరారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేసి గీత కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.


# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 16 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్యతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వసతి గృహాలలో ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలపై దృష్టి సారించాలని, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాలలో వరదల కారణంగా ఇబ్బందులకు గురయ్యే గృహ నివాసాలను గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు.

# పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని రాస్తారోకో





**బెల్లంపల్లి, మార్చ్ 16 (జనంసాక్షి) :** పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని, అమెరికా, ఇజ్రాయిల్ లు ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలనిడిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి పట్టణంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో కాంటా చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు బొల్లంపూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య మాట్లాడుతూ ఇరాన్ లోని చమురు సంస్థలను ఆక్రమించుకునే దుష్టపన్నాగంలో భాగంగా ఇరాన్ అణు ఆయుధాలు కలిగియున్నదని సాకు చెబుతూ ఇజ్రాయిల్ తో కలిసి అమెరికా ఇరాన్ పై యుద్ధానికి పాల్పడిందని అన్నారు. క్షిపణులతో దాడులు చేస్తూ, బాంబుల వర్షం కురిపించి అనేక సంస్థలను, భవనాలను, పాఠశాలలను నాశనం చేస్తుందన్నారు. రష్యా నుండి చమురును దిగుమతి చేసుకోవడానికి అనుమతి ఇవ్వడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఎవరు ఇచ్చాడు అధికారం ఇచ్చారని ప్రశ్నించారు. భారత ప్రధాని మోదీ అమెరికాకు దాసోహం చేయడం తగదని, పెంచిన రేట్లు తగ్గించాలని ఇరాన్పై యుద్ధాన్ని ఆపాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, పట్టణ సహాయ కారదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజ్యం, గుండా చంద్రమాణిక్యం, పట్టణ కార్యవర్గ సభ్యుడు బొంకురి రామచందర్, మహిళా సంఘం నాయకురాలు బొల్లం సోని, బొంతల కళారాణి, కాసిపేట స్వర్ణలత, నాయకులు బూర్ల సమ్మయ్య, అందుగుల రాజేందర్, కే తిరుపతి, ఇనుముల రాయమల్లు, బుడిమే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

**హనుమకొండ ప్రతినిధి మార్చి 16 (జనం సాక్షి) :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం నెలకొందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ గ్యాస్ సిలిండర్ లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు నెలకొన్నఈ సంక్షోభం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టి లేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతల యొక్క ప్రత్యక్ష ఫలితం అన్నారు. ఎల్పీజీ ధరల పెరుగుదలను, లక్షలాది మంది సాధారణ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టే పెరుగుతున్న సరఫరా కొరతను భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గృహ సిలిండర్లపై రూ. 60, వాణిజ్య సిలిండర్లపై రూ. 115 పెరుగుదలతో పాటు అనేక ప్రాంతాలలో లభ్యత లేకపోవడంతో, వంట గ్యాస్ పొందడానికి ప్రజలు మండే ఎండలో పొడవైన క్యూలలో నిలబడవలసి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కొట్టే వెంకటేష్, అదరి రమేష్, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, కామెర వెంకట రమణ, అలువాల రాజు, యాళ్ల సంజయ్, లకవత్ లక్ష్మీ, భూక్యా స్వరూప, గోకాల రాజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే చమురు సంక్షోభం

- అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం
- పెంచిన గ్యాస్ పెట్రోల్ ధరలను కేంద్రం నియంత్రించాలి : సిపిఐ




**కొండమల్లేపల్లి, (జనంసాక్షి):** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం నెలకొందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని చమురు సంక్షోభాన్ని నివారించాలని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ కొండమల్లేపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ చమురు గ్యాస్ సంక్షోభం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టి లేని విధానాలు తప్పుడు ప్రాధాన్యతల ప్రత్యక్ష ఫలితం అన్నారు. ప్రభుత్వం తన విదేశాంగ విధాన ఎంపికల పరిణామాలను భారతదేశ ఇంధన భద్రత సరఫరాపై వాటి ప్రభావాన్ని అంచనా వేయడంలో విఫలమైందన్నారు. వినియోగదారులను రక్షించడానికి బదులుగా ఆ భారాన్ని పూర్తిగా ప్రజలపై పడేలా చేసిందని ఈ వైఫల్యాల పరిణామాలను ఎదుర్కోలేక ప్రధానమంత్రి ఉపశమనం కల్పించడం కంటే ప్రతిపక్షంపై దాడి చేయడంలో బిజీగా ఉన్నారని అన్నారు. ఎల్పీజీ ధరల పెరుగుదలను లక్షలాది మంది సాధారణ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టి పెరుగుతున్న సరఫరా కొరతను భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గృహ సిలిండర్లపై రూ.60, వాణిజ్య సిలిండర్లపై రూ.115 పెరుగుదలతో పాటు అనేక ప్రాంతాలలో లభ్యత లేకపోవడంతో వంట గ్యాస్ పొందడానికి ప్రజలు మండే ఎండలో పొడవైన క్యూలలో నిలబడవలసి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్పీజీ శ్రామిక కుటుంబాలకు ఒక ప్రాథమిక అవసరం అయినప్పటికీ మోడీ ప్రభుత్వ వైఫల్యంతో దానిని రోజువారీ పోరాటంగా మార్చిందన్నారు. వాణిజ్య సిలిండర్లపై ఆధారపడిన చిన్న తినుబండారాలు, టీ స్టాళ్లు, ధాబాలు, రెస్టారెంట్లపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం కొనసాగుతుందని యుద్ధాన్ని నివారించడానికి భారత్ తో సహా ప్రపంచ దేశాలు కృషి చేయాలని అన్నారు. భారత దేశం చమురు కొనుగోలు చేయడానికి అమెరికా సహా ఏ దేశం అనుమతి అవసరం లేదని ఈ విషయంలో భారత దేశం సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ధర్నాలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి పెరికేటి శేఖరాచారి, పట్టణ కార్యదర్శి సోమ్లా నాయక్, మండల నాయకులు పన్నాల శ్రీనివాస్, కల్లు చరణ్ రెడ్డి, వీరస్వామి, ధర్మయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం

- జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వంటావార్పు నిర్వహించిన ఆశా కార్యకర్తలు
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు




**నాగర్ కర్నూల్, మార్చి 16 (జనంసాక్షి):** తెలంగాణ కాంగ్రెస్ నూతన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నూతన ప్రజా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆశా కార్యకర్తలకు అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తే తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామని హామీని ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు దాటుతున్న సమస్యలు పరిష్కరించకుండా అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేస్తున్నారని ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అక్రమ అరెస్టులు ఆపాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వంటావార్పు నిర్వహించి ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ పథకం కింద పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు సరియైన పారితోషకాలు చెల్లించకుండా వారితోవెట్టి చాకిరి చేయిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే ఫిక్స్ వేతనం అమలు చేస్తామని ఎవరు కూడా రోడ్డు ఎక్కి ధర్నా చేయవలసిన అవసరం లేదని చెప్పిన కాంగ్రెస్ నూతన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడుస్తున్న ఇప్పటివరకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన అన్నారు. మేము అధికారంలోకి వస్తే ప్రతినెల 5వ తేదీ లోపు పారితోషకాలు చెల్లిస్తామని చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం రెండు మూడు నెలలుగా పెండింగ్లో ఉంటున్న పారిపోషకాలు చెల్లించకుండా పారితోషకాలు అడుగుతే ఆశాలను అరెస్టు చేసి స్టేషన్లకు తరలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అందులో భాగంగా పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆశాలకు ఫిక్స్ వేతనం అమలు చేసి గ్రాటిటీ అమలు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు అమలు చేస్తున్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ నూతన ప్రభుత్వం ఎందుకు అమలు చేయరని వారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కనీస వేతనాలు అమలు చేయని కార్మికుల జీతాలకు చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైసింగ్, ట్రిబుల్ ఆర్, మూసి సుందరీకరణ వంటి పథకాలతో గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఆశలకు పెండింగ్లో ఉన్న పారితోషకాలు వెంటనే చెల్లించాలని ఫిక్స్ వేతనం 18000 అమలు చేయాలని లేదంటే అసెంబ్లీ అసెం బ్లీని ముట్టడిస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు స్వప్న, శ్రీదేవి, కృష్ణవేణి, రత్నమాల, నారమ్మ, తార, ఉమా, రాణి, సువర్ణ, లక్ష్మీ, చంద్రకళ, వరలక్ష్మి, శశికళ, నర్మదా, శివలీల, శారద, రాధా, సునీత, కవిత, వెంకటేశ్వరమ్మ, జ్యోతి, రాధిక, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




## కలెక్టరేట్ ముందు టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

**భువనగిరి టౌన్, (జనంసాక్షి):** కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (KGBV), యుఆర్ఎస్ మరియు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్కు మెమోరాండం సమర్పించారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన మూడు దశల పోరాట కార్యక్రమాలలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య, జిల్లా కార్యదర్శి మెతుకు సైదులు, కేజీబీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మినిమం టైం స్కేలు అమలు చేయడంతో పాటు కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలను మినహాయించి, వారి స్థానంలో కేర్ టేకర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 20వ తేదీ లోపు ప్రభుత్వం స్పందించకపోతే "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ వెంకటాచారి, కేజీబీవీ జిల్లా కన్వీనర్ కే కవిత, యుఆర్ఎస్ నాయకులు యాకయ్య, ఎస్ఎస్ఏ నాయకులు నాగార్జున, పాండు, స్వామి, టీఎస్ యుటిఎఫ్ నాయకులు సుదర్శన్ రెడ్డి, డి వెంకన్న, డి రవి, అంజయ్య, ఎల్లయ్య, సోమయ్య, వెంకటేష్, నరసింహాతో పాటు వివిధ విభాగాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులకు కొరత లేకుండా విత్తనాలు, ఎరువుల సరఫరా చేయాలి



- వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి
- డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పక్కాగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్




**గద్వాల నడిగడ్డ, (జనంసాక్షి):** రైతులకు అవసరమైన విత్తనాలు ,ఎరువులు కొరత లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివ శంకర్ ఆగ్రో ట్రేడర్స్ ఫర్టిలైజర్స్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వారికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎరువుల స్టాక్ వివరాలను ప్రతి రోజూ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, స్టాక్ బోర్డు ప్రకారం కచ్చితంగా నిల్వలు ఉండాలన్నారు. స్టాక్ లెక్కలలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ వివరాలను ఖచ్చితంగా రిజిస్టర్లో నమోదు చేయాలనీ, ఎరువుల ధరలు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉండాలన్నారు. అన్ని విక్రయాలు ఈ - పాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని, లైసెన్స్ లేకుండా ఎరువుల అమ్మకాలు జరగకూడదని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ నిల్వచేసిన మందులు, వైద్య సామగ్రిని సెంట్రల్ డ్రగ్ స్టోర్కు తరలించాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోపల, పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. అంతకుముందు గోనుపాడు శివారులో కలెక్టర్ పొలాలను సందర్శించి పంటల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయాధికారి ప్రతాప్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుదుటపడుతున్న తమ్మినేని ఆరోగ్యం

**ఆందోళన వద్దు : సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా**



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి):** సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోగ్య స్థితిగతులు మెరుగువుతున్నాయి. రెండు రోజుల క్రితం ఆయన ఆరోగ్య పరిస్థితులు క్షీణించడంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్న వైద్యులు సోమవారం ఆయన్ను కాజువాలిటిలోకి మార్చారు. ఊపిరితిత్తుల సమస్య , మూత్రపిండాల్లో క్రియాటిన్ లెవెల్స్ పెరగడం, రెండుసార్లు గుండెపోటుకు గురికావడం అనారోగ్య కారణాలతో కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య చికిత్సల అనంతరం ఆయన కోలుకుం టున్నారు. కావున పార్టీ శ్రేణులు ఆందోళన చెందవద్దని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు సూచించారు. తమ్మినేని వీరభద్రాన్ని. నున్నానా గేశ్వ రరావుతో పాటు సీఐటీయూ జాతీయ కో శాధికారి ఎం.సాయిబాబు, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రా వు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, అన్న వరపు కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. నవీన్ రెడ్డి, నాయకులు వీరబాబు పరామర్శించారు.

# యుద్ధం ఆపాలంటూ లేఖలు రాసిన చిన్నారులు





**కోదాడ, (జనంసాక్షి):** కోదాడకుచెందిన తేజ విద్యాలయ విద్యార్థులు అమెరికా, ఇజ్రా యెల్ కలిసి ఇరాన్ మీద చేస్తున్న యుద్ధం ఆపాలంటూ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనర ల్ ఆంటోనియా ఘుట్టెరస్ కు పోస్టల్ లేఖలు రాశారు.యుద్ధం వలన సామాన్య ప్రజలు , ముఖ్యంగా చిన్నారులు చనిపోవడం, ఎంతోమంది దివ్యాంగులుగా కావడం, నిర్వాసితు లుగా మారడం జరుగుతుందని ఈ లేఖలలో పేర్కొన్నారు. భారత దేశంలో కూడా యుద్ధ ప్రభావం కనబడుతుందని ముఖ్యంగా గ్యాస్, ఇంధన వనరుల కొరత ఏర్పడిందని దీని మూలంగా అన్ని నిత్యావసర వస్తువుల ధర పెరుగుతుందని రాసారు. క్రూడాయిల్ వెలికి తీసే భావనల మీద క్షిపణులతో దాడి చేయడం వలన పర్యావరణానికి పెద్ద ప్రమాదముం దని వెంటనే యుద్ధం ఆపుచేసి చర్చల ద్వారా సమస్యను సామర స్యంగా పరిష్కరించు కోవాలని విద్యార్థులు తమ లేఖలో వివరించారు. పశ్చిమాసియాలో ఏర్పడిన ఉద్రిక్తతలు , యుద్ధం వలన భారత దేశం నుండి బ్రతుకు దెరువు కోసం వెళ్లిన లక్షలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనిని వెంటనే భారత్కు రప్పించాలని విద్యార్థులు లేఖలో విజ్ఞప్తి చేసారు. యుద్ధం వలన వినాశనం తప్ప మరేమి ఉండదని విద్యార్థులు లేఖలలో పేర్కొన్నారు. తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతి వారం రాసే సృజనా త్మక రచనా విధానంలో భాగంగా లేఖారచన కోసం ఈ సారి యుద్ధానికి వ్యతిరేకంగా లేఖా రచనను ఎంచుకోవడం జరిగింది. ఐక్యరా జ్యసమితి సెక్రటరీ జనరల్ ను ఉద్దేశిం చి వారి భారత కార్యాలయం గల న్యూఢిల్లీకి పోస్టు కార్డు మీద ఉత్తరం రాయడం జరిగింది. విద్యార్థులు ఈ లేఖా రచనలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ లేఖా రచనను అకడమిక్ సహాయకులు జోస్ సామ్యూల్ , ఆంగ్ల ఉపా ధ్యాయుడు మహ్మద్ ఆరిఫ్ నిర్వహించారు. ఈ లేఖలను పోస్టు ద్వారా ఐక్య రాజ్యసమితి సెక్రటరీ జనరల్ కు పంపించడం జరిగింది.ఈ లేఖారచన ద్వారా విద్యార్థు లకు యుద్ధం వలన జరిగే దుష్పరిణామాలు గురించి తెలుస్తుందని భవిష్యత్తులో వారు యుద్ధ వ్యతిరేకత కలిగి శాంతి ని కోరుకుం టారని ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొని విద్యార్థులను అభినందించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**సూర్యాపేటజిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని, అలాగే ప్రతి కార్యాలయంలోని ఫైల్స్ అన్ని సక్రమంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ యాప్లో నమోదు చేయాలని అన్నారు. కలెక్టరేట్లోని ప్రతి కార్యాలయం సందర్శిస్తానని, ఫైల్స్ సరిగా లేకపోయినా, శుభ్రంగా ఉండని కార్యాలయాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 41 దరఖాస్తులు వచ్చాయని,డిడబ్ల్యుఒకు 4, డిపిఒకు 3, డిఆర్డిఏకు 3, మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని తెలిపారు.వచ్చిన మొత్తం 68 దరఖాస్తులు వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఈఓ శిరీష, జిల్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, డిఈఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆఫీసు గుమ్మం వద్ద రైతుల పడిగాపులు

**అధికారుల గైర్హాజరుపై ఆగ్రహజ్వాలలు**



**మాడుగులపల్లి, (జనంసాక్షి):** రైతే రాజు అన్నది కేవలం మాటలకే పరిమితమా? క్షేత్రస్థాయిలో రైతుకు అండగా ఉండాల్సిన అధికారులకు ఏమైంది? నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం తీరు చూస్తుంటే అక్కడ పనిచేసేది ప్రభుత్వ ఉద్యోగులా లేక వారి సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారా? అన్న అనుమానం కలగక మానదు. గంటల తరబడి కార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్న రైతుల గోడు వినే నాథుడే కరువయ్యాడు.

**సమయపాలన అంటే ఏంటో తెలుసా?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకే కార్యాలయంలో ఉండాల్సిన అధికారులు, 11 గంటలు అవుతున్నా అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కష్టపడి పండించే రైతులు తమ సమస్యల కోసం, విత్తనాలు, ఎరువుల సలహాల కోసం, ప్రభుత్వ పథకాల వివరాల కోసం పొలం పనులు వదులుకుని వస్తే వారికి తాళం వేసిన తలుపులే, కాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయి.

**రైతుల ఆగ్రహం అధికారుల మొండితనం!**

మా పనులు మేం మానుకుని వస్తే, ఇక్కడ అధికారులు ఏసీ గదుల్లో కూర్చోవడం కాదు కదా అసలు ఆఫీసుకే రావడం లేదు. ఫోన్ చేస్తే మీటింగ్ అని సాకులు చెబుతారు. సామాన్య రైతు అంటే వీరికి అంత చులకనా? అని రైతులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల మాడుగులపల్లి రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి.

**జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించండి**

మాడుగులపల్లి వ్యవసాయ కార్యాలయంపై జిల్లా ఉన్నతాధికారుల నియంత్రణ ఉందా? లేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. జీతాలు మాత్రం టంచనుగా తీసుకుంటూ, విధుల్లో సమయపాలన పాటించని ఇలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతాంగం హెచ్చరిస్తోంది.

# వైద్యం విషయంలో డాక్టర్లు భరోసా కల్పించాలి

**అన్నారంలో పల్లె దావకాన పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహం**



**తుంగతుర్తి (జనంసాక్షి):** వైద్యం విషయంలో అనారోగ్యంతో వచ్చే ప్రజలకు డాక్టర్లు భరోసా కల్పించి మంచి వైద్యాన్ని అందించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహం అన్నారు, సోమవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పల్లె దవఖానను సందర్శించి డాక్టర్ , సిబ్బందితో మాట్లాడి వసతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో పల్లె దవఖానాల యొక్క ఆవశ్యకతను వారికి వివరించి అనారోగ్యంతో వచ్చే ప్రజలకు మంచి వైద్యం అందించి భరోసా కల్పించాలని సూచించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ దవఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్య సదుపాయాలు పొందాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సిఐ నరసింహారావు, ఎస్సైలు, పల్లె దావకాన డాక్టర్ రమ్య, గ్రామ ఆశా వర్కర్లు ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు బ్రాహ్మణుల నిరసన



**మేళ్ల చెరువు (జనంసాక్షి):** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు బ్రాహ్మణుల పట్ల, హిందూ ధర్మం పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మేళ్లచెరువు తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తపరిచారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మందుల సామేలపై చర్యలు తీసుకోవాలని, బ్రాహ్మణ సంఘానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ రాజేందర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చక సంఘం ప్రతినిధులు, వాసుదేవ శర్మ, కె. విష్ణువర్ధన్ శర్మ, కే ధనుంజయ శర్మ, హరి లక్ష్మణ్ కుమార్,అధిక సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# విపణి

## ఫోన్‌పేకు వార్ సెగ..

### ఐపీఓ సన్నాహాలకు తాత్కాలిక బ్రేక్




**న్యూఢిల్లీ:**వాల్‌మార్ట్ నేతృత్వంలోని ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇప్పటికే సెబీ నుంచి ఆమోదం పొందినా ఈ సంస్థ లిస్టింగ్ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితుల వల్ల నెలకొన్న మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ సీఈఓ సమీర్ నిగమ్ వెల్లడించారు. మార్కెట్లలో స్థిరత్వం వచ్చాక మళ్లీ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. త్వరలో పరిస్థితి సద్దుమణుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.ఫోన్‌పే డిజిటల్ పేమెంట్ యాప్ 2016లో లాంచ్ అయ్యింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి 65 కోట్ల రిజిస్టర్డ్ యూజర్లు, 4.7 కోట్ల మర్చంట్లతో డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో మార్కెట్ లీడర్‌గా ఉంది. డిజిటల్ చెల్లింపులతో పాటు ఇన్సూరెన్స్ అగ్రిగేటర్‌గానూ వ్యవహరిస్తోంది. స్టాక్‌బ్రోకింగ్ యాప్ షేర్‌మార్కెట్, గూగుల్‌కు ప్రత్యామ్నాయ వేదిక ఇండస్ యాప్ స్టోర్‌ను కలిగిఉంది. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ.. ఐపీఓ ద్వారా రూ.10వేల కోట్లు పైనే సమీకరించాలని భావిస్తోంది. సెబీ నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ పొందింది. ఈ తరుణంలో పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ఐపీఓకు బ్రేక్ పడింది.ఒక్క ఫోన్‌పేనే కాదు.. మరికొన్ని ఐపీఓలు సైతం ఆలస్యం కానున్నాయి. ఇప్పటికే సుమారు 141 కంపెనీలు నియంత్రణ సంస్థల నుంచి అనుమతి పొంది లిస్టింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఆయా సంస్థలు సంయుక్తంగా రూ.1.64 లక్షల కోట్లు సమీకరించనున్నాయి. ఇందులో సుమారు 80 కంపెనీలకు పబ్లిక్ ఇష్యూను తీసుకురావడానికి 3 నుంచి 9 నెలల గడువు ఉంది. మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో అవి ఆచితూచి వ్యవహరిస్తున్నాయి.

### మస్క్ టీంలోకి.. భారత సంతతి టెకీ అమన్ గొట్టుముక్కల

**వాషింగ్టన్:**భారత సంతతికి చెందిన డెవలపర్ అమన్ గొట్టుముక్కల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో కలిసి పని చేయనున్నాడు. అమన్ ఇటీవల తన బృందంతో కలిసి ఫైర్‌బెండర్ అనే ఏఐ కోడింగ్ అసిస్టెంట్‌ను ప్రారంభించాడు. ప్రోగ్రామర్లు కోడ్‌ను మరింత సమర్థవంతంగా రాయడానికి ఇది సహాయపడుతుంది. ఎక్స్‌ఏఐ అడ్వాన్స్ కోడింగ్ ఏఐ సిస్టమ్స్ అభివృద్ధిలో భాగమయ్యేందుకు తాను ఎలాన్ మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ సంస్థ ఎక్స్‌ఏఐలో చేరుతున్నట్లు అమన్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. అధునాతన కోడింగ్ ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపాడు. కృత్రిమ మేధ యుగంలో మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఎక్స్‌ఏఐ సరైన ప్రదేశమని గొట్టుముక్కల పేర్కొన్నాడు. సూపర్ ఇంటెలిజన్స్‌ను అందుకోవడానికి తాను చేస్తున్న ప్రయత్నానికి అవసరమైన కంప్యూటింగ్ శక్తిని ఎక్స్‌ఏఐ అందిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశాడు. ఆయన పోస్టుపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. ఎక్స్‌ఏఐలోకి ఆహ్వానించారు.

# వడ్డీ రేట్ల కోతపై నీలినీడలు..

### దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు బంగారం, వెండి ధరల పైనా ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్న నేపథ్యంలో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. దీంతో ఇప్పటికిప్పుడు అమెరికా ఫెడ్ సహా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీనికితోడు డాలర్ విలువ బలోపేతం కావడం కూడా బంగారం, వెండి గిరాకీ తగ్గడానికి కారణం. సాధారణంగా వడ్డీ రేట్లు తగ్గినప్పుడు బంగారం, వెండికి డిమాండ్ ఏర్పడి తద్వారా వీటి ధరలు పెరుగుతాయి. వడ్డీ రేట్లు అధికస్థాయిలో ఉన్నప్పుడు డిమాండ్ నెమ్మదిస్తుంది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 5002 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.38 వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. వెండి కిలో రూ.2.58 లక్షలు పలుకుతోంది.



**100 డాలర్ల మార్క్ దాటిన ముడిచమురు**

అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ కిలో వెండి ధర మే నెల డెలివరీ కాంట్రాక్టు రూ.4,232 క్షీణించి రూ.2,55,203 పలుకుతోంది. ఏప్రిల్ కాంట్రాక్టు 10 గ్రాముల బంగారం ధర 1.5 శాతం క్షీణించి రూ.1.56 లక్షలుగా ఉంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ జపాన్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, పీపుల్స్ బ్యాంక్ చైనా వంటివి ఈ వారంలో వేర్వేరుగా సమావేశమై వడ్డీ రేట్లపై నిర్ణయంపై తీసుకోనున్నాయి. దీనిపై ట్రేడర్లు దృష్టిసారించే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. మార్చి నెలలో వడ్డీ రేట్ల కోత ఉండకపోవచ్చని ఇప్పటికే మార్కెట్ అంచనా వేస్తోంది.

## కార్లకు 15 లీటర్లు.. బస్సులకు 60 లీటర్లు!

కొలంబో:పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో వివిధ దేశాలు ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు శ్రీలంక ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పరిమిత స్థాయిలో ఇంధన పంపిణీ (ఫ్యూయల్ రేషనింగ్)కి క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకువచ్చింది. కార్లకు వారానికి 15 లీటర్లు, బస్సులకు 60 లీటర్లు ఇంధనాన్ని మాత్రమే పంపిణీ చేయనున్నట్లు శ్రీలంక ప్రభుత్వం పేర్కొంది.వినియోగదారులు ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేయకుండా క్యూఆర్ రేషనింగ్‌ను ప్రవేశపెట్టినట్లు శ్రీలంక ఇంధన మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుతానికి ఇంధన నిల్వలు ఉన్నప్పటికీ.. ముందు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టామని తెలిపింది. ఈ విధానంలో ప్రతి వాహనానికి ఓ క్యూఆర్ ట్యాగ్‌ను జత చేస్తారు. 2022లో శ్రీలంక ఆర్థిక, ఇంధన సంక్షోభం ఎదుర్కొన్న సమయంలోనూ ఇంధన పంపిణీకి క్యూఆర్ పద్ధతిని ప్రయోగించగా అది విజయవంతమైంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో మరోసారి దీన్ని అమలు చేస్తున్నారు.



## ఏఐ టూల్స్ నేర్చుకుంటేనే పదోన్నతి

### లేకుంటే ఉద్యోగాలకే ముప్పు • యాక్సెంచర్ చీఫ్ జూలీ స్వీట్

**వాషింగ్టన్:**దిగ్గజ కన్సల్టింగ్, ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ తన కార్యకలాపాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. కెరీర్‌లో వృద్ధి కోసం ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించింది. కార్యకలాపాలను ఏఐతో అనుసంధానం చేయడానికి వచ్చే మూడు సంవత్సరాల్లో 3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.27,600 కోట్ల) పెట్టుబడులు పెట్టనుంది. ఏఐ నిపుణుల సంఖ్యను రెట్టింపు చేసి 80,000కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య సంస్థలు తమ రోజువారీ కార్యకలాపాల్లో ఏఐను ఎక్కువగా వినియోగిస్తున్న తరుణంలో.. తమ ఉద్యోగులు కెరీర్‌లో ఎదగడానికి ఏఐ నైపుణ్యాలు ప్రాథమిక అవసరమని యాక్సెంచర్ పేర్కొంది. ఏఐను అందిపుచ్చుకోలేని వారు కంపెనీలో కొనసాగలేకపోవచ్చని యాక్సెంచర్ చీఫ్ జూలీ స్వీట్ స్పష్టం చేశారు. కంపెనీలో ఉన్నత స్థానాలకు ఉద్యోగులు ఎదగాలంటే, ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగులు ప్రమోషన్ పొందాలనుకుంటే, యాక్సెంచర్‌ను నిర్వహించడానికి మేము చేసే పనులను, వారు కూడా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబరులో, 865 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఆరు నెలల ఆప్టిమైజేషన్ కార్యక్రమాన్ని కంపెనీ తీసుకొచ్చింది. డిజిటల్, ఏఐ సేవల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యోగులు, కార్యకలాపాలను సర్దుబాటు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.

2023లో ప్రకటించిన మూడేళ్ల ప్రణాళికలో తాజా 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఒక భాగం. కార్యకలాపాల్లో ఏఐకు ప్రాధన్యత ఇవ్వడమే దీని ఉద్దేశం. నియామకాలు, కొనుగోళ్లు, శిక్షణ ద్వారా ఏఐ నిపుణుల సంఖ్యను 80,000కు రెట్టింపు చేయనున్నారు. ప్రస్తుతం యాక్సెంచర్‌లో పప్రపంచవ్యాప్తంగా 7,70,000 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కార్యాలయంలో ఏఐను అనుసంధానించడం, పనిలో సాంకేతిక పరిణామక్రమంలో ఒక సహజమైన దశ. ప్రస్తుతం ఏఐ టూల్స్ నేర్చుకోవాలనే ఒత్తిడిని, గతంలో ఆఫీసుల్లో కంప్యూటర్లు ముఖ్యమైన భాగమైన రోజులతో జూలీ పోల్చారు. కంప్యూటర్ ఉపయోగించమని ఎవరినైనా అడగడాన్ని, ఒత్తిడి చేస్తున్నారని ఎవరూ అనరని తెలిపారు. ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే, మీ కంపెనీని పునర్నిర్మించడానికి మీరు సిద్ధంగా ఉండాలని ఇతర కంపెనీల సీఈఓలకు ఆమె సలహా ఇచ్చారు. ప్రారంభంలో ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను అలవాటు చేసుకోవడంలో ఇబ్బందులు పడ్డారని, వీటిని స్వీకరించడానికి సిబ్బంది, కంపెనీ సంప్రదాయ పద్ధతుల్లో మార్పులు అవసరమన్నారు. తమ ఉద్యోగులు - క్లయింట్‌లకు ఇది కష్టమైన విషయమే అయినా తప్పదని వివరించారు.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,900 | ₹ 1,59,170 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,76,000

# దాడులన్నీ చమురుపైనే..

**అమెరికా ఖర్గ్‌ఐలాండ్‌పై దాడికి ముమ్మర యత్నాలు • ఇంకో ఐదేళ్లయినా యుద్ధానికి రెడీ: ఇరాన్**



దుబాయ్: ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధం చమురు చుట్టూనే తిరుగుతోంది. ఇరాన్ చమురు బలాన్ని అడ్డుకుంటే.. ఆ దేశం దిగివస్తుందనేది అమెరికా వ్యూహంగా ఉంది. అదే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటే ప్రపంచంపై ఒత్తిడి పెరిగి అగ్రరాజ్యం యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఇరాన్ అనుకుంటోంది. శుక్ర, శనివారాల్లో రెండింటి వ్యూహాలు ఈ దిశగానే సాగాయి. ఇరాన్ చమురుకు ఆయువుపట్టయిన ఖర్గ్ ద్వీపంలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు చేసింది. ఇరాన్ ఓటమిని అంగీకరించకుంటే అక్కడి చమురు క్షేత్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇటు హర్మూజ్ జల సంధిలో చమురు రవాణాకు ఇరాన్ మరిన్ని అడ్డంకులు సృష్టిస్తోంది. దీనిని అడ్డుకోవడానికి పలు దేశాలు యుద్ధ నౌకలను పంపనున్నాయని ట్రంప్ తెలిపారు. అదే జరిగితే ఆయా దేశాల్లోకి చొరబడతామని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు అమెరికా దాడులు చేయడానికి ఉపయోగించుకుంటున్న యూఏఈ నగరాలపై దాడులు చేస్తామని పేర్కొంది. ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని సూచించింది.ఇరాన్‌లోని ఖర్గ్, అబు మూసా ద్వీపాలపై అమెరికా బలగాలు శుక్రవారం విరుచుకుపడ్డాయి. అక్కడి సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయి. వైమానిక, నౌకా స్థావరాలు, విమానాశ్రయ కంట్రోల్ టవర్, చమురు సంస్థ హెలిప్యాడ్‌లపై దాడులు జరిగాయి. ఖర్గ్.. ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఈ ద్వీపంలో సైనిక స్థావరాలను ధ్వంసం చేశామని ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్‌లో నౌకలను అడ్డుకుంటే చమురు క్షేత్రాలపైనా దాడులు చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా దాడులవల్ల ఖర్గ్‌లోని చమురు క్షేత్రాలకు ఎటువంటి నష్టం జరగలేదని ఇరాన్‌కు చెందిన ఫార్స్ వార్తా సంస్థ వెల్లడించింది. దాడులవల్ల 15 పేలుళ్లు చోటుచేసుకున్నాయని తెలిపింది.ఇప్పటిదాకా ఇరాన్‌లోని 15,000 లక్ష్యాలపై దాడులు చేశామని, రోజుకు 1,000కిపైగా లక్ష్యాలపై బాంబులు వేశామని అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో 52 సాంస్కృతిక కేంద్రాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ వెల్లడించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది. ఇప్పటిదాకా ఆ దేశంపై జరిగిన దాడుల్లో 800 మందికిపైగా మృతి చెందారు. 8,50,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ దాడుల్లో మొత్తం 26 మంది వైద్య సిబ్బంది మరణించారు. మరో 51 మంది గాయపడ్డారు.శుక్రవారం రాత్రి లెబనాన్‌లోని బుర్జ్ ఖలాయియాలోని ఆరోగ్య కేంద్రంపై వైమానిక దాడి జరిగింది. ఈ ఘటనలో 12 మంది మరణించారు. మన చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుంటే గల్ఫ్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ హెచ్చరించింది. ఆ దేశాల చమురు, ఆర్థిక, ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. యూఏఈలోని పోర్టులు, డాక్‌యార్డులు, రహస్య కేంద్రాల నుంచి ఖర్గ్ ద్వీపంపై అమెరికా దాడులు చేసిందని, తాము యూఏఈలోని నగరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇరాన్‌లోని మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని 24 గంటల్లో ఇజ్రాయెల్ 200 దాడులు చేసింది. ఇందులో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, రక్షణ వ్యవస్థలు, ఆయుధ ఉత్పత్తి కేంద్రాలున్నాయి. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై శనివారం ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులను కొనసాగించింది. హర్మూజ్ జల సంధిని మరింతగా మూసివేసింది. ఇరాక్‌లోని బాగ్దాద్‌లో ఉన్న అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి జరిగింది. హెలిప్యాడ్ ధ్వంసమైంది. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద అమెరికా ఎంబసీల్లో ఒకటి. దీనిపై ఇరాన్ అనుకూల మిలిటెంట్లు పదే పదే దాడులు చేస్తున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి చేయగా రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. అయితే ఆ శకలాలు చమురు కేంద్రాన్ని తాకాయి. ఫజైరా పోర్టుపై జరిగిన దాడితో మంటలు చెలరేగాయి. డ్రోన్‌ను అడ్డుకున్నా శకలాలు పడి మంటలు వచ్చాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యూఏఈపై 9 బాలిస్టిక్ క్షిపణులను, 33 డ్రోన్లను ఇరాన్ ప్రయోగించింది. వీటితో కలిపితే యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా యూఏఈవైపు 294 బాలిస్టిక్, 15 క్రూజ్ క్షిపణులు, 1,600 డ్రోన్లు దూసుకొచ్చాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించగా 141 మంది గాయపడ్డారు. దుబాయ్‌లో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రమైన ఓ భవనంపై దాడి జరిగింది. 24 గంటల్లో ఈ ప్రాంతంలో రెండోసారి దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది.యూఏఈలోని జెబెల్ అలీ, ఖలీఫా, ఫజైరా పోర్టులను ఖాళీ చేయాలని ఇరాన్ హెచ్చరించింది. వాటిపై దాడులు చేస్తామని పేర్కొంది. బహ్రెయిన్‌పై 10 డ్రోన్లను, 3 క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇప్పటిదాకా బహ్రెయిన్‌పైకి 124 క్షిపణులు, 203 డ్రోన్లు దూసుకొచ్చాయి. ఇజ్రాయెల్‌కు డ్రోన్లను సరఫరా చేయడంద్వారా ఉక్రెయిన్ యుద్ధంలోకి దిగిందని భావిస్తున్నామని జాతీయ భద్రతపై ఇరాన్ పార్లమెంటరీ కమిటీ అధిపతి ఇబ్రహీం అజీజి స్పష్టం చేశారు. ఆ దేశం మొత్తం తమ క్షిపణులు, డ్రోన్ల పరిధిలో ఉందని హెచ్చరించారు. ఇరాన్ దాడుల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంలో అమెరికా వాయుసేనకు చెందిన 5 విమానాలు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా అధికారులు చెప్పినట్లుగా అంతర్జాతీయ వార్తా సంస్థ వాల్‌స్ట్రీట్ జనరల్ తెలిపింది.

**36,469 నివాసాలు ధ్వంసం**

అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా తమ దేశంలోని 36,469 నివాసాలు, 6,179 వాణిజ్య సముదాయాలు దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫతేమీ మొహజెరానీ తెలిపారు. యుద్ధం కారణంగా 223 మంది మహిళలు, పిల్లలు చనిపోయారని, 2,129 మంది గాయపడ్డారని వివరించారు. అయితే మొత్తం మృతులు, గాయపడ్డవారి సంఖ్యను ఆమె వెల్లడించలేదు. సైనికపరంగా జరిగిన నష్టాన్నీ తెలియజేయలేదు.

**2,500 మెరీన్ల రాక**

యుద్ధం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాకు 2,500 మంది మెరీన్లను, ఉభయచర యుద్ధ నౌక యూఎస్‌ఎస్ ట్రిపోలిని అమెరికా పంపింది. ఇప్పటికే అరేబియా సముద్రంలో 12 యుద్ధ నౌకలు, విమానవాహక యుద్ధ నౌక యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్, 8 డిస్ట్రాయర్లు ఉన్నాయి. ఇప్పుడు ట్రిపోలి వస్తే అమెరికా సైన్యానికి మరింత బలం చేకూరుతుంది.



**మధ్యవర్తిత్వానికి సిద్ధం: ఫ్రాన్స్**

లెబనాన్ అధ్యక్షుడు, ప్రధాని, పార్లమెంటు స్పీకర్లతో తాను మాట్లాడానని, ఇజ్రాయెల్‌తో చర్చల కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. లెబనాన్ యుద్ధంలో మరింతగా కూరుకుపోకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అనుచిత దాడులను హెజ్‌బొల్లా ఆపాలని, వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపేయాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్‌తో నేరుగా చర్చించడానికి లెబనాన్ నేతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. యుద్ధం ప్రారంభమయ్యాక 2 వారాలపాటు ఇరాన్ అంతటా అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. కానీ ఖర్గ్ ద్వీపాన్ని ముట్టుకోలేదు. యుద్ధం 3వ వారంలోకి ప్రవేశించిన వెంటనే అనూహ్యంగా ఖర్గ్‌పై అమెరికా దాడులు చేసింది. దీంతో కొంత ఆందోళన వ్యక్తమైంది. అయితే అక్కడి చమురు క్షేత్రాలను తాకలేదు. ఇరాన్‌కు ఆర్థికంగా వెన్నెముకగా ఖర్గ్ ఉంది. ఆ దేశం ఎగుమతి చేసే చమురులో 90శాతం ఇక్కడి నుంచే వెళ్తోంది. ప్రపంచానికి అవసరమైన చమురులో 4.5శాతం ఇరాన్ ఎగుమతి చేస్తోంది. ఇంత ఉద్రిక్తతల్లోనూ ఖర్గ్‌లో రెండు నౌకల్లో చమురును నింపుతున్నారు.

**హర్మూజ్‌కు పలు దేశాల యుద్ధ నౌకలు!**

హర్మూజ్‌లో కృత్రిమ అడ్డంకుల కారణంగా చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ ఇబ్బంది పడుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి త్వరలో ఈ దేశాలు తమ యుద్ధ నౌకలను పంపనున్నాయని వెల్లడించారు. యుద్ధ నౌకలను పంపాలని ఆయన బ్రిటన్ తదితర దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఈ జల సంధివద్ద బాంబు దాడులతో ఇప్పటికే ఇరాన్‌ను అడ్డుకుంటున్నామని తెలిపారు. ఈ వార్తలను ఇరాన్ విదేశాంగశాఖ మాజీ మంత్రి మనూఛెర్ మొతాకిల్ ఖండించారు. తమ భూభాగంలోకి చొరబాట్లు జరిగితే వారి భూభాగాల్లోకి వెళ్లి దాడులు చేస్తామని హెచ్చరించారు.

**ఇంకో ఐదేళ్లయినా యుద్ధానికి రెడీ: ఇరాన్**

అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ తేల్చి చెప్పారు.

## మా డ్రోన్ సాంకేతికతను అమెరికా అడిగింది

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



మాస్కో, కీవ్: డ్రోన్ రక్షణలో మాకు కీవ్ సాయం అవసరం లేదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. ఓ నిర్దిష్ట దేశం కోసం లేదా అమెరికన్లకు సాయం చేయాల్సిందిగా వాషింగ్టన్ తమను చాలాసార్లు సంప్రదించిందని స్పష్టంచేశారు. ఉక్రెయిన్ డ్రోన్ల సాంకేతికతను అందించేందుకు గతేడాది 35 బిలియన్ డాలర్ల విలువైన రక్షణ సహకార ఒప్పందాన్ని అమెరికాకు ప్రతిపాదించానని, ఇందుకు వాషింగ్టన్ సైనిక అధికారులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ట్రంప్ స్వయంగా ఈ ఒప్పందానికి అంగీకరించినట్లు తెలిపారు. ఈ ఒప్పందంపై ఇప్పటివరకు ఎందుకు సంతకాలు జరగలేదో తనకు తెలియదని, భవిష్యత్తులో ఒప్పందం కుదరొచ్చని వెల్లడించారు. మరోవైపు అమెరికా మధ్యవర్తిత్వంలో జరగబోయే త్రైపాక్షిక శాంతి చర్చల కోసం ఉక్రెయిన్ సిద్ధంగా ఉందన్నారు. అమెరికాలో ఈ చర్చలు జరగాలని వాషింగ్టన్ ప్రతిపాదించిందని, అక్కడకు తమ ప్రతినిధులను పంపడానికి రష్యా సుముఖంగా లేదని జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా నుంచి అంగీకారం వచ్చిన తర్వాత, అమెరికా స్పందన మేరకు చర్చలు జరుగుతాయన్నారు. మరోవైపు మాస్కోపైకి ఆదివారం ఉక్రెయిన్ ప్రయోగించిన 28 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. శనివారం జరిగిన ఇదే తరహా దాడిలో 47 డ్రోన్లను నేలరాల్చినట్లు తెలిపింది.

## తైవాన్ సమీపంలో చైనా యుద్ధ విమానాల స్వైరవిహారం

హాంకాంగ్: తైవాన్ గగనతలానికి సమీపంలో చైనా యుద్ధ విమానాల సంచారం పెరిగిందన్న వార్తలు సంచలనం సృష్టిస్తున్నాయి. గత రెండు వారాలుగా ఇలాంటి ఘటనలు లేనప్పటికీ హఠాత్తుగా మళ్లీ యుద్ధ విమానాలు వస్తుండటంతో రక్షణ నిపుణులు దీని వెనుక కారణాలను విశ్లేషిస్తున్నారు. శనివారం ఒక్కరోజే తమ ద్వీపం చుట్టూ 26 చైనా యుద్ధ విమానాలు గగన విహారం చేశాయని తైవాన్ రక్షణ మంత్రి వెలింగ్టన్ కూ తెలిపారు. ద్వీపం చుట్టుపక్కల ఏడు నౌకలనూ గుర్తించామని తెలిపారు. గత నెల 27 నుంచి మార్చి 5 వరకు చైనా ఇలాంటి దుందుడుకు చర్యలను హఠాత్తుగా తగ్గించింది.

## గాజాపై ఇజ్రాయెల్ దాడి 12 మంది మృతి

కైరో, రమల్లా: పాలస్తీనాలోని గాజా, వెస్ట్‌బ్యాంకులలో ఆదివారం జరిగిన దాడుల్లో 16 మంది మృతి చెందారు. గాజాలోని నుసేరత్‌లో ఉన్న పట్టణ శరణార్థ శిబిరంపై జరిగిన దాడిలో నలుగురు మరణించారు. ఇందులో గర్భిణి, ఆమె భర్త, వారి పదేళ్ల కుమారుడు ఉన్నారు. మరొకరు పొరుగున ఉండే 15 ఏళ్ల బాలుడు. సలా అల్-దిన్‌లో పోలీసు వాహనంపై దాడి జరిగింది. ఈ ఘటనలో 8 మంది పోలీసు అధికారులు మరణించారు. 14 మంది గాయపడ్డారు.

వెస్ట్‌బ్యాంక్‌లో ఒక కుటుంబం ప్రయాణిస్తున్న కారుపై కాల్పులు జరిపిన ఇజ్రాయెల్ సైన్యం, అందులోని నలుగురి ప్రాణాలు తీసింది. మృతుల్లో ఇద్దరు చిన్నారులున్నట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. రంజాన్ కోసం కొత్త దుస్తులు కొనుక్కొనేందుకు బయటకు వెళ్లగా శనివారం రాత్రి వారిపై కాల్పులు జరిపినట్లు పాలస్తీనా అధికారిక వార్తా సంస్థ తెలిపింది. ఒక జంటతోపాటు వారి ఇద్దరు పిల్లల తలలపై తుపాకీతో కాల్చారని, మరో ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయని రెడ్ క్రెసెంట్ సహాయక బృందం తెలిపింది. ఘటనా స్థలానికి చేరుకునే అంబులెన్సులను ఇజ్రాయెల్ సైన్యం ఆలస్యం చేసిందని ఈ బృందం ఆరోపించింది.

# మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి?



## కాంగ్రెస్‌కు గుడ్‌బై

**జగిత్యాల బ్యూరో మార్చి16 (జనం సాక్షి) :** జగిత్యాల జిల్లా రాజకీయాల్లో భారీ మార్పులకు దారితీసే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా కొనసాగిన మాజీ మంత్రి, సీనియర్ నేత టీ. జీవన్ రెడ్డి రాజకీయ ప్రయాణం కొత్త మలుపు తిరగబోతుందనే చర్చలు తీవ్రంగా సాగుతున్నాయి. వచ్చే మార్చి 25న బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు సమక్షంలో జీవన్ రెడ్డి గులాబీ కండువా కప్పుకునే అవకాశముందని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ వార్త ఒక్కటే జగిత్యాల రాజకీయాల్లో పెద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన పరిణామాలు, ముఖ్యంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పార్టీ మార్పు, కాంగ్రెస్‌లో ఏర్పడిన అంతర్గత విభేదాలు... ఇవన్నీ ఇప్పుడు జీవన్ రెడ్డి నిర్ణయానికి కారణాలుగా చర్చకు వస్తున్నాయి.

**సంజయ్ కుమార్ ఫిరాయింపుతో మొదలైన రాజకీయ ఉద్రిక్తత**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరడం స్థానిక రాజకీయాల్లో పెద్ద సంచలనంగా మారింది. ఈ పరిణామం కాంగ్రెస్‌లో అంతర్గత సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. జగిత్యాలలో ఇప్పటికే బలమైన స్థాయిలో ఉన్న మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి వర్గానికి ఇది పెద్ద దెబ్బగా మారింది. సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పార్టీ అధిష్టానం అతనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జీవన్ రెడ్డి వర్గంలో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. టిక్కెట్లు, స్థానిక సంస్థల పదవులు, పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత... అన్నింటిలోనూ సంజయ్ కుమార్ వర్గానికే ఆధిక్యం లభించిందనే భావన జీవన్ రెడ్డి అనుచరుల్లో బలంగా వ్యక్తమైంది. ఇది క్రమంగా రాజకీయ విభేదాలకు దారి తీసింది.

**మున్సిపల్ ఎన్నికలు... అసంతృప్తికి చివరి అంకం**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు ఈ అసంతృప్తిని మరింత బహిర్గతం చేశాయి. జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్‌లో టిక్కెట్ల కేటాయింపులో సంజయ్ కుమార్ వర్గానికి అత్యధిక ప్రాధాన్యత లభించింది. ఇదే కాకుండా చైర్‌పర్సన్ పదవి కూడా సంజయ్ కుమార్ వర్గానికి వెళ్లడం జీవన్ రెడ్డి వర్గంలో తీవ్ర ఆవేదనకు కారణమైంది. పార్టీకి నాలుగు దశాబ్దాలుగా సేవలు అందించిన నేతకు ఇలాంటి పరిస్థితి ఎదురవడం అనుచరులను కలచివేసింది.

ఈ పరిణామాల నేపథ్యంలో జీవన్ రెడ్డి పలుమార్లు పార్టీ హైకమాండ్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే సమస్యకు సరైన పరిష్కారం లభించకపోవడంతో ఆయన తన రాజకీయ భవిష్యత్‌పై పునరాలోచన ప్రారంభించినట్లు తెలుస్తోంది.

**బీఆర్ఎస్‌తో చర్చలు... గులాబీ కండువా సంకేతాలు**

రాజకీయ వర్గాల్లో వస్తున్న సమాచారం ప్రకారం జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ నాయకత్వంతో సంప్రదింపులు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఆయన చర్చలు జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశాలు తరువాత ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కూడా చర్చలు జరిగాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ చర్చల అనంతరం జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరికకు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. వచ్చే మార్చి 25న జగిత్యాల పట్టణంలోని బండారి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో భారీ సభ ఏర్పాటు చేసి, కేసీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి చేరిక జరగనున్నట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు.



గతంలో ఉన్న చెట్టు



# నాటుడు... నరుకుడు



నరికిన చెట్లు

## పాఠశాలలో మహా వృక్షాల నరికివేత కలకలం

### వాల్టా చట్టానికి తూట్లు.. విద్యార్థులే కూలీలు

**నల్లగొండ ప్రతినిధి, మార్చి 16 (జనంసాక్షి) :**

*ఒక వైపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుంటే నల్లగొండ జిల్లా కేంద్రంలో అది నూతనంగా ఏర్పడిన నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న బోయవడాలో ఉన్న ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కలకలం రేపే సంఘటన చోటు చేసుకుంది.అది ఏంటో మీరే చదవండి.*

**పాటశాలలో మహా వృక్షాల నరికివేత కలకలం.. :**

ఈ అర్బన్ రెసిడెన్షియల్ బాయ్స్ పాఠశాల లో ఎన్నో ఏండ్లుగా పాఠశాల అవరణం లో ఏపుగా పెరిగిన వేప చెట్ల ఉన్నాయి.పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్నట్లు అక్కడి వాతావరణం చాలా బాగుంటుంది.ఆదివారం నాడు సెలవు కావడం తో అక్కడ విధులు నిర్వహించే ప్రత్యేక అధికారిణి అంజలి చేసిన పని పర్యావరణానికి పెను ప్రమాధంగా మారింది.అక్కడి చెట్లను గుట్టు.చప్పుడు కాకుండా గుత్తా దారుకు అమ్మకానికి పెట్టింది.వాళ్ళు కొన్ని గంటల్లో భారీ వృక్షాలను నేల కరిపించారు. ప్రతి రోజు విద్యార్థులకు నీడను ఇచ్చే చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణం కలుషితం అయింది. విద్యార్థులకు పర్యావరణం కాపాడమని చెప్పే అధికారులు టీచర్లు ఇలాంటి దుస్సహాసలకు పాల్పడిన ఘటన సోమవారం జనం సాక్షి కి తెలిసింది.ఇదే విషయమే అక్కడికి వెళ్తే అక్కడ విషయాలు బట్టబయలుయ్యాయి.వృక్షో రక్షితో రక్షతః అనటం మాటల వరకే పరిమితం అయినట్లు తెలుస్తుంది.

**వాల్టా చట్టానికి తూట్లు :**

2002లో వాల్టా చట్టము చెట్లు నరికివేత జరిగితే రెవిన్యూ అధికారి అలాగే ఫారెస్ట్ అధికారుల అనుమతులతో షరతులతో కూడిన అనుమతులు ఉంటాయి కానీ ఇక్కడ ఎలాంటి అనుమతు లు లేకుండా ఈ తతంగం జరిగినట్లు తెలుస్తుంది.సోమవారం విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు చెట్ల నరికివేత పై వారిని ఫైన్ కట్టమని తెలిపారు అని తెలుస్తుంది.అది కూడా 50 వేలు ఫైన్ కట్టమని చెప్తే పాటశాల అధికారిణి మేము ముప్పై వేలు కడుతం ని సంది చేసుకొని కట్టినట్టు సమాచారం.మరి ఫైన్ సంగతి సరే చెట్లు నరికివేత చేసినందుకు వాల్టా యాక్టు ప్రకారం కేసులు చేస్తారా లేక మీకు ఇంత మాకు ఇంత అనే వాటాలు వేసుకొని పంచుకుంటారా అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.చెట్లు ను నరికివేయడానికి ముందు వాటిని వాటి అంతలా అవే చనిపోయేలా ఆసిడ్,బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు తెలుస్తుంది.


**చర్యలు ఉండేనా :**

ఇంత పెద్ద తప్పు చేసిన ఆ అధికారి మీద చర్యలకు సిద్ధం అవుతారా లేక వాళ్ళ కాసులు కక్కుర్తి పడిపోతారా..అనే ఆరోపణలు వస్తున్నాయి.ఇంత వరకు జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటన జరిగితే ఒక్క ఉన్నత అధికారి అటు వైపుగా కూడా చూడనే లేదు అంటే ఇక నల్లగొండ జిల్లా లోని గ్రామాల లో ఉన్న పాటశాలల పరిస్థితి ఏంటో అర్థం అవుతుంది.

**విద్యార్థులే కూలీలు..:**

జనం సాక్షి ప్రతినిధి అక్కడికి వెళ్లి జరిగింది తెలుసుకుంటే విస్తృతపోయే సంఘటన తెలిసింది.చెట్లు నరికివేత అయ్యేక కొమ్మలు పక్కకు వేయడానికి 8వ తరగతి చెందిన కొందరు విద్యార్థులు కొంత డబ్బులు మీకు ఇస్తాం అని వారితో పని చేపించుకున్నారు అని తెలిపారు.ఇంత దారుణమైన సంఘటన ఎక్కడో మారుమూల గ్రామం లో జరుగలేదు నల్లగొండ నడిబొడ్డున జరిగింది.మరి విద్యాశాఖ అధికారులు మరి ఈ సంఘటన మీద చర్యలు తీసుకుంటూరా లేక ఈ పాపం లో పాలు పంచుకుంటారా వేచి చూడాలి.

గతంలో ఉన్న చెట్లు



**చాలా చల్లగా ఉండే.. చెట్లు కొట్టారు :**


ఇంతకు ముందు చాలా చల్లగా ఉండేది చెట్ల నీడ తో ఇపుడు చెట్లు కొట్టివేయడంతో వంట చేసుకునే పరిస్థితి లేకుండా అయిపోయింది.తాగే మంచి నీళ్ళు కూడా ఎండకు వేడిగా ఉంటున్నాయి.చెట్లకు ఆసిడ్ పోసినట్లు కొందరు పిల్లలు అనుకుంటూ ఉంటే నేను విన్నాను.అలాగే నాతో పని చేసే ఇంకో అసిస్టెంట్ కూక్ కలెక్టర్ ఇంట్లో పని చేస్తోంది అని తెలిపింది.మొత్తనికి చెట్లు లేకపోవడం తో చాలా వేడిగా ఉంది. ఎండకు అన్నం కూర పాడు అయ్యే అవకాశం ఉంది. ఇదే విషయమై జనంసాక్షి ప్రతినిధి పాఠశాల ప్రత్యేక అధికారిణి అంజలిని వివరణ అడుగగా మాకు పర్మిషన్ తీసుకోవాలని తెలియక కొట్టివేసినట్లు తెలిపింది.ఇదే విషయమై పలుమార్లు జిల్లా ఫారెస్ట్ అధికారికి కాల్ చేసిన స్పందించలేదు.అలాగే జిల్లా విద్య శాఖ అధికారి కూడా స్పందించలేదు.



హెడ్ కుక్ మంజుల

# హత్యా? బలవన్మరణమా..?




## ఈ పాపం ఎవరిది..?

- చిన్నారి మృతికి కారకులెవరు..?
- ఆశ్రమంలో అసలేం జరిగింది..?
- గోప్యత వెనుక ఉన్న మర్మమేమిటి..?
- శ్వేత మరణం మిస్టరీ వీడేదిన్నడు..?

**ఖమ్మం, మార్చి 16 (జనంసాక్షి) :** వల్లభి బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చిన్నారి సి.హెచ్. శ్వేత తీవ్ర అనారోగ్యానికి గురై మృత్యువాత పడిన సంఘటన పాపం ఎవరిది? చిన్నారి మృతికి కారకులెవరు? అనే ప్రశ్నలు ఇప్పుడు సమాజంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆశ్రమంలో అసలేం జరిగింది? గోప్యత వెనుక ఉన్న మర్మమేమిటి? శ్వేత మరణం మిస్టరీ ఎప్పుడు వీడేది? అని విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ఈ మరణం సాధారణ అనారోగ్య మరణం కాదని, గిరిజన అభివృద్ధి శాఖలోని వ్యవస్థీకృత లోపాల వల్ల జరిగిన హత్య అని వారు ఆరోపిస్తున్నారు.

ఈ నెల 9వ తేదీన శ్వేత తన అమ్మమ్మతో కలిసి వసతి నుంచి ఇంటికి వెళ్లింది. ఫంక్షన్‌కు వెళ్లేందుకు సెలవు కోరుతూ లేఖ రాసినట్లు చెప్పినా, ఆశ్రమ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఎందుకు అనుమతి ఇచ్చారో అంతు చిక్కడం లేదు. సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్లాలని వచ్చినా చదువు ప్రయోజనాలు వివరించి నచ్చజెప్పే ఆశ్రమాలు ఇక్కడ మాత్రం చిన్నారి ఆరోగ్యం సరిగా లేదని తల్లికి ఫోన్ చేసి పిలిపించి, సెలవు పత్రంలో మాత్రం 'ఫంక్షన్' అని రాయించడం వెనుక మర్మం ఏమిటో వారికే తెలియాలి. అమ్మమ్మ ఇంగ్లీషులో సంతకం చేయడం కూడా అనుమానాలను మరింత తీవ్రతరం చేస్తోంది. ఇది పాఠశాలలో జరిగిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి చేసిన అనాలోచిత చర్య అని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆశ్రమంలో కొంతమంది టీచింగ్ స్టాఫ్, వర్కర్లు చిన్నారిని వేధించి, ఒక గదిలో బంధించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో మనస్థాపానికి గురైన శ్వేత అధిక మోతాదు టాబ్లెట్లు వేసుకుని అనారోగ్యానికి గురైందని, భయపడిన సిబ్బంది తల్లికి ఫోన్ చేసి తీసుకెళ్లాలని చెప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆశ్రమంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, కోడిగుడ్లు కూడా విద్యార్థులకు అందడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. గిరిజన అభివృద్ధి శాఖలో ఎక్కడా పేరు నమోదు కాని వ్యక్తి పనిచేయడం, ఏటీడీవో నెలకు రెండుసార్లు మాత్రమే పర్యటనకు వెళ్లడం, కార్యాలయంలో కూడా అందుబాటులో లేకపోవడం వంటి లోపాలు బయటపడుతున్నాయి.

చిన్నారి మృతికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగించాలని విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నష్టపరిహారం మాత్రమే పరిష్కారం కాదని, ఏటీడీవో, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓకు విజ్ఞప్తి చేశాయి. ఇప్పటికే పీడిఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి మస్తాన్ ఏటీడీవోను విధుల నుంచి తప్పించాలని పలుమార్లు ఫిర్యాదు చేశాడు. భవిష్యత్తులో ఇలాంటి హృదయవిదారక సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ముస్లిం సోదరులకు సర్కార్ ఇఫ్తార్ విందు

## ఎమ్మెల్యే కాలే యాదయ్య రంజాన్ కిట్లను పంపిణీ




**చేవెళ్ల, మార్చి 16 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ ప్రార్థనల్లో పాల్గొని వారికి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ కిట్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగిరెడ్డి, పైండ్ల మధుసుధన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గోనే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, మాజీ సర్పంచ్లు వి. ప్రభాకర్, మధుసూదన్ గుప్తా, చేవెళ్ల జామా మాజీద్ కమిటీ సభ్యులు ఆక్బర్, హాజీ, ఆమ్మద్, రహ్మాన్, ఖాజా, మషియోద్దిన్, లియాకత్, పైమీద్, యూసుబ్, ఖాజాపాషా ఉన్నారు.

# రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనది

## ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఇఫ్తార్ విందు

**తాండూరు మార్చి 16(జనంసాక్షి) :** రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సంధర్బంగా ముస్లిం సోదరులకు సోమవారం పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి, విందులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింపచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని, పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష ఆచరించడం ద్వారా పేదవాడి ఆకలి బాధ ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరికీ తెలుస్తుందన్నారు.మనకున్న దానిలో కొంత పేదలకు దానం చేయడం ద్వారా అల్లా ఆశీస్సులు లభిస్తాయన్నారు.ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల వల్ల కనీస అవసరాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు యుద్ధాలు ఆగిపోయి ప్రపంచవ్యాప్తంగా శాంతి సమాధానాలు విలసిల్లాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ పవిత్ర రంజాన్ మాసంలో అల్లా ను ప్రార్థించుదామన్నారు..ఈ ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# నేడు రైల్వే భూ నిర్వాసితులతో అధికారుల సమావేశం

## 107 ఎకరాలకు సంబంధించిన రైతులతో చర్చలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** రైల్వే లైన్ భూసేకరణలో భాగంగా 107 ఎకరాల భూ సేకరణకు సంబంధించి భూ నిర్వాసితులతో అధికారులు నేడు సమావేశం ఏర్పాటు చేశారు.ఇప్పటికే పలుమార్లు నిర్వాసితులతో సమావేశమైన అధికారులు భూసేకరణ కొలిక్కి తీసుకొచ్చేందుకు చర్చలు జరపనున్నారు.రైల్వే లైన్ లో భాగంగా మండలంలో మొత్తం 859 ఎకరాలు భూమి సేకరించాల్సి ఉంది. ఇప్పటికే 732 ఎకరాలను రైతుల నుంచి భూసేకరణ చేసి పరిహారం చెల్లింపులు పూర్తి చేశారు. మిగిలిన 107 ఎకరాలకు సంబంధించి గత రెండేళ్లుగా భూసేకరణ పెండింగ్లో ఉండిపోయింది. రైల్వే లైన్ భూసేకరణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత తీసుకోనీ పరిహారం చెల్లింపులు పూర్తిచేయాలని భావిస్తుంది.ఈ క్రమంలో అనుపురంలో 15.02 ఎకరాలు, నాంపల్లిలో15.27 ఎకరాలు, వేములవాడలో 47 ఎకరాలు, శాత్రాజుపల్లిలో 29 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ మేరకు నాంపల్లి, వేములవాడ, శాత్రాజుపల్లిలో రైతులతో అధికారులు సమావేశం కానున్నారు.భూసేకరణ పూర్తయితే త్వరలోనే వేములవాడ ప్రజలకు రైలు మార్గం అందుబాటులోకి రానుంది.

# సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించాలి

## - ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్ వర్ధన్

**గోదావరిఖని, జనంసాక్షి :** సీఎం రేవంత్ రెడ్డి సింగరేణిలో మెడికల్ బోర్డును నిర్వహించాలని ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తుంగపిండి ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు.కార్మికుల సంక్షేమం కొరకు వెంటనే మెడికల్ బోర్డు చేపట్టాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని, తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొద్ది నెలల క్రితం మున్సిపల్ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి ప్రాంతంలోని భూపాల పెల్లి బహిరంగ సభలో మెడికల్ బోర్డు పై కొన్ని కార్మిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదని పేర్కొన్న విషయం విధితమే అని ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు. ఆరోపణలలో వాస్తవము లేదని, త్వరలోనే సింగరేణిలో కార్మికుల సంక్షేమం కొరకు మెడికల్ బోర్డు నిర్వహిస్తామని సీఎం ప్రకటించి ఇప్పటివరకు మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు సీఎంపై అసహనం వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు భయాందోళనలకు గురి కావడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గత రెండేళ్ల నుండి సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు రావేమో అని అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. గత రెండేళ్ల నుండి సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల కార్మికుల పిల్లల వయసు పెరిగి ఉద్యోగాలు ఉద్యోగాలకు అనర్హులుగా ఎక్కడ గురి అవుతారు అని కార్మిక కుటుంబాలు అయోమయంలో పడే పరిస్థితి ఉందన్నారు. కోల్ బెల్ట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రివర్యులు, ఐ ఎన్ టి సి ముఖ్య నాయకులు, తదితరులు సీఎంను కలిసి తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు. సింగరేణిలో రాష్ట్ర ముఖ్యమంత్రి మెడికల్ బోర్డును నిర్వహించినట్లయితే కార్మిక కుటుంబాలలో ఆనందోత్సవాలు వెలువబడుతాయని అలాగే సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేయడానికి కార్మిక కుటుంబాలు సిద్ధంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు.

# హోమో సెక్స్ కోసం పిలిచి దాడి

- డబ్బులు, సెల్ ఫోన్ లాక్కున్న ప్రబుద్ధులు
- అరెస్ట్ చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు



**కరీంనగర్ క్రైమ్, మార్చి 16 ( జనం సాక్షి) :** హోమో సెక్స్ అంటూ పిలిచి దాడికి పాల్పడ్డ ఇద్దరి వ్యక్తులను సోమవారం కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 14 న కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా, కౌటాల మండలం, గురుడుపేట గ్రామానికి చెందిన రమిల్లా కృష్ణమూర్తి కొన్ని రోజుల క్రితం 'గ్రైండర్' డేటింగ్ అప్ ద్వారా ట్రాన్స్‌జెండర్ తో పరిచయం ఏర్పడి హోమో సెక్సువల్ అలవాటు కలిగి ఉన్నట్టు మెసేజ్ చేయడంతో జుమైర్ అనే వ్యక్తి తనతో హోమోసెక్స్, మసాజ్ చేయాలని చెప్పి దానికి డబ్బులు ఇస్తానని చెప్పడంతో కృష్ణమూర్తి అంగీకరించి బెల్లంపల్లి వద్ద ట్రైన్ ఎక్కి కరీంనగర్ తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ చేరుకొని జుమైర్ అనే వ్యక్తి తన బైక్ పై కృష్ణమూర్తిని బొమ్మకల్ బైపాస్ లోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ వెనకాలకు తీసుకెళ్లి హోమో సెక్స్ చేయాలని బట్టలు విపించగా అంతలోనే మరో ఇద్దరు వ్యక్తులు అక్కడికి చేరుకొని ఈ పని చేసి ఎంత డబ్బు సంపాదించావు? అని ప్రశ్నిస్తూ తన దగ్గర ఉన్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇవ్వకపోతే అక్కడికక్కడే చంపేస్తామని బెదిరించగా.. దాంతో భయపడి కృష్ణ మూర్తి తన దగ్గర ఉన్న రూ.1,500/- నగదు ,తన సెల్ ఇచ్చేశాడు అని ఏసీపీ విజయ్ కుమార్ తెలిపారు. బాధితుడు కృష్ణ మూర్తి ఫిర్యాదుతో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాలమేరకు సీఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టే క్రమంలో సోమవారం తీగలగుట్టపల్లి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఒక్కరు మైనరు కాగా ఏ1గా రేకుర్తికి చెందిన సయ్యద్ అబ్బాస్ అలియాస్ అర్బస్, ఏ2గా కిసాన్ నగర్‌కు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్‌గా పోలీసులు గుర్తించారు. నేరానికి ఉపయోగించిన ఫోన్స్,ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు పోలీసులు. ఈ సందర్భంగా త్వరితగతిన కేసు ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో సీపీ గౌస్ ఆలం సీఐ నిరంజన్ రెడ్డి ని,ఎస్ఐలు నరేష్,లక్ష్మా రెడ్డిని అభినందించారు.

**పేరు మార్పు ప్రకటన**

నేను, **అల్లేల రాజేశ్వర్‌రెడ్డి, తండ్రి అల్లేల లింగారెడ్డి** సుమారు 60 సంవత్సరాల వయస్సు గలవాడిని, నివాసం: ఇంటి నం. 5-21, వెల్మవాడ, వేనుగుమట్ల గ్రామం, గొల్లపల్లి మండలం, జగిత్యాల జిల్లా-505 532, తెలంగాణ రాష్ట్రం; ఇకపై నా పేరు **'అల్లాల రాజేశ్వర్‌రెడ్డి'**, అల్లాల లింగారెడ్డి కుమారుడిగా పిలువబడతాను.

**- అల్లేల రాజేశ్వర్ రెడ్డి**

**పేరు మార్పు ప్రకటన**

నేను, **అల్లేల పద్మజ, W/O అల్లేల రాజేశ్వర్ రెడ్డి,** సుమారు 54 సంవత్సరాల వయస్సు గలదానిని, నివాసం: ఇంటి నం. 5-21, వెల్మవాడ, వేనుగుమట్ల గ్రామం, గొల్లపల్లి మండలం, జగిత్యాల జిల్లా - 505 532, తెలంగాణ రాష్ట్రం; ఇకపై నా పేరు **అల్లాల పద్మజ అని, W/O అల్లాల రాజేశ్వర్‌రెడ్డి**గా మాత్రమే పిలువబడతాను, పరిగణించబడతాను.

**- అల్లేల పద్మజ**

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 మార్చి 2026

# ఉప్పల్‌లో ఏఆర్ కానిస్టేబుల్ దారుణ హత్య



హైదరాబాద్, మార్చి 16 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన దారుణ హత్య కేసును పోలీసులు కేవలం ఎనిమిది గంటల్లోనే క్లోజ్ చేశారు. చిలకనగర్‌లో సాయిబాబా ఆలయం సమీపంలో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుధీర్ రెడ్డి (39)పై కత్తితో దాడి జరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీకి చెందిన సుధీర్ రెడ్డి గత ఏడేళ్లుగా తన స్నేహితుడు బనోతు సంతోష్ నాయక్‌తో స్నేహంగా ఉన్నాడు. ఇటీవల వ్యక్తిగత విభేదాలు తలెత్తడంతో ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. మార్చి 15 సాయంత్రం సంతోష్ నాయక్ తన మరో స్నేహితుడు పాడిశెట్టి తరుణ్‌తో కలిసి సుధీర్‌ను చిలకనగర్ గ్రౌండ్ వద్దకు పిలిచాడు. సుధీర్ కూడా తన స్నేహితుడు ఇమ్రాన్ ఖాన్‌తో కలిసి అక్కడికి చేరుకున్నాడు. అక్కడ మాటామాటలు పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో సంతోష్ నాయక్ తన వద్ద ఉన్న కత్తితో సుధీర్‌పై ఒక్కసారిగా దాడి చేశాడు. భయంతో పరుగెత్తిన సుధీర్‌ను సంతోష్ వెంబడించి కడుపు, మెడ భాగాల్లో పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో సుధీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అనంతరం పరారయ్యారు.

సమాచారం అందుకున్న వెంటనే ఉప్పల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. డీసీపీ సురేష్ కుమార్ పర్యవేక్షణలో ఉప్పల్ పోలీసులు, ఎస్ఓటీ బృందాలు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టి కేవలం ఎనిమిది గంటల్లోనే ప్రధాన నిందితుడు బనోతు సంతోష్ నాయక్‌తో పాటు అతనికి సహకరించిన పాడిశెట్టి తరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక యాక్టివా ద్విచక్ర వాహనం, ఘటన సమయంలో ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన ఉప్పల్ పోలీసులను డీసీపీ సురేష్ కుమార్ అభినందించి, ఎస్ఓటీ బృంద సభ్యులకు నగదు పారితోషికం అందజేశారు. ఈ ఘటనతో చిలకనగర్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 6 గ్యారంటీలు 420 హామీలు వెంటనే అమలు చేయాలి

- మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను విప్ వెంటనే అమలు చేయాలి



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 16 (జనంసాక్షి) : ఆరు గ్యారెంటీలు 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బిజెపి నాయకులు విమర్శించారు. రెండున్నర సంవత్సరాలు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని వేములవాడ అర్బన్ మండలంలోని భాజపా మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో వేములవాడలో నిరసన వ్యక్తం చేసి ఎమ్మార్వో కు వినతి పత్రం అందచేశారు. అనంతరం అయన మాట్లాడుతూ భాజపా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశామన్నారు. పిసిసి అధ్యక్షుని హోదాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుద్రారం వద్ద రాత్రి బస చేసి నిర్వాసితుల సమస్యలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే రూ 5 లక్షల నాలుగు వేలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని నేటికి హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మానేరు నిర్వాసితులకు ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ళను మిడ్ మానేరు నిర్వాసితులకు వర్తింపజేసి ఇల్లు ఇచ్చినట్టు చెప్పడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో రూ.5.04 లక్షలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేసి నిర్వాసితులు అందరికీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అనేక మంది నిర్వాసితులకు పట్టా ప్యాకేజీ, పరిహారం,యువతీ యువకులకు పరిహారం అందలేదన్నారు.గత ప్రభుత్వం రూ 5.04 వేలు ఇస్తానని మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వాసితులను ఆదుకోలేదన్నారు.మిడ్ మానేరు నిర్వాసితులకు ప్రభుత్వ విప్ ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి నిర్వాసితుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కారం చేసే విధంగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంలో తులం బంగారం ఇస్తామని ఇవ్వడం లేదన్నారు పెన్షన్లు పెంచుతామని, మహిళలకు 2500 ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. రైతు భరోసా పెంచలేదన్నారు.ప్రజలను నమ్మించి మోసం చేసి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ నాయకులను గ్రామాల్లో తిరుగనియ్యమని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు గతంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టినగతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు లింగంపల్లి శంకర్, జింక అనిల్, రేగుల పరశురాములు, వెంకటేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాన్ని టాప్‌లో నిలబెట్టండి

- అత్యుత్తమ విద్యా బోధనకు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా
- విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు
- మోడరన్ కిచెన్, తాగునీరు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి
- కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం



కరీంనగర్ బ్యూరో, మార్చి 16 (జనంసాక్షి) : తిమ్మాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలను అత్యుత్తమ విద్యా బోధనకు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. గురుకులాన్ని టాప్‌లో నిలబెట్టేందుకు మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? మెనూ ప్రకారం టిఫిన్, లంచ్ అందిస్తున్నారా? విద్యాబోధన ఎలా ఉంది? వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నాయి? అని వివరంగా అడిగి తెలుసుకున్నారు. అన్నీ బాగున్నాయని విద్యార్థులు సమాధానం ఇవ్వడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం స్టాఫ్ రూమ్, వాష్‌రూమ్‌లు, వంటగది, స్టోర్ రూమ్, డార్మిటరీ గదులను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో బియ్యం, పప్పులు, ఇతర సామగ్రిని పర్యవేక్షించారు. సామగ్రికి సంబంధించిన ఎక్స్‌పైరీ డేట్‌ను తరచూ చూడాలని అధికారులకు సూచించారు. గురుకులంలో చేపట్టిన మోడరన్ కిచెన్ ఆధునీకరణ పనులను కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వసతుల కల్పన, మెనూ ప్రకారం భోజనం అందించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు ప్రత్యక్ష పర్యవేక్షణ జరపాలని సూచించారు. గురుకులంలో పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని, శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.గురుకులంలో కోతుల బెడద ఉందని ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, దీనికి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. గురుకులం అభివృద్ధి, విద్యా బోధన, ఇతర అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, గురుకుల ప్రిన్సిపాల్ సరిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## డ్రగ్స్ రహిత తాండూరు
# మనందరి బాధ్యత

- చేడువ్యసనాలకు పాల్పడితే జీవితాలు అదోగతి
- మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి

తాండూరు మార్చి 16(జనంసాక్షి)డ్రగ్స్ రహిత పట్టణం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు.99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా తాండూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనలో (యాంటీ డ్రగ్స్) భాగంగా శివాజీ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు 2కే రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును, కుటుంబాల ఆనందాన్ని, సమాజ భద్రతను దెబ్బతీస్తుందని,అందుకే "డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత తాండూర్ లక్ష్యం ప్రతి పౌరుడి కర్తవ్యంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు .యువతకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోలని, ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడిపి వారి సమస్యలు తెలుసుకోవాలని అన్నారు.మొయినాబాద్ పామవుజులో జరిగిన సంఘటన చాల భాదకరమని,మన తాండూర్ ప్రజలందరూ తల దించుకొనే విధంగా ఉందనివిమర్శించారు.తాండూర్ ప్రజలందూ ఎవరి వెంబడి ఉన్నారు, ఎవరితో ఉండాలి అనేది నిర్ణయించుకోవల్సిన అవసరం ఉందని తెలిపారు.2కే రన్ లో తాండూర్ మర్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ సిబ్బంది,పలు వార్డుల కౌన్సిలర్స్,పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు,ప్రముఖులు, యువత పాల్గొన్నారు.



## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పక్కాగా అమలు చేయాలి

- లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి); రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల అధికారుల తో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా అధికారి తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పథకాలు అమలు చేయాలని, లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మహిళా సంఘాల భవనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. తమ పరిధిలోని అన్ని అంశాలపై యాక్షన్ ప్లాన్ అమలు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.ఇట్టి సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# అదాని కోసమే ట్రంప్ భజన చేస్తున్న మోడీ

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ



అబ్దుల్లాపూర్ మెట్ మార్చి 16 (జనంసాక్షి) : అమెరికలో అదాని గ్రూప్స్ పైన నమోదు చేసిన కేసులో నుండి పెట్టుబడి దారుడు అదాని ని కాపాడటం కోసమే దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా భజన చేస్తు ట్రంప్ ముందు మోకారిల్లడని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారీ అన్నారు.ఇరాన్ పైన అమెరికా మరియు ఇజ్రాయిల్ చేస్తున్న ఏక పక్ష యుద్ధానికి నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన సోమవారం నాడు మెట్టు మండల తహసీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి లు హాజరు అయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ గత కొంత కాలంగా ఇరాన్ మరియు అమెరికా,ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా మన దేశంలో గ్యాస్ ధరలు అధికంగా పెరిగాయి. వంట గ్యాస్ సిలిండర్ పైన 60రూ"లు,కమర్షియల్ సిలిండర్ పైన 100 కి పైగా పెంచి సామాన్య జనాలపైన ఆర్థిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. భారత దేశ మిత్ర దేశం అయిన ఇరాన్ పైన దాడి చేసి ఆ దేశాధినేత ఖమేని ని క్రూరంగా హత్య చేసిన ఇజ్రాయిల్ , అమెరికా నియంత పోకడాలను ఖండించకుండా మోడీ ఇప్పటికి కూడా అమెరికా అధ్యక్షులు ట్రంప్ భజనే చేస్తున్నారని మండిపడ్డారు.ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని కొంత మంది దళారీలు డబ్బు రబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.యుద్ధం పైన ఖమేని హత్య పైన కనీసం స్పందించిన అసమర్థత ప్రధాని ఈ నరేంద్ర మోడీ అని అన్నారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో కనీసం ఏ ఒక్క అర్ స్ స్ కార్యకర్త కూడా పాల్గొనలేదని మండిపడ్డారు.బీజేపీ అధికారంలో వచ్చాకే హిందుల పైన ఆదివాసుల పైన దళితుల పైన దాడులు పెరిగాయాని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే ఇరాన్ పైన అమెరికా,ఇజ్రాయిల్ చేస్తున్న దాడి వెంటనే అపివేసి శాంతిని నెలకొలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ సిపిఐ నాయకులు అరుణ,నవనీత, రవి,డౌల రాములు, ఈశ్వర్, యదగిరి,మదు,సైదలు ముదిరాజ్,భైరగోని రాజు గౌడ్,గణేష్,రమేష్,రవి,రమేష్ నాయక్, గోపి,దేవమ్మ,క్రాంతి,లక్ష్మి వీరేష్, సుధాకర్, రాములు,అడవయ్య, శ్రీను,పాండు,రేణుక, కావేరి,నీలా, అనుష,మరియు తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి

మంథని: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా మంథని మున్సిపల్ చైర్ పర్సన్ ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యములో సోమవారం మంథని మున్సిపల్ పరిధిలోని లైన్ గడ్డ, బొక్కల వాగు కట్ట పై ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమములో ముండ్ల పొదలు తొలగించి మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను బయట పడి వేయకుండా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మా సానిటేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు స్రవంతి మద్దికట్ల పాల్గొన్నారు.

# విధేయతకు పట్టం

## హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా డా. కవితారెడ్డి నియామకం

- ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తా: డా. కవితా రెడ్డి
- సామాజిక సేవలకు గుర్తింపు.. కాంగ్రెస్ నాయకత్వం అభినందనలు



నిజామాబాద్ బ్యూరో, మార్చి 16 (జనంసాక్షి) : సామాజిక సేవల్లో చురుకుగా నిలిచి ప్రజల మన్ననలు పొందుతున్న ప్రముఖ వైద్యురాలు డా. కవితా రెడ్డికి రాష్ట్ర స్థాయి బాధ్యత దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ కార్యాలయంలో జరిగిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అతిథులుగా హాజరయ్యారు. ఇప్పటికే నిజామాబాద్ జిల్లా సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా సేవలందిస్తున్న డా. కవితా రెడ్డి, కవితా రెడ్డి ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు, యువతను ప్రోత్సహించే ఫుట్‌బాల్ టోర్నీలు నిర్వహిస్తూ సామాజిక సేవల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆమెకు పీసీసీ చీఫ్ బొమ్మా మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో సత్సంబంధాలు ఉన్నాయి.

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ పదవికి పోటీ చేయాల్సి ఉండగా అనూహ్య పరిణామాల మధ్య ఆమె పోటీకి దూరంగా నిలిచారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం ఆమె సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించింది. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న కారణంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు.

పదవీ బాధ్యతలు స్వీకరించిన డా. కవితా రెడ్డి మాట్లాడుతూ తనను గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతానని ధీమా వ్యక్తం చేశారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌ను మరింత అభివృద్ధి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు ఆకుల లలిత, ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమి చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్, సహకార యూనియన్ చైర్మెన్ మోహన్ రెడ్డి, మాజీ మేయర్ దర్మపురి సంజయ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, రామర్తి గోపి, భక్తవత్సలం, కాకతీయ సంస్థల చైర్మెన్ రజనీకాంత్, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పాల్గుణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బొబ్బిలి నర్సయ్య తదితరులు డా. కవితా రెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె నియామకంపై అనుచరులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మున్సిపాలిటీలో కొత్త ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్ ప్రారంభం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో అదనంగా రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు,వాటర్ ట్యాంకర్ ట్రాలీని మున్సిపల్ కమిషనర్, పాలకవర్గము ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందన్నారు. సుమారు రూ 21.50 లక్షలతో వీటిని కొనుగోలు చేసినట్లు చైర్మన్ తెలిపారు.వేములవాడ మున్సిపాలిటీకి ఇప్పటి వరకు 6 ట్రాక్టర్లు ఉండగా,చెత్త సేకరణ కు మరిన్ని వాహనాలు అవసరమని గుర్తించి వీటిని కొనుగోలు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన 2027 పకడ్బందీగా నిర్వహిస్తాం

- దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మూలం: కలెక్టర్ దీపక్ తివారి
- మొదటి దశ మే 11 నుంచి జూన్ 9 వరకు
- డిజిటల్ విధానంలో తొలిసారి జనాభా గణన
- సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు ప్రత్యేక పోర్టల్



వికారాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 16 (జనంసాక్షి) : జనగణన 2027 దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు మూలస్తంభమని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జనగణన-2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు (ఛార్జ్ అధికారులు) మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ద్వారా పూర్తి అవగాహన కల్పిస్తున్నామని, జిల్లాస్థాయిలో అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. జనగణన రెండు దశల్లో నిర్వహించబడుతుందని వివరించారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్ ఢ హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన జరుగుతుందని, తెలంగాణలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. రెండవ దశలో జనాభా గణన (పాపులేషన్ ఎన్యూమరేషన్) ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతు ందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని వివరించారు.

ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నామని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌ల ద్వారా గణన ప్రక్రియ సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యూమరేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని, గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ప్రత్యేక పోర్టల్ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.

మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా, పక్కా), ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి అంశాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు తదితర గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారని శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలు, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా విభజించి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలో అధికారులకు శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణనను విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ప్లానింగ్ శాఖ జనాభా లెక్కల అధికారులు శ్రీకాంత్ నాయక్, వంగ పండు గీత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హౌస్‌లిస్టింగ్, ఎన్యూమరేషన్ విధానాలపై అవగాహన కల్పించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్ఓ మాంగీ లాల్, తాండూర్ డీఆర్ఓ అనిత, ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# 25 నుండి హైదరాబాదులో అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

## డీజీపీ బి శివధర్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మార్చి 16 (జనంసాక్షి) :** హైదరాబాద్ వేదికగా ప్రతిష్ఠాత్మకమైన 74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వైభవంగా జరగనున్న ఈ క్రీడా సంబరానికి తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు డిజిపి తెలిపారు. ఈ టోర్నీలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మరియు కేంద్ర సాయుధ బలగాల నుంచి క్రీడాకారులు తరలివస్తున్నారని పేర్కొన్నారు. ఈ మెగా టోర్నీ కోసం నగరంలోని ఆరు ప్రధాన మైదానాలను సిద్ధం చేశామని, ఇందులో గచ్చిబౌలిలోని జి.ఎం.సి బాలయోగి స్టేడియం, అజీజ్ నగర్‌లోని హెచ్.ఎఫ్.సి గొగ్గీస్ స్పోర్ట్స్ ఎరీనా, మొయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ గ్రౌండ్, శివరాంపల్లిలోని జాతీయ పోలీస్ అకాడమీ మైదానం, గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్ గ్రౌండ్ మరియు తెలంగాణ పోలీస్ అకాడమీ మైదానాలు ఉన్నాయని వివరించారు. గచ్చిబౌలి మరియు హెచ్.ఎఫ్.సి మైదానాల్లో రాత్రి సమయాల్లోనూ మ్యాచ్‌లు నిర్వహించేందుకు వీలుగా ఫ్లడ్ లైట్ల సౌకర్యం ఉందని ఆయన తెలిపారు. మార్చి 24న టీమ్ మేనేజర్ల సమావేశం మరియు డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించి, 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభ వేడుకలను నిర్వహిస్తామని, తొలి మ్యాచ్ లో తెలంగాణ పోలీస్ జట్టు ఆడుతుందని వెల్లడించారు. పోటీల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఒక ఐపిఎస్ అధికారితో పాటు 13 మంది డీఎస్పీ/అసిస్టెంట్ కమాండెంట్ స్థాయి అధికారులు, 23 మంది ఇన్‌స్పెక్టర్లు మరియు 35 మంది టీమ్ మేనేజర్లు పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 5న ముగింపు వేడుకలతో ఈ క్రీడా సంబరం ముగుస్తుందని వివరించారు.

ఈ ఛాంపియన్‌షిప్ లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు పురుషుల విభాగంలో 37 జట్లు, మహిళల విభాగంలో 9 జట్లు ముందుకు వచ్చాయని డిజిపి తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈరోజే చివరి తేదీ కావడంతో, మొత్తంగా 46 జట్లు ఈ ఫుట్‌బాల్ సమరంలో తలపడనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో ప్రదర్శించనున్న ప్రత్యేక లోగోలను డిజిపి ఖరారు చేశారు. ఈ సమావేశంలో ఆర్.బి.వి.ఆర్.ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, గ్రేహౌండ్స్ అదనపు డిజిపి అనిల్ కుమార్, టీజీఎస్పీ అదనపు డిజిపి సంజయ్ కుమార్ జైన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐ జి పిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, హైదరాబాద్ అదనపు సి పి తఫ్సిర్ ఇక్బాల్, జాయింట్ సిపి శ్వేతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకతతో మహిళా సంఘాలకు బ్యాంకుల రుణాలు

## అవినీతి, అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు
## స్త్రీనిధి కార్యకలాపాలపై మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, మార్చి 16 (జనంసాక్షి) :** మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్య వేదికగా నిలిచిన స్త్రీనిధి సంస్థ కార్యకలాపాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణ సదుపాయాలు, వాటి పంపిణీ, తిరిగి చెల్లింపుల పరిస్థితి, సంస్థ పురోగతి తదితర అంశాలపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు సమీక్షలో వివరించిన ప్రకారం, గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో స్త్రీనిధి ద్వారా రూ.1947 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటికే రూ.2064 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందజేశారు. తక్కువ సిబ్బంది ఉన్నప్పటికీ రుణ ప్రణాళికలో దాదాపు 90 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. గత సంవత్సరం 78 శాతం రికవరీ సాధించగా, ప్రస్తుత సంవత్సరం 72 శాతం రికవరీ నమోదైందని, సెర్ప్ మరియు మెప్మా సిబ్బంది సమన్వయంతో 85 శాతం రికవరీ లక్ష్యంతో క్షేత్రస్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

స్త్రీనిధి స్థాపన నుంచి ఇప్పటివరకు పారదర్శకంగా పనిచేస్తున్నందున అనేక బ్యాంకులు సంస్థకు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయని అధికారులు తెలిపారు. గతంలో అవకతవకలకు పాల్పడిన 16 మంది సిబ్బందిని తొలగించినట్లు వెల్లడించారు. సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం 163 మంది సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కూడా వివరించారు. అలాగే సెర్ప్ మరియు మెప్మా సిబ్బందికి ప్రగతి ఆధారిత ప్రోత్సాహకాలు (పర్ఫార్మెన్స్ బేస్డ్ ఇన్సెంటివ్) ఇవ్వాలని పాలకవర్గం నిర్ణయించినట్లు తెలిపారు. ఇటీవల కొన్ని పత్రికల్లో స్త్రీనిధి కార్యకలాపాలపై వచ్చిన కథనాలపై మంత్రి సీతక్క ప్రత్యేకంగా చర్చించి, వాటిలో ప్రస్తావించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. స్త్రీనిధి నిధులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు ఎక్కడైనా నిర్ధారణ అయితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. స్త్రీనిధి సంస్థ పేద మహిళలకు ఆర్థిక అండగా నిలుస్తూ వేలాది కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ఇందిర మహిళా శక్తి వంటి కార్యక్రమాల ద్వారా మహిళలను ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తున్నదని ఆమె అన్నారు. స్త్రీనిధి కార్యకలాపాలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగాలని అధికారులకు మంత్రి సూచించారు. జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో సంస్థపై తప్పుడు ప్రచారాలు జరిగితే వాటిని తక్షణమే ఖండిస్తూ సరైన సమాచారం ప్రజలకు అందించాలని ఆదేశించారు. గ్రామ మరియు పట్టణ స్థాయిలో రుణాలు, రికవరీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మారుమూల పల్లెల్లో తాగునీటి సదుపాయం ఓ సవాల్

## రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో మిషన్ భగీరథ (జల్ జీవన్ మిషన్) అమలును కేంద్ర ప్రభుత్వం మెచ్చుకుందా? ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల వంటి గిరిజన, మారుమూల ప్రాంతాలలో తాగునీటి సదుపాయం ఒక సవాలుగా మారిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. తెలంగాణలో "జల్ జీవన్ మిషన్" పనులపై స్వతంత్ర మూడవ పక్ష తనిఖీలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదా? అని రాజ్యసభలో సోమవారం ఆయన "జల్ జీవన్ మిషన్"కు సంబంధించిన బడ్జెట్‌పై చర్చలో పాల్గొంటూ ప్రశ్నించారు. ఎంపీ రవిచంద్ర లేవనెత్తిన ప్రశ్నలకు జలశక్తి మంత్రి సీ.ఆర్.పాటిల్ బదులిస్తూ,దేశం మొత్తంమీద "జల్ జీవన్ మిషన్"పథకంలో కేంద్ర ప్రభుత్వ సహాయం పొందని రెండు రాష్ట్రాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో ఒకటి బీహార్ కాగా,రెండవది తెలంగాణ అని, ఈ రెండు రాష్ట్రాలు కూడా తమ సొంత నిధులతో ముందుకెళ్లాయని చెప్పారు. ఇప్పుడు నిధులు కావాలని కోరుతున్నారని, కానీ ఆ పథకం గడువు ముగిసినందున ఆ రాష్ట్రాలను "జల్ జీవన్ మిషన్" చేర్చలేమని పాటిల్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2024లో ఈ పథకాన్ని మొదలు పెట్టడం జరిగిందని, దీనిని 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంలో ఆ రెండు రాష్ట్రాలు ఎటువంటి ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)సమర్పించని కారణంగా ఈ పథకాన్ని మంజూరు చేయలేదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# కొత్త గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిన కాంగ్రెస్

**ఆరు గ్యారెంటీల ప్రస్తావన లేకుండా చేశారు**
**మహిళలకు ఇస్తామన్న 2500 హామీ ఏమైందీ..?**
**గవర్నర్ ప్రసంగంపై బిఆర్ఎస్ నేతల విమర్శలు**



**హైదరాబాద్,మార్చి16 (జనంసాక్షి) :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు నూతన గవర్నర్ ప్రసంగం లో అబద్దాలు పలికించారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం మొత్తం డొల్ల అని, చిత్తు కాగితంతో సమానమని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన గవర్నర్ తో ఈ ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెప్పించింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన స్కీంల గురించి గవర్నర్ ప్రసంగంలో లేనే లేదని,ఉన్నదల్లా కాంగ్రెస్ స్కాముల గురించే ఉందని అన్నారు. గవర్నర్ ప్రసంగంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, 6 గ్యారంటీలు, 420 హామీల పై గవర్నర్ ప్రసంగంలో లేదని పేర్కొన్నారు.మహిళలకు ఇస్తామని చెప్పిన రూ. 2,500 గురించి ప్రస్తావనే తేలేదని ,రెండేళ్ల నుంచి మహిళలను మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు.
రైతులు, నిరుద్యోగులు వృద్ధులు , వితంతువులు , వికలాంగుల గురించి ప్రస్తావనే తేలేదని పేర్కొన్నారు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధు కూడా సక్కగా రావడం లేదని రైతులు నిలదీస్తు న్నారని వివరించారు. రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి మేము ఇచ్చామని చెప్పుకుంటున్నారు. 12 వేల ఉద్యోగాలు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గవర్నర్ తో అబద్ధం చెప్పించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు అయ్యేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు చట్ట బద్దత కల్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ముగిసేంత వరకు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపామని వెల్లడించారు. అసెంబ్లీ సాక్షిగా ఆరు గ్యారెంటీలకు చట్ట బద్దత కల్పిస్తామని కాంగ్రెస్ చెప్పిందని, అసెంబ్లీ దేవాలయం లాంటిది, దేవాలయం లాంటి అసెంబ్లీలో అబద్దాలు చెప్పారని ఆరోపించారు. కొత్తగా వచ్చిన గవర్నర్ తో అబద్దాలు చెప్పించారని, అబద్దాలు చెప్పినందుకు గవర్నర్ దేవాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల్లో గవర్నర్ చేత కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధం చెప్పించిందని ఎమ్మెలేయ పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారెంటీ ల గురించి గవర్నర్ ప్రసంగంలో లేనే లేదని సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పేర్కొన్నారు. మొదటి వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లకు పైగా అవుతుంది. ఇచ్చిన హామీలపై గవర్నర్ ప్రసంగంలో ఉంటుందేమో అనుకున్నాం. కాని ఆ ఊసే లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడో బ్జడెట్ ప్రవేశపెడుతుందని అన్నారు. రైతు భరోసా 15 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదు. రైతు భరోసా ఇస్తున్నాం. రైతుల అకౌంట్లో పడుతుందో, లేదో నాకు తెలియదని రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి , తులం బంగారం ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదు. ఒకే ఇంట్లో ఇద్దరికి పించన్లు ఇస్తామని చెప్పారు. యువకులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ అంశాలు గవర్నర్ ప్రసంగంలో లేనే లేదని అన్నారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వెళ్లి యువకులను రెచ్చగొట్టారని ఆరోపించారు.

# రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- కాజీపేటను రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి
- హైస్పీడ్ రైలు ప్రాజెక్టులకు స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించి పనులు వేగవంతం చేయాలి
- పార్లమెంట్లో ఎంపీ డా. కడియం కావ్య



**వరంగల్ బ్యూరో, మార్చి 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రైల్వే మౌలిక వసతుల అభివృద్ధిపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య బలంగా స్వరం వినిపించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైల్వే మంత్రిత్వ శాఖ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఎంపీ పాల్గొని తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఔషధ పరిశ్రమలు, పారిశ్రామిక రంగాల్లో వేగంగా ఎదుగుతున్నప్పటికీ రాష్ట్రంలోని రైల్వే మౌలిక వసతులు ఆ స్థాయిలో అభివృద్ధి చెందలేదని ఎంపీ పేర్కొన్నారు. దశాబ్దాల పోరాటాల ఊతంగా కార్యరూపం దాల్చుతున్న రైల్వే మాన్యు ఫాక్చరింగ్ యూనిట్ లో స్థానికులకు ఉపాధి ఉద్యోగావకాశాలు తప్పనిసరిగా కల్పించాలని ఈ దిశగా జరిగే అన్ని ప్రయత్నాలకు తాను నాయకత్వం వహిస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేసారు.ప్రత్యేకంగా దేశంలోనే అత్యంత రద్దీగా మారిన కాజీపేట జంక్షన్‌ను డీకాంజెస్ట్ చేయడం అత్యవసరమని ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో కాజీపేటలో ప్రతిపాదిత రైల్ అండర్ రైల్ టన్నెల్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. అలాగే ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌ను తక్షణమే ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా పరిపాలనా సౌలభ్యం కోసం కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే జోన్ లేదా బలమైన సబ్ జోన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరు, పుణే నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్వే కారిడార్ల ప్రకటనను స్వాగతించిన ఎంపీ డా. కడియం కావ్య, వాటి అమలు కోసం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించి పనులు వేగవంతం చేయాలని కోరారు. తెలంగాణలో వెనుకబడిన మరియు గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు ట్రాక్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని కూడా ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా ఈ ప్రాజెక్టులు అత్యంత కీలకమని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు.

# సిద్ధారెడ్డికి అవార్డు మానవీయ కవిత్వానికి ఇచ్చిన అవార్డు

## జూలూరు గౌరీ శంకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ మట్టికి అక్షర రూపం ఇచ్చిన నందిని సిద్ధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఇవ్వటం మానవీయ కవిత్వానికి వలస జీవుల మట్టి పాదాలకు అవార్డును ఇవ్వటం అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ బహుజన ఉద్యమ కవి జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. బతుకు ప్రయాణమై కరోనాకాలంలో కాలినడకనబోయిన వలస జీవుల కోసం వారి చితికిన బతుకుల జీవితాలను చిత్రించిన అనిమేషకు అవార్డు నివ్వడంతో సాహిత్య అకాడమీ అవార్డుకు వన్నెతెచ్చినట్లు అయిందని జూలూరు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతికి మనిషికి ఉన్న జీవభంధాన్ని కావ్యంలో లిఖిస్తూ స్వార్థపు గొడ్డలితో మనిషి చేసిన ప్రకృతి విధ్వంసాన్ని సిద్ధారెడ్డి కవితాత్మకంగా కావ్యం లో వివరించారు. విధ్వంస కాలంలో వందల వేల కిలోమీటర్లు నడుచుకుంటూ పోయిన వలస దుఃఖాన్ని వలస కథల్ని అనిమేషకావ్యంగా అందించి విశ్వపీఠం మీద నిలిపారని తెలిపారు. వాహనాలు లేవు/ ఉన్నది కాళ్ళే / ఏవి నడవకపోయినా నడవాల్సింది కాళ్ళే / కాళ్లు నడవకపోతే / కడుపు నడవదు..... ఇలా వలస జీవుల కన్నీటి గాథలు చెబుతూ కరుణ లేని కాలం కఠినత్వాన్ని చాటి చెప్పిన కవిగా నందిని సిధారెడ్డి తెలుగుసాహిత్య జెండాగా నిలిచిపోయారని అభివర్ణించారు. అనిమేషకు అవార్డు ను ఇచ్చి సాహిత్య అకాడమీ తన మానవీయతను చాటుకుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్ నార్సింగ్‌లో దారుణం

## ఆరేళ బాలికపై కామాంధుడి అత్యాచారం..హత్య

**హైదరాబాద్,మార్చి16 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెల్ని పిండేసే ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మానవత్వం అనే విషయాన్ని మంట కలుపుతూ కేవలం ఆరేళ్ల వయసున్న ఓ చిన్నారిపై అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు నార్సింగిలో నివసించే ఆరేళ్ల బాలిక ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ ఉంది. అయితే ఉనట్లుంది కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారి అదృశ్యంపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి, తన వెంట తీసుకువెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఆధారాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, కొద్దిసేపటికే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన దారుణానికి పాల్పడినట్లు అంగీకరించాడు. బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై ఎక్కడ దొరికిపోతానో అన్న భయంతో ఆమెను దారుణంగా హత్య చేసినట్లు తెలిపాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడు చూపిన ప్రాంతంలో పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఉన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వేగంగా విచారణ చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే బాలిక మృతితో కుటుంబం కన్నీరుమున్నీరయ్యింది.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వృద్ధురాలు

**నిర్మలా సీతారామన్ డీప్‌ఫేక్ ఫోటోలతో మోసం**
**ఏకంగా రూ. 87.96 లక్షలు కొట్టేసిన మోసగాళ్లు**

**హైదరాబాద్,మార్చి16 (జనంసాక్షి) :** సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులతో ప్రజల వద్ద నుండి డబ్బులు లాగేస్తున్నారు. తాజాగా దేశ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫోటోలు, వీడియోలనే వాడుకుంటూ కేటుగాళ్లు రెచ్చిపోయారు. డీప్ ఫేక్ సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియోను చూసి నిజమని నమ్మిన ఓ వృద్ధురాలు ఏకంగా రూ. 87.96 లక్షలు పోగొట్టుకున్న ఘటన మల్కాజిగిరిలో వెలుగుచూసింది. అసలేం జరిగిందన్న విషయానికి వెళితే.. బాధిత వృద్ధురాలు సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుండగా, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి వివరిస్తున్నట్లు ఉన్న ఒక వీడియో ఆమె కంటపడింది. అది ఏఐతో సృష్టించిన నకిలీ వీడియో అని తెలియని ఆమె, సాక్షాత్తు మంత్రి గారే చెబుతున్నారు కదా అని నమ్మి ఆ వీడియో లింక్‌ను క్లిక్ చేశారు. లింక్ క్లిక్ చేసిన వెంటనే సైబర్ కేటుగాళ్లు రంగంలోకి దిగారు. బాధితురాలికి వాట్సాప్ కాల్స్ చేసి తాము పెద్ద ట్రేడింగ్ సంస్థ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 'ట్రేడ్ యాప్' అనే ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇందుకోసం ఆమె ఐడీ ప్రూఫ్స్, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకుని, ఒక యూజర్ ఐడీ, పాస్వర్డ్ క్రియేట్ చేసి ఇచ్చారు. ఇక అంతే వారి అసలైన ప్లాన్ అమలు చేశారు. మొదట నమ్మకం కలిగించడానికి కేవలం రూ. 60 వేలు ఇన్వెస్ట్ చేయించారు. ఆ తర్వాత లాభాలు వస్తున్నట్లు నకిలీ గ్రాఫిక్స్ తో స్క్రీన్ పై చూపించి.. దఫదఫాలుగా మొత్తం రూ. 87.96 లక్షలు డిపాజిట్ చేయించుకున్నారు. తన అకౌంట్‌లో భారీగా డబ్బు కనిపిస్తుండటంతో, బాధితురాలు ఆ మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించారు. అయితే సాంకేతిక కారణాలు చెప్తూ కేటుగాళ్లు ఆమెను అడ్డుకున్నారు. ఎంత ప్రయత్నించినా డబ్బు చేతికి రాకపోవడంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఇక బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ డబ్బు ఏ అకౌంట్ల లోకి వెళ్లిందో దర్యాప్తు చేస్తున్నారు.



# నిజామాబాద్ జిల్లాభివృద్ధికి సీఎం సుముఖత

## ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టే ప్రతిపాదనపై చర్చలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జిల్లా ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి,రాకేష్ రెడ్డి, వెంకటరమణ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందులో భాగంగా డిచ్‌పల్లి మండలం గన్నారం ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి చర్యలపై చర్చ జరిగింది. గన్నారం ప్రాంతంలో 25 కోట్ల రూపాయల వ్యయంతో ఒక ఎకరా భూమిలో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అలాగే జిల్లా భవిష్యత్ అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో దశలో నిజామాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టే ప్రతిపాదనపై కూడా చర్చలు జరిగాయి. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370